# విశ్వాసము కొరకైన ఆహారము

ఓ బైబిలు సూచిక

రిచర్డ్ ఎ. బెన్నెట్ అమెరికా, కెనడా, యూరోప్ మరియు ఆఫ్రికా దేశాల్లో గత నలపై సంవత్సరాలుగా అనేక సంఘాల్లో, సభల్లో మరియు బైబిలు కళాశాలల్లో వ్యక్తిగతంగా పరిచర్య చేసారు. వాటిలో ఇర్వై సంవత్సరాల పాటు ఆ బైబిలు భోధనలను ఐదు ఖండాలలో వరుసగా మిషినరీ రేడియో స్టేషన్స్ ద్వారా, ట్రాన్స్ వరల్డ్ రేడియో మరియు ఫార్ ఈస్ట్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో ప్రసారం చేయబడినవి.

రిచర్డ్ తన భార్య డోరతితో కలసి మనస్పూర్తిగా తిరిగిలేచిన యేసుక్రీస్తును అనేకులు అతి సన్నిహితమైన విధానంలో తెలుసుకొనవలెనని ఆశిస్తూ పరిచర్య చేస్తున్నారు.

"అత్యున్నతమైన మేలు కొరకు, ఆత్మీయాహారమును గ్రహించి, వినియోగించి, జీర్ణించుకొనవలెను. డా. బెన్నెట్ గారు ఈ పద్ధతి ఏ విధంగా సాధ్యపడుతుందో తెలియజేస్తున్నారు."

డా. స్టీఫెన్ ఓల్‌ఫొర్డ్



ISBN 81-7362-585-9

Rs.35.00

Food for Faith (Telugu)

www.ccim-media.com

విశ్వాసము కొరకైన ఆహారము

బెన్నెట్

# విశ్వాసము కొరకైన ఆహారము



## రిచర్డ్. ఎ. బెన్నెట్

# విశ్వాసము
# కొరకైన ఆహారము

Cross Currents International Ministries

# విశ్వాసము
# కొరకైన ఆహారము

## ఒక బైబిలుగ్రంథ నియమావళి

దేవునితో నిత్యమైన, స్థిరమైన సహవాసము
కొరకు మార్గదర్శక సూత్రములు

రిచర్డ్. ఎ. బెన్నెట్

అనువాదము : డా॥ డి. ఆర్. వి. దినకర్

OM Books
Secunderabad

www.CCIM-Media.com

‘సిలువ ప్రవాహముల ద్వారా అంతర్జాతీయ సువార్త సేవ’ అను ఈ పరిచర్యలో నాతోను, నా భార్యతోను ప్రయాసపడిన ప్రతి ఒక్క జత పనివానికి, మన ప్రభువైన యేసు క్రీస్తు నామమున ఈ పుస్తకము ప్రేమ పూర్వకముగా అంకితము చేయబడినది.

‘సిలువ ప్రవాహముల ద్వారా అంతర్జాతీయ సువార్త సేవ’ యొక్క విస్తరణలో భాగముగా, "**విశ్వాసము కొరకైన ఆహారము**" అను ఈ పుస్తకము ఇప్పటికే అరబిక్, ఫ్రెంచ్, జర్మనీ, హంగేరియన్, కొరియన్, పోర్చుగీస్ మరియు రష్యన్ భాషలలో ముద్రించబడినది. ఇతర భాషలలోనికి ఇంకను తర్జుమా చేయబడి ముద్రింపబడవలసి యున్నది.

B

# విషయ సూచిక

ముందు మాట ........................................ 9

ఉపోద్ఘాతము ........................................ 11

**1. అనుదిన ఆనందము** ........................................ 17

**2.** శిరస్సు మరియు హృదయము ........................................ 27

(a) శిరస్సు

(b) హృదయము

**3.** ప్రార్థనాపూర్వక సిద్ధబాటు ........................................ 41

(a) నీ మోకాళ్ళు వంచుము

(b) నీ హృదయమును ఖాళీచేయుము

(c) నా పరలోకపు అవలోకనము

(d) నా భూలోకపు సమస్య

**4.** సహవాస సమయము ........................................ 73

(a) విధేయత యొక్క ప్రతిఫలము

(b) విశ్వాసమును స్వతంత్రించుకొనుట

(c) యదార్థ ఆరాధన

(d) వాక్యములోని యుద్ధ సామగ్రి

**5. విశ్వాస లక్షణము** .......................................... 95

**6. ప్రకటించే సమయము** .................................... 109

ఉప్పొంగే సువార్తసేవ

**7. ఫలము లేదా అగ్ని** ....................................... 123

(a) తెల్లని కాగితములు

(b) వ్యర్థమైన సంవత్సరములు

(c) నిత్యమైన వెలుగు

**8. వచ్చి భోజనము చేయుడి** ................................ 133

**అనుబంధములు:** ................................................ 151-153

(a) సహవాస సమయము

(b) బైబిలు ధ్యానము

(c) అనుదిన ప్రార్థనా బోధిని

**9. ప్రతి దిన ప్రార్థనామార్గదర్శి** ................................. 154

# ముందుమాట

డా॥ రిచర్డ్ ఎ. బెన్నెట్‌గారు వ్రాసిన "విశ్వాసము కొరకైన ఆహారము" అను మరొక నూతన పుస్తకమును మీకు సిఫారసు చేయుట గొప్ప ఆధిక్యతగా భావించు చున్నాను. వారి యొక్క ముందు పుస్తకమైన "దేవుని కొరకై నీ అన్వేషణ"కు, ఈ పుస్తకము తగిన అనుసంధానమై ఉన్నది. విశ్వాసము లేకుండ మనిషి దేవునియొద్దకు రాలేడు (హెబ్రీ. 11.6). అలాగే విశ్వాసము లేకుండా మనిషి దేవుని కొరకు జీవించలేడు. (రోమా 1:17). ఈలాగు జరుగుటకు ప్రారంభము నుండి (రోమా 10:17) చివరి వరకు (I పేతురు 2:1-3; హెబ్రీ 5:12-14) నిత్యము, విశ్వాసము పోషింపబడు చుండవలెను. మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలనను జీవించును (మత్తయి 4:4), అని సెలవిచ్చుట ద్వారా ప్రభువు ఈ విషయమును స్థిరపరచినారు. "నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని. సైన్యముల కధిపతివగు యెహోవా, దేవా, నీ పేరు నాకు పెట్టబడెను" అని వ్రాయుట ద్వారా ఇదే విశ్వాసమును యిర్మియా రూఢి పరచుచున్నాడు యిర్మియా (15:16)

అత్యధికమైన మేలు పొందుటకు – ఆత్మీయ ఆహారమును చక్కగా గ్రహించుకొనవలెను, స్వంతము చేసికొనవలెను, పూర్తిగా జీర్ణించుకొన వలెను. దేవునితో మనము 'ఐక్యముచెందు' సమయములో ఈ పనులు ఏలాగున క్రమముగా జరుగునో డా॥ బెన్నెట్ గారు వివరించిరి. మరి ముఖ్యముగా 8వ అధ్యాయము పై అంశములకు ఎంతో ఉపయోగపడును.

లౌకికవాద, మానవత్వమున్న ఈ రోజులలో సగటు క్రైస్తవుడు కూడ "విశ్వాసి అంతరంగములో జీవించే (గలతీ 2:20) క్రీస్తు మీద సంపూర్ణ

విశ్వాసము లేకుండా కూడా దేవుని కొరకు జీవించ వచ్చునని, 'మతిమార్పిడి' (బ్రెయిన్ వాష్) చేయబడుచున్న ఈ కాలములో "విశ్వాసముకొరకైన ఆహారము" అను ఈ పుస్తకము మనందరి నిమిత్తము పరలోకము నుండి వచ్చిన వర్తమానమై యున్నది. ఈ పుస్తకము తన పని మీద ముందుకు కొనసాగుచూ, జరిగించు సేవను దేవుడు మరింతగా దీవించును గాక. ఆమెన్.

డా॥ స్టీఫెన్ యఫ్. ఓల్ఫోర్డ్
వ్యవస్థాపలు, అధ్యక్షులు
బైబిల్ సంబంధమైన బోధనా సంస్థ
మెంఫిస్, టెన్నెస్సీ.

# ఉపోద్ఘాతము

నేను, నా భార్య వివాహము చేసికొని ఇర్వైఐదు సంవత్సరములు గడచిన సందర్భముగా వ్రాసిన 'దేవుని కొరకై నీ అన్వేషణ' అనే పుస్తకమునకు, ప్రస్తుత పుస్తకము నిజమైన అనుసంధానమై యున్నది. ఆ సమయములో, దేవునికి మా యొక్క కృతజ్ఞతార్పణ తెలియజేయుటకు మేము బోధించిన ప్రసంగములను ముద్రించి పుస్తకరూపములోనికి తేవలెనని తలంచితిమి.

'దేవుని కొరకై నీ అన్వేషణ' మొదటి ముద్రణలో ఇర్వై ఐదు వేల ప్రతులు ముద్రించబడినది. అప్పటి నుండి దేవుడు మా అల్పమైన ప్రేమార్పణను మాబహు ప్రత్యేకమైన రీతిలో దీవించుచూ ఉన్నారు.

ఈ రోజున ప్రపంచమంతటా 20 లక్షల ప్రతులు 30 కంటె ఎక్కువ భాషలలోనికి తర్జుమా చేయబడి, పంపబడి ఉన్నవి. ఆశ్చర్యకరముగా ఆ పుస్తకము యొక్క ఆవశ్యకత ఇంకనూ పెరుగుచూ ఉన్నది. ఆ పుస్తకమును చదువుట ద్వారా తిరిగి జన్మించిన అనేకులు ఇచ్చు సాక్ష్యములు, ప్రపంచపు నలుమూలల నుండి వచ్చుట మాకు అత్యధిక ఆనందమును కలిగించు చున్నది.

ఆ తరువాత మేము మా యొక్క 35వ వివాహ సాంవత్సరీకమును జరుపుకొన్నైయుంటిమి. ఈ పది సంవత్సరముల మధ్య కాలములో సువార్తకు ద్వారములు తెరవబడి 'దేవుని కొరకై నీ అన్వేషణ' ఊహించని విధముగా వ్యాప్తి చెందినది. ఆ కారణము చేత మా పరలోకపు తండ్రికి మా ప్రేమను, కృతజ్ఞతను తెలియజేయుటకు "విశ్వాసము కొరకైన ఆహారము"ను అచ్చు వేయించి, ముద్రించుటకు మించిన మార్గము మరొకటి లేదని తలంచితిమి. 'దేవుని కొరకై నీ అన్వేషణ' అను మా మొదటి పుస్తకమును ఆశీర్వదించిన ప్రభువే, ప్రపంచమంతటా క్రీస్తులో నూతన జీవితము కనుగొనుచున్న వారందరికీ ఉపయోగపడునట్లు, ఈ మా రెండవ పుస్తకమును కూడ తన మహిమ కొరకు వాడుకొనును గాక. ఆమెన్.

ఈ పుస్తకము, మా మొదటి పుస్తకమునకు కేవలము అనుసంధానమైనదే కాదు. ఎందుకనగా, ప్రభువులో మిక్కిలి సన్నిహిత సహవాసమును ఆశించు ప్రతి విశ్వాసికి ఈ పుస్తకము గొప్ప సహాయకారిగా ఉండునని మా ఇద్దరి యొక్క ప్రగాఢ విశ్వాసము. దీనిని చదువు ప్రతి వ్యక్తి, తన క్రైస్తవ జీవితములో ఒక ప్రత్యేకమైన ప్రోత్సాహమును, నడిపింపును పొందవలెను అనెడి నమ్మకమైన ప్రార్థనతో ఈ పుస్తకమును వ్రాసితిమి.

అలవాటు ప్రకారముగా చదువుటకు లేదా చదివి ప్రక్కన పడవేయుటకు ఇది వ్రాయబడలేదు గాని జాగ్రత్తగా చదివి, ఒక రిఫరెన్స్ పుస్తకముగా ఎప్పుడూ అందుబాటులో ఉంచుకొనుటకు ఇది ఉద్దేశించబడినది. ఈ పుస్తకములోని సూత్రములు విశ్వాసపూర్వకముగా మన జీవితములకు అన్వయించుకొనిన యెడల, ప్రభువుతో నిలకడైన, అన్యోన్యమైన సహవాస మును ఏలాగున అభివృద్ధి చేసికొనగలమో నేర్చుకొన గలము.

అప్పుడప్పుడు వైద్య సలహాలు తీసికొనుట ఎంతో అవసరమని మనలో అనేక మంది భావిస్తాము. ఇందుకొరకు డబ్బును, సమయమును ఖర్చు చేస్తాము. ఏ ఆరోగ్య సమస్యలోనైనా, వైద్యుడు రోగిని మొదట అడుగు ప్రశ్నలపై, రోగ నిర్ధారణ మరియు తదుపరి చికిత్సా విధానము ఆధారపడి ఉండును. అలాగే క్రైస్తవులకు కూడా వారి ఆత్మీయతను పరీక్షించగల పరిశీలనాంశములు ఉండుట ఎంతో మంచిది. ఇందుకొరకు నిజమైన యధార్థతతో, ప్రభువుతో ఏకాంతముగా గడుపుటకు మనము కొంత సమయమును ప్రత్యేకించుకొనవలెను. మీ యొక్క వ్యక్తిగత ఆత్మీయ జీవిత పరిశీలనకు ఉపయోగపడు కొన్ని ప్రశ్నలు, ప్రతి అధ్యాయము చివరను సూచించబడినవి. వీటిలో కొన్ని మిమ్ములను ఇబ్బంది పెట్టవచ్చును. అయితే, ఏ రోగ నిర్ధారణ పరీక్షలోనైనా, బహు బాధగా ఉండే స్థలమే, రోగము నకు మూలస్థానము అయి ఉంటుందని దయచేసి గుర్తుంచుకోండి. ఈ పుస్తకమును వ్రాయుచున్నపుడు నా స్నేహితుడైన లేటు. డా॥ జె. ఎడ్విన్ ఓర్ చెప్పిన ఒక సంగతి నా మనసులోనికి వచ్చినది. అదేమనగా – కేవలము విజ్ఞాపన ప్రార్థన చేయుట కొరకు ఏర్పాటు చేయబడిన ఒక జాతీయ సదస్సుకు, తనతోపాటు ఒక గొప్ప ప్రసంగీకుడును, మరి కొందరు క్రైస్తవ నాయకులును పిలువబడిరి. అయితే ఆ గొప్ప ప్రసంగీకుడు ఆ ఆహ్వానమును మర్యాద పూర్వకముగా తిరస్కరించి, తాను ఆ దీర్ఘ విజ్ఞాపనలకు హాజరు కాలేనంత బిజీగా ఉన్నానని తెలియచేసాడు. అయితే అదే ఉత్తరములో తాను 'ప్రార్థన' అను అంశము మీద గొప్ప ప్రసంగమును తయారు చేసితిననియు, వారు మరలా కూడుకొను కూటములో ఆప్రసంగము చేయుటకు ఆశించు చున్నాననియు వారికి తెలియజెసెను. అప్పుడుగాని 'నిజముగా విజ్ఞాపన చేయుట కంటె, ప్రార్థించుట అనే అంశము మీద ప్రసంగించుట మరియు వ్రాయుట ఎంత తేలికో"! నాకు అర్థము కాలేదు. కాబట్టి, ఒక నిష్ణాతు నిగా నేను దీనిని వ్రాయుట లేదుగాని, ఆకలితో ఉన్న వ్యక్తి, అంతే ఆకలితో ఉన్న మరి కొందరకు, వారు ఆహారము ఎక్కడ కనుగొనగలరో తెలియచేయు వానివలె నేను ఈ పుస్తకమును వ్రాయుచున్నాను.



ఈ పుస్తకమును వ్రాయుటలో నా భార్య డోరతీ నన్ను ప్రోత్సహించుట మాత్రమే గాక, దేవునితో నేను ఏకాంతముగా ఎక్కువ సమయమును గడుపుటకు తీవ్రముగా శ్రమించినది. నేను డోరతీని కలుసుకొనక ముందు C.T. స్టడ్‌గారు చేసిన అనేక ప్రార్థనలలో ఈ ప్రార్థనను చదివితినని నాకు బాగా జ్ఞాపకమున్నది. "ప్రభువా! మీరు నాకొక భార్యను ఇవ్వతలంచిన యెడల – క్రీస్తు కొరకున్న నా పట్టుదలను వదలివేయుటకు నేను శోధింపబడినపుడు, నన్ను నిత్యము మండించే ఒక ఎర్రని పట్టుకార వలె ఆమెను ఉంచుము". అంత గొప్ప భార్యతో జతపర్చబడటము ఎంత గొప్పధన్యత! దేవునికి స్తోత్రము.

నా ఆత్మీయ తండ్రియైన డా॥ స్టీఫెన్ ఓల్‌ఫోర్డ్‌గారు నన్ను క్రీస్తులోనికి నడిపించి 50 సంవత్సరములకు పైగా గడచినవి. యెడతెగక ప్రార్థన చేయుటకు, బైబిలు చదువుటకు గల ఔన్నత్య స్థితిని స్టీఫెన్‌గారు అపుడే నాకు బోధపరచినందుకు నేను వారికి కృతజ్ఞుడను.

ఇందులో వ్రాయబడిన విషయములు నా అనుదిన వాక్యధ్యానము నుండి గ్రహించినవై యున్నవి. దేవుడు తన దయచొప్పున పంపించిన అనేక దైవ

సేవకుల వాక్య జ్ఞానము నుండి కూడ ఇందులోని ఇతర సత్యములు వివరించబడినవి. ఇంత చిన్న పుస్తక ప్రచురణలో వారినందరినీ గుర్తించుట కష్టము గనుక ఆ ప్రతి ఒక్కరిని బట్టీ నేను దేవుని స్తుతించుచున్నాను.

'విశ్వాసము కొరకైన ఆహారము' అను ఈ పుస్తకమును ముద్రించుట ద్వారా, తన విశ్వాస పుత్రుడైన తిమోతీకి పౌలు ఇచ్చిన ఆజ్ఞకు నేను లోబడుచున్నాను. “నీవు అనేక సాక్షుల యెదుట నావలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగించుము" (II తిమోతీ 2:12)

విశ్వాసులు ప్రభువైన యేసుతో స్థిరమైన సహవాస ఆనందమును అనుభవించుటకు ఈ పుస్తకము వ్రాయబడినను, నిత్య జీవమును గూర్చిన నమ్మకము, పాపములు క్షమింపబడిన సంతోషము లేనివారు కూడ దీనిని చదువవచ్చును. అటువంటి వారు ముందుగా యోహాను సువార్తను చదువవలసినదిగా నేను ప్రోత్సహించుచున్నాను. అప్పుడు ఈ సువార్త ఏలాగున నీకు ప్రయోజనకరమో తెలుసుకొన గలవు. "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" ( యోహాను 20:31)

# విశ్వాసము
# కొరకైన ఆహారము

**నీ వాక్యములు నా జిహ్వకు ఎంతో మధురములు**
**అవి నా నోటికి తేనె కంటె తీపిగా నున్నవి.**
**బంగారు కంటెను అపరంజి కంటెను నీ ఆజ్ఞలు**
**నాకు ప్రియముగా నున్నవి.**

**(కీర్తనలు 119:103, 127)**

## అధ్యాయము - 1

# అనుదిన ఆనందము

కొద్ది కాలము క్రితము ఘనురాలైన ఒక క్రైస్తవ స్త్రీ, "అయ్యా! నేను ప్రభువుతో మరింత సన్నిహితమైన సహవాసము కలిగియుండులాగున దయచేసి నా కొరకు ప్రార్థించండి" అని వినయముతో మనవి చేసినది. అవును, మనిషికి, మనిషికి మధ్య ఉండే సన్నిహిత సంబంధములలో ఏలాగున అనేక అంతరములుంటాయో అలాగే క్రైస్తవులకు క్రీస్తుతో గల వారి సంబంధములలో కూడ అనేక అంతస్థులు ఉంటాయి అనేది మరింత వాస్తవమై యున్నది.

మానవ సంబంధములలో కూడ – ఒకరి ఇష్టములు ఒకరికి నచ్చుట ద్వారా, ఆలోచనలు కలియుట ద్వారానే, ఉద్రేకపూరిత బంధముల యొక్క నిజమైన కలయికలు ఫలభరితము కాగలవు.

ఉదాహరణకు, కొద్ది కాలము క్రితమే మాకు గొప్ప ఆనందమును కలిగించిన ఒక ఉత్తరము ఇద్దరు ఆఫ్రికా సహోదరుల నుండి వచ్చినది. అందులో "నిన్ననేమేము మా పాప డోరతీని హాస్పటల్ నుండి తీసుకు వచ్చాము. ఆమె పేరుకు తగినట్లుగానే చక్కగా నెమ్మదిగా ఉన్నది. 3కేజీల బరువుతో ఆరోగ్యముగా ఉన్నది." ఆ కుటుంబమునకు ఎంత చెప్పశక్యముకాని ఆనందమో!

తమ బిడ్డను జాగ్రత్తగా ఇంటికి తీసికొని వచ్చు తలిదండ్రుల యొక్క ఆనందాతిశయములో పాలుపంచుకొనుట ఎంత హాయిగా నుండునో కదా! బిడ్డ ఎదిగే కొలదీ వారి సంతోషము కూడా పెరుగుచుండును. ఆ బిడ్డే మొదటి సారిగా నవ్వి, కాళ్ళు ఆడించినపుడు మనము ఆనందముతో ఉబ్బితబ్బిబ్బు అవుతాము. ఆ చిన్ని వేళ్ళు, సున్నితమైన మోకాళ్ళు, మొదటిగా వేసే ఆ చిన్ని అడుగు, ఆ తరువాత అమ్మ, నాన్న అని పిలిచే ఆ మధురమైన ఘడియలు ఎంత అత్యద్భుతమో కదా!

అపుడే పుట్టిన బిడ్డ, తన ఎదుగుదలకు కావలసిన వనరులన్నీ, నిజముగా తనలోనే కలిగి ఉండుట మానవ జ్ఞానమునకు మించిన అద్భుతమై యున్నది. అయితే క్రీస్తునందు ఒక వ్యక్తి నూతనముగా జన్మించుట కూడా మరింత గొప్ప ఆశ్చర్యమై యున్నది. తాను ఆత్మీయముగా పుట్టిన గడియ నుండి పరిపూర్ణమైన ఆత్మీయతలోనికి ఎదుగు ప్రయాణములో ఆ వ్యక్తి వేసే మొదటి అడుగు ఎంత అద్భుతమైనదో కదా!

అయితే దురదృష్టవశాత్తు, జీవితమనేది ఎపుడూ కూడ పుట్టినప్పటి ఆనందము నుండి పూర్తిగా ఎదిగిన వృద్ధాప్యము వరకు, ఒకే రీతిలో ఉండదు. ఎందుకంటె, డోరతి పుట్టినట్లు తెలిసిన ఆ వారములోనే మాకు బాగా పరిచయులైన ఒక దంపతుల 21సం॥ల కుమార్తె సిన్‌సిన్నటి, ఓహియోలో చనిపోయినదనే వార్త విన్నాము. ఆమె తన 21 సం॥ల జీవితములో ఎన్నడూ బాల్య దశ నుండి పైకి ఎదగలేదు. మానసికముగాను, శారీరకముగాను, సామాజికముగా కూడ ఆమె ఎదగలేదు. అయితే ఆమె తలిదండ్రులు ఎంతో



ప్రేమతో 'కేరల్ జాయ్' (ఆనంద గీతిక) అను పేరు పెట్టి పెట్టినప్పటికీ, చనిపోయే సమయమునకు ఆమె ఇంకనూ 21 సం॥ల పసి పాపే. తన తలిదండ్రులతో మాట్లాడే సామర్థ్యము ఆమెలో కుచించుకు పోయినది. మానవరీత్యా ఆలోచిస్తే ఆమె జీవిత ప్రయాణము వేగముగా క్షీణించి, త్వరగా ముగిసినది.

కేరల్ ఏలాగున తన బాల్య దశకు మించి పరిణితి చెందలేదో అలాగే నేటి క్రైస్తవ సంఘములో అనేకులు తమ ఆత్మీయ బాల్య దశనుండి పైకి ఎదుగుట లేదు. వారు అనేక సంవత్సరముల నుండి క్రైస్తవులై ఉన్నప్పటికీ వారు నిజముగా క్రీస్తులో, ఎన్నడూ ఎదగలేదు. అయినను నూతనముగా జన్మించిన ప్రతి ఒక బిడ్డకొరకు దేవుడు ఆత్మీయ ఆహారమును అనుగ్రహించెను. వారు సరిగా గ్రహించిన యెడల ఆ ఆహారమే వారిలో ఆత్మీయ వృద్ధిని కలిగించును.

ఆత్మీయముగా నీ జీవితము కురుచది కాకుండు నిమిత్తము దేవుడు ఏర్పర్చిన పోషకాహారము బైబిలే. **ఆత్మీయ వినోదము** అనే బాల్యదశ నుండి, **ఆత్మీయ స్థిరత్వము** అనే యవ్వన ప్రాయము వరకు, అక్కడ నుండి **ఆత్మీయ పరిపూర్ణత** అనే పెద్ద వయసు వరకు నీవు ఎదగవలెనంటే దైవ గ్రంథమైన బైబిలు నుండి బలమైన ఆహారమును అనుదినము తప్పని సరిగా అందుకొన వలెను. అయితే బైబిలు చదువుటను ఒక విధిగా దేవుడు నియమించలేదు గాని, అంతకంటె గొప్పదిగా అనగా – తాను సిద్ధపరచిన ఆహారములో పాలుపొందు, ఆకలిగొనిన ప్రతి క్రైస్తవుని జీవితమునూ నూతనపరచగల్గిన ఆనంద ఆహారముగా దేవుడు దానిని ఉంచెను.

అవును, నీ ఆత్మీయ పోషణకు ఒక సాధనముగా దేవుని వాక్యమును ఏలాగు సంగ్రహించుకొనవలెనో నీవు అర్థము చేసికొన్నపుడు, నిజముగా ఆ వాక్యమే నీలో స్థిరమైన, నిత్యానందమునకు కారణమగును.

ప్రవక్తయైన యెషయా ద్వారా దేవుడు, ఆత్మీయ ఆహారముకొరకు ఆకలి దప్పికలు గలవారిని, తన భోజనపు బల్లయొద్ద తనతో భోజనము చేయుటకు, దయా పూర్వకముగా ఆహ్వానించుచున్నాడు.

"దప్పిగొనిన వారలారా! నీళ్ళ యొద్దకు రండి. రూకలు లేనివారలారా, మీరు వచ్చి కొని భోజనము చేయుడి... ఆహారము కాని దాని కొరకు మీరేల రూకలిచ్చెదరు? సంతుష్టి కలుగజేయని దాని కొరకు మీ కష్టార్జితమును ఎందుకు వ్యయపరచెదరు? నా మాట జాగ్రత్తగా ఆలకించి, మంచి పదార్థము భుజించుడి. మీ ప్రాణము సారమైన దాని యందు సుఖింపనియ్యుడి. చెవి యొగ్గి, నా యొద్దకు రండి. మీరు వినిన యెడల మీరు బ్రతుకుదురు..."
(యెషయా 55:1-3)

అనేకులు తాము స్వయముగా దేవుని వాక్యమును చదువునప్పుడు, తమ విశ్వాసమునకు అవసరమైన ఆహారమును అందులో నుండి ఏలాగున పొందవలెనో తెలియక, బైబిలు చదువుట కంటెను, బైబిలు గురించి వ్రాయబడిన గ్రంథములను చదువుట సులువుగా భావింతురు. మీ చేతిలో ఉన్న ఈ పుస్తకము బైబిలును వివరించుటకు ఉద్దేశింపబడలేదు గాని మీరు వాక్యము చదువునపుడు, బైబిలే తనంతట తానుగా మీకు బోధించునట్లుగా వ్రాయబడినది. తద్వారా మీరు ఎక్కువ సమయము బైబిలు చదువుటకు ప్రోత్సాహింపబడుదురు. అపుడు పారదర్శకమైన, సన్నిహితమైన సహవాస జీవితములో మీ పరలోకపు తండ్రితో మీరు అత్యధికముగా ఆనందించుదురు.

తమ విశ్వాసము కొరకైన ఆహారముగా బైబిలును. అప్పుడే చదువుటకు ప్రారంభించిన విశ్వాసులతో నేనెప్పుడూ ఈలాగు చెప్పుదును.

**"ముందుగా మీకర్థమైన వాక్య భాగము చదవండి. ఆ తర్వాత మీకర్థముకాని భాగము రావచ్చును. అయినను చదువుచూ ఉండండి. ఆ వెంటనే మీకర్థమయ్యే వాక్య భాగము మరలా వచ్చును. అపుడు మీరు అర్థము చేసికొన్న వాక్యమే, మీకర్థముకాని భాగమును గ్రహించునట్లు చేయును".**

ఈ మాటలు మీకు అర్థమైనవి కదా! గనుక వాక్యమును చదువుట ఎప్పుడూ మానవద్దు, వెనుకాడవద్దు.



ప్రపంచమంతటా తరగతి గదులలోను, ఉపదేశ ప్రాంగణములలోను, పుస్తకశాలలలోను ప్రజలు, జ్ఞానము కొరకైన ఆహారమును నేర్చుకొనుటకు విద్యా సంబంధ విషయములలో ప్రయాసపడుచున్నారు. వారి వలె మనము కూడా బైబిలును కేవలము ఒక మతపరమైన పుస్తకముగా చదివితే, మనము సంపాదించుకొనునది కూడా ఆ '**జ్ఞానము కొరకైన ఆహారమే**' అగును. ఈ విషయములో బైబిలే మనలను స్వయముగా హెచ్చరించున దేమనగా *"జ్ఞానము ఉప్పొంగజేయును గాని ప్రేమ క్షేమాభివృద్ధి కలుగజేయును." (I కొరింధి 8:1)*

గనుక దేవుని వాక్యమును సరిగా గ్రహించుట ఏలాగో మనము తెలిసికొన కుండా కేవలము బైబిలు సత్యమును గూర్చిన జ్ఞానమే సంపాదించిన యెడల, అది మన ఆత్మీయ జీవితమును నిర్మించుటకు బదులు మనలో జ్ఞానాతిశ యమును కల్గించి మనలను **ఉప్పొంగ** చేయును. ప్రతి దినము మన ప్రభువుతో గడుపు సహవాస సమయములో కేవలము బైబిలు జ్ఞానమును మాత్రమే కాక, తన భోజనపు బల్ల నుండి మన పోషణ కొరకు ఆయన అందించు చున్న 'విశ్వాసము కొరకైన ఆహారమును' గ్రహించవల్సిన వారమై యున్నాము.

బైబిలు చదువుటలో ఉన్న ఆనందమును ఎరిగిన అనేక విశ్వాసులు, దానిని కేవలము విద్యాపరముగా చదువు వారికి భిన్నముగా, తమ ఆత్మీయ జీవితములకు కావల్సిన యదార్థమైన, క్రియాత్మక పోషణాధారము ఆ వాక్యములోనే ఉన్నదని కనుగొనిరి. *దైవ సహవాస జీవితములో ఉన్న నిజమైన ఎదుగుదలను అనుభవించు విశ్వాసులు వీరే.* ఈ క్రమములో వారు యదార్థమైన ఆరాధనకు, ఫలభరితమైన సేవకు మార్గము కనుగొనుచున్నారు.

ఒక సమగ్రమైన బైబిలును ముందు పెట్టుకొని, తన హృదయమును తెరచి, ధైర్యముగాను, వ్యక్తిగతముగాను, దేవుని అనుదినము కలుసుకొనుట క్రీస్తునందు జన్మించిన ప్రతిబిడ్డ యొక్క ఆధిక్యతయై ఉన్నది.

బహుశా, ఇపుడు ఈ ప్రశ్న నీ మనస్సులో ఉండవచ్చును. "మన ప్రభువైన యేసుక్రీస్తు నందలి ప్రేమలోను, జ్ఞానములోను ఎదుగుచూ, నా ఆత్మను

పోషించుకొనులాగున, నేను బైబిలును చదివే ఉత్తమ మార్గమేది?" సహవాస సమయములోనే నీవు ఈ ప్రశ్నకు జవాబును కనుగొనగలవు.

సహవాస సమయమనగా '**జీవించి ఉన్న ప్రభువుతో మనము, మనతో 'ఆయన ముఖాముఖిగా మాట్లాడుకొనుటయే**'. దైవ గ్రంథమైన బైబిలు ద్వారా కూడ దేవుడు తన పిల్లలతో మాట్లాడును. దేవుడు చెప్పుచున్న సంగతులకు మనము సరిగాను, వ్యక్తిగతముగాను, స్పందించిన యెడల, నిరీక్షణతో కూడిన విశ్వాసముతో, వాక్యానుసారముగా ఏలాగున ప్రార్థించవలెనో నేర్చుకొనగలము.

వాక్యానుసారముగా ప్రార్థించుట అనగా – మనము ప్రార్థనలో దేవునితో మాట్లాడునపుడు మనము చదివిన వాక్యభాగములోని ఆ మాటలనే ఉదహరించి ప్రార్థించుట. బైబిలు వాక్యములెత్తి ప్రార్థించుట ద్వారా, దైవ చిత్తానుసారముగా ప్రార్థించుటలో ఉన్న నెరవేర్పును బట్టి మనము ఆనందింపగలము.

పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యమును మనలో జీవింపచేసినపుడు, ఆ వాక్యములోని నిర్దిష్టమైన మాటలనే ఉపయోగించి, మన హృదయ అవసరతలకు అనుగుణముగా మనము ప్రార్థించ గలము. ఈలాగున ప్రార్థించుట ద్వారా **అదే పనిగా ఉచ్చరించు నామకార్థ ప్రార్థనల** నుండి మనము తప్పించుకొందుము. గనుక వాక్యములెత్తి ప్రార్థించునపుడు, మన జీవితములో ఆయనకున్న ప్రత్యేకమైన ఉద్దేశ్యములు, ఏర్పాటులు మరింత ఎక్కువగా తెల్సుకొని, ఆయన సహవాసములోని ఆధిక్యతను బట్టి ఆయనతో సంతోషించగలము.

దేవుని చిత్తమును మన చిత్తమునకు లోపరుచుట నిజమైన ప్రార్థన కాదు గాని మన ఇష్టమును, కోరికను దేవుని చిత్తమునకు లోపరచుటయే యదార్థమైన ప్రార్థనయై యున్నది. వసంతకాల వరదల సమయములో యెహోషువ ఇశ్రాయేలీయులను ఆశ్చర్యకరముగా యొర్దాను దాటించి



నపుడు, ఒక నూతన వ్యక్తి అతనికి ఎదురుపడెను. కనాను దేశమును జయించి దానిని అన్య ఆచారములనుండి శుద్ధి చేయుటయే దేవునికి ఇష్టమైన పని అని యెహోషువ గ్రహించెను. అందుచేత కత్తి ఒరదీసి నిలువబడిన ఆ పరదేశిని *'నీవు మా పక్షమున ఉన్న వాడవా? లేక శత్రు పక్షపు వాడవా?* అని యెహోషువ ప్రశ్నించెను. 'కాదు' అనే అనూహ్య సమాధానము అతని నుండి వచ్చెను. NIV బైబిలు ఈ మాటను 'ఏ పక్షము కాదు' అని తర్జుమా చేసెను. అపుడు యెహోషువ అతడు ఏ పక్షమునకు చెందినవాడు కాదని తలంచెను. 'యెహోవా సేనాధిపతిగా నేను వచ్చియున్నాను' అని అతను ఇచ్చిన జవాబు యెహోషువ అనుమానమును తీర్చెను.

ఆ సమయములో ఆ ప్రాంతమంతటిని స్వాధీన పర్చుకొనుటకు వచ్చిన యెహోవా దూతగా ఆ పరదేశిని యెహోషువ గుర్తించి, అతని సన్నిధిని వినయపూర్వకముగా సాష్టాంగ పడెను. *"నీవు నిలిచియున్న ఈ స్థలము పరిశుద్ధమైనది". (యెహోషువ 5:13-15)*

ఆవిధముగానే మన ప్రార్థన సమయములలో, మొదటగా మన స్వంత అవసరముల జాబితాను దేవుని ముందు ఉంచి తర్వాత ఆయనను మనతో ఉండవలెనని అడగకూడదు గానీ ఆయన ఆలోచనలకు, ఉద్దేశములకు, శక్తికి అనుగుణంగా మన ప్రార్థనా స్వరమును మార్చుకొని ఆయన పరిశుద్ధ సన్నిధిలో సాష్టాంగపడవలెను.

కాబట్టి దేవుని చిత్తమునకు, ఉద్దేశమునకు తగినట్లుగా ప్రార్థించుటయే, వాక్యానుసారముగా ప్రార్థించుటయై యున్నది. మనము ప్రార్థించునపుడెల్లా దేవుని వాక్యముతో మనలను ఐక్యపర్చుకొనుట నేర్చుకొనినపుడు; మన చిత్తమును దేవుని చిత్తమునకు సమర్పించుకొనుట మనలో ప్రతివాని యొక్క అనుభవమై యుండగలదు.

అవును, దేవుని స్వరము వినవలెననెడి యదార్థమైన ఆశతో ప్రార్థనా పూర్వకముగా నీవు బైబిలు చదివిన యెడల "మన రక్షకుడును, ప్రభువునైన

*యేసు క్రీస్తు అనుగ్రహించు కృపయందును, జ్ఞానమందును నీవు అభివృద్ధి పొందగలవు". (II పేతురు 3:18)*

దేవుని స్వరమును నిజముగా వినుటకు మన చెవులను అప్పగించిన యెడల, ఆయన చెప్పు మాటలను విని మనము తప్పక ఆనందించగలమని యెషయా వ్రాసెను.



## ఆత్మీయ పరిశీలన

1. నేను రక్షింపబడిన క్రైస్తవునిగా మారి ఎంత కాలమైనది?
2. నేను ఇపుడున్న స్థితి కంటె అధికమైన సహవాస స్థితిలో నా ప్రభువుతో ఎప్పుడైనా ఆనందించితినా?
3. ఈ రోజున్న నా జీవితమును వెనుకటి 5 సం॥లతో పోల్చిచూచినపుడు:

(a) దేవునితో ఏకాంతముగా ఎక్కువగా సమయమును నేను గడుపుచున్నానా?

(b) నా స్వంత ఊహల నుండి, దేవుని నడిపింపును నేను స్పష్టముగా గుర్తింప గలుగుచున్నానా?

ప్రార్థన

ప్రభువా! వినుటను నాకు నేర్పించుము. ఈ యుగమందలి వేలకొలది నూతన శబ్దములు నా చెవులలో హోరుమని ధ్వనిచేయుచున్నవి. గనుక 'నీ దాసుడు ఆలకించుచున్నాడు సెలవిమ్ము'అని నీతో పలికిన బాలుడైన సమూయేలు వంటి మనస్సు నాకిమ్ము. నీవు నా హృదయముతో మాట్లాడుట నన్ను విననిమ్ము. నీ స్వరము విను అభ్యాసమునకు నన్ను అలవాటు పడనిమ్ము. ఈ లోకపు స్వరములన్నీ సమసిపోయినపుడు నీ స్వరములోని రాగములే నా చెవులకు సంగీతసునాదముగా వినబడు పరిచయము కలుగనిమ్ము. ఆమెన్

- ఏ.డబ్ల్యు. టోజర్

# అధ్యాయము - 2

# శిరస్సు మరియు హృదయము

కొన్ని సంవత్సరముల క్రితము దక్షిణ కెన్యా ప్రాంతములో జరిగిన పాదుర్ల సమావేశములో దేవుని వాక్యమును బోధించు ఆధిక్యత మాకు కలిగినది. సాయంకాలము 7గం॥లకు జరుగు కూటములో పాల్గొనుటకు కొందరు పాదుర్లు ఆ రోజు ఉదయము 4గం॥లకే కాలినడకన బయలుదేరిరి. దేవుని వాక్యమును మరింత లోతుగా తెల్సుకొనవలెననే తీవ్రమైన ఆసక్తితో, వారు ఆ సమయ మంతయు మిక్కుటమైన ఎండలో అనగా తమ దేశమును కరువుతోను, దుర్భిక్షముతోను నాశనము చేసిన ఆ గొప్ప భూ మధ్యరేఖ ఎండవేడిమిలో నడుచుకొని వచ్చిరి.

ఆ కెన్యా పాదుర్లలో మూడొంతుల మందికి బైబిళ్ళు లేవను సంగతి మమ్మును విభ్రాంతికి గురి చేసినది. ఈ నమ్మకమైన సేవకులలో అనేకులు 2 లేదా 3సం॥ల క్రితమే ప్రభువును తెలుసుకున్నప్పటికీ, వారి స్వంత ప్రజల మధ్య ప్రజ్వలించుచున్న వారి సాక్ష్యములనే ఆ అరణ్య ప్రాంతములలో అనేక చిన్న సంఘములు కట్టుటకు దేవుడు ఏర్పాటు చేసికొనెను.

సమావేశ ప్రారంభమునకు ముందుగా వారందరికీ ఒక బైబిలు గ్రంథమును బహూకరించాము. పిదప అనేక దినములు వారికి ఉపదేశించాము. అక్కడ నా ప్రసంగమూలము ఏమనగా "ఇపుడు మీ చేతులలో ఉన్న దేవుని వాక్యము మీ చేతులలో నుండి మీ శిరస్సులోనికి వెళ్ళకపోతే అది మీకే మాత్రము ఆశీర్వాదకరము కాదు. అయితే ఈ రోజులలో, కేవలము శిరస్సులోనికి వెళ్ళుట కూడ, దేవుడు మీ కొరకు ఏర్పర్చిన సంపూర్ణ ఆశీర్వాదమును ఇవ్వజాలదు. బైబిలు గ్రంథము ఎప్పుడైతే, దేవుని మాటగా మీ హృదయములలో జీవించునో అపుడే ఈ సమావేశము మీకు శాశ్వతమైన ఆశీర్వాదము కాగలదు. గనుక బైబిలును మీ చేతులలో నుండి మీ తలలోనికి, మీ తలలో నుండి హృదయములోనికి ఏలాగున తెచ్చుకొనవలెనో మీరు నేర్చుకొని యుండుట అత్యంత ఆవశ్యకము."

నేను యవ్వనస్థునిగా క్రీస్తులోనికి ఆకర్షించబడినపుడు ఇంగ్లండ్‌లో మేము నివసించిన గృహమును దర్శించాను. మా ఇంటికి కొద్ది దూరములో ఉన్న ఒక దీప స్తంభము క్రింద 14 సం॥ల బాబ్ ఫ్లింట్ కూడ క్రీస్తును అంగీకరించాడు. బాబ్ రక్షణ పొందుటను బట్టి అతని జీవిత మంతయు మారిపోయినది. ఎందుకనగా, తన స్కూలు చదువు ముగించినప్పటి నుండి అతడు భవన నిర్మాణ పనులలో కూలిగా పని చేయుచుండెను. ఆ సమయములో బాబ్ పెద్ద పండితుడేమీ కాదు.

అయితే బాబ్ క్రైస్తవుడైనప్పటినుండి ప్రతిరోజు పనిలోనికి వెళ్ళక పూర్వము, బైబిలు చదువులాగున అతని బ్రతిమలాడితిని. అతనికి ఏ సంఘ వాతావరణము తెలియకపోయినను దేవుని వాక్యముతో వ్యక్తిగతముగా సంభాషించుట ద్వారా తన ఆత్మీయ జీవితమును ఏలాగు పోషించుకొనవలెనో బాగుగా నేర్చుకొనెను.



17సం॥ల వయసులో బైబిలు దూర విద్యా విభాగము (Correspondence Course) లో చేరిన బాబ్, దానియేలు పుస్తక పరీక్షలో ఉన్నత శ్రేణిలో నిలిచాడు. ఆ తరువాత 18సం॥ల ప్రాయములో సైన్యములో చేరినప్పటికీ క్రీస్తు కొరకున్న తన ఆసక్తిని అతడు కొనసాగించాడు. నిజానికి, 'బూట్ క్యాంప్' (Boot Camp) లో ఉన్న మొదటి 8 వారములు అతడు తనతో ఉన్న 17 మంది సైనికులతో కలిసి ప్రార్థించి, చివరికి వారిని క్రీస్తు కొరకు సంపాదించెను. తన సైనిక శిక్షణ ముగిసిన పిదప సేవార్థమైన తర్ఫీదు పొందుటకు బాబ్ పిలుపు పొందెను. అయితే తన సైనిక శిక్షణలోని చివరి విన్యాసము జర్మనీలో జరిగించుచుండగా ఆ విమానము కూలిపోయి ప్రభువుతో ఉండుటకు పరలోకపు పిలుపు అందుకొనెను.

విమానము కూలిపోయిన ఆ జర్మనీ గ్రామ పరిసరములలో బాబ్ జేబు నుండి సువార్త పత్రికలు చెల్లాచెదురుగా క్రింద పడ్డాయి. ఆ విధముగా దేవుని వాక్యము బాబ్ చేతులలో నుండి అతని శిరస్సులోనికి, అతని శిరస్సు నుండి హృదయములోనికి, చివరగా అతని హృదయమునుండి అందరి హృదయములలోనికి ప్రవేశించెను. ఈలాగున బాబ్ భూలోకపు సహవాసము నుండి పిలువబడి, దైవ సన్నిధిలో, ఆశ్చర్యకరమైన సహవాస ములో నిత్యము ఉండుటకు చేర్చుకొనబడెను.

అనేకులకు తమ క్రైస్తవ జీవితములో బాబ్‌వలె బైబిలు శిక్షణ పొందే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. మనలో అనేకులు దేవుని వాక్యము వినుటకు ఆ ఆఫ్రికా పాదుర్లవలె భయంకరమైన ఎండలో 15 గం॥లు నడిచిరావలసిన అవసరము లేదు. మన పరిస్థితులు ఏవైనప్పటికీ, మనకున్న బైబిలు పరిజ్ఞానమును మన హృదయ అనుభవముగా ఏలాగు మార్చుకొనవలెనో మనము నిజముగా తెల్సుకొనవలెను.

నా క్రైస్తవ జీవిత ప్రారంభములోనే - మామూలుగా బైబిలు చదువుటకును, సహవాస సమయము అనుభవించుటకును మధ్యనున్న

వ్యత్యాసమును, స్పష్టముగా ప్రభువు నాకు చూపినందుకు నేను ఆయనను ప్రత్యేకముగా స్తుతించుచున్నాను. దేవుని వాక్యమును ధ్యానించుటకు శిరస్సు, హృదయముల యొక్క సమ్మేళనము ఎంతో ముఖ్యమైనప్పటికీ, హృదయ సమర్పణ లేనిదే ఆ శిరస్సు యొక్క జ్ఞానము మనలను ఆత్మీయ వృద్ధిలోనికి నడిపించలేదని గ్రహించుట మరింత ప్రాముఖ్యమై యున్నది.

# శిరస్సు

## బైబిలు పఠన: ఉద్దేశములు, సమస్యలు

"దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను, నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (II తిమోతీ 2:15) బైబిలు చదువుటకును, అందులోని విషయములు ఎరిగి ఉండుటకును, తగినంత సమయమును ప్రత్యేకించుకొనుట ప్రతి క్రైస్తవుని అవసరమై యున్నది. వీలు దొరికిన ప్రతిసారీ బైబిలు బోధకుని, వాక్యసేవకుని ఉపదేశములను, సేవలను, పూర్తిగా వినియోగించుకొనుము. అలాగే నీకందుబాటులో ఉన్న బైబిలు వ్యాఖ్యానములు చదివి దేవుని వాక్యముతో మరింత సన్నిహితమగుము. ఆ వాక్య వివరము నీ యొక్క వ్యక్తిగత సహవాస సమయములో ఎంతగానో ఉపయోగపడును.

పాదుర్లు మరియు బోధకులు, క్రైస్తవ సంఘమునకు దేవుడు ఇచ్చిన బహూమానములై యున్నారు. బైబిలులోని ప్రతి పుస్తకమును, అందలి ప్రతి అధ్యాయ మును వాటి వాటి సందర్భ, పరిస్థితులతో కలిపి వివరముగా బోధించుటయే, ఒక పాదిరిగారి యొక్క అత్యుత్తమ సేవ. ఆ విధముగా ఒక పాదిరిగారు తన సంఘమును భక్తి జీవితములోను, అంతరంగ సంతృప్తిలోను, నశించు ఆత్మలకొరకైన తృష్ణలోను, పెంచవలెను.

అటువంటి పాదిరిగారు ఉపదేశించిన 5 ప్రసంగములు నా దగ్గరున్నవి. విలియం స్టిల్‌గారు చాలా కాలము క్రితము వాటిని "అంతర్ కళాశాల వేదాంత



విద్యార్థుల సమాఖ్య"లో బోధించెను. స్కాట్లండ్‌లోని అబర్డీన్ నందుగల ఒక సంఘములో 45 సం॥లకు పైబడి సేవ చేసిన ఆయన, ఇంకా ఎంతో ఉత్సాహంగాను, బలంగాను ఉన్నారు. అయితే అతని సేవ నిస్సందేహముగా స్కాట్లండ్‌ను దాటి వ్యాపించినది. ఆయన ప్రసంగముల చేత మార్చబడిన అనేకులు నేడు ప్రపంచమంతటా ప్రభువు సేవకులుగా ఉన్నారు. ఆ అంతర్ కళాశాలల విద్యార్థులకు ఆయన ఈలాగు ఉద్బోధించారు.

> "ఆహారము తినుటకు తన గొర్రెలకు ఇష్టమున్నను, లేకపోయినను పాదిరిగారు వాటిని పోషించుటకు పిలువబడియున్నారు. అయితే మేకలను ఉబలాటపరిచే వానిగా ఆయన ఎప్పటికీ మారకూడదు. ఎందుకంటే మేకలే, తమ మేకల భూమిలో మేకలను వినోద పరుస్తాయి. మీరు వాటి నైజమునకు తగినట్టుగా ప్రవర్తించుట ద్వారా మేకలను, గొర్రెలుగా మార్చలేరు. 'అన్ని రకములైన విపరీత గొర్రెలను ఒకచోట మందగా కూర్చి, అన్ని కలిసి జీవించునట్లుగా వాటిని పెంచుటయే', ఒక పాదిరి యొక్క అత్యంత ఫలభరితమైన సేవ. ఈ లోకములోని మేకల మధ్య, మేకలుగా మారకుండా ఏలాగు జీవించవలెనో గొర్రెలకు బాగా నేర్పించవలెను.

నీవు రక్షించబడిన తర్వాత ఒక సంఘములో చేరుట ఎంతో ముఖ్యము. అప్పుడు ఆ కాపరి నమ్మకమైన సేవ వలన నీవు దీవింపబడుదువు.

ఈ పుస్తకము చదువుచున్న మీలో అనేకులకు బోధకుని దగ్గర తర్ఫీదు పొందే అవకాశము ఉండకపోవచ్చును. ఒకవేళ బైబిలు వ్యాఖ్యానాలు చదివి నేర్చుకొనే అవకాశము, బోధకుని సహాయము నీకు ఉన్నప్పటికీ ఈ విషయములో బహు జాగ్రత్తగా ఉండవలెను. అదేమనగా *"నీ సహవాస సమయములో ప్రభువు నీకు అందించవలెనని ఆశించుచున్న ఆత్మీయ ఆహారమునకు బదులుగా నీవు నేర్చుకొన్న నీ శిరస్సులోని సంగతులు అడ్డురాకూడదు"*.

ఒక నమ్మకమైన సేవకుని ద్వారా మనము పొందే వాక్యజ్ఞానమైనా, మన వ్యక్తిగత ధ్యానముల ద్వారా సంపాదించుకొనిన బైబిలు పరిజ్ఞానమైనా,

"సహవాస సమయములో మనము పరిశుద్ధాత్మతో కలుసుకొనునపుడు, ఆయన మన హృదయములకు, జీవితములకు తగినట్లుగా అందించు ఆత్మీయ ఆహారమునకు" బదులుగా ఉండకూడదని తప్పక గ్రహించవలెను.

మన వ్యక్తిగత సహవాస సమయమునకు ఒక బైబిలు బోధకుడు ఏలాగున ప్రత్యామ్నాయము కాజాలడో అలాగే మనమెంత సహవాస సమయము కల్గి ఉన్నప్పటికీ వాక్యము చదువుటకును, సంఘ పరిచర్యలో పాలుపొందుటకును ఆయన కల్పించు అవకాశములను మనము నిర్లక్ష్యపెట్టకూడదు.

నీవున్న పరిస్థితులు ఏవైనప్పటికీ ఫలభరితమైన బైబిలు పఠనా పద్ధతిని అభ్యాసము చేసికొనుటకు ఈ క్రింది సూచనలు బాగా ఉపయోగపడును. చాలా కాలము క్రిందటే మైల్స్ కోవర్డేల్ వాక్య ధ్యానము కొరకు వీటిని సూచించెను. ఆయన వ్రాసిన వివరమునకు ఇది సంగ్రహ రూపము. బైబిలును బాగా గ్రహించుట కొరకు కేవలం అందులో వ్రాయబడిన సంగతులను మాత్రమే కాక ఈ విషయములను కూడా పరిశీలించవలెను.

1. ఈ వాక్యము ఎవరి గురించి మాట్లాడుచున్నది?
2. ఈ వాక్యము ఎవరి కొరకు ఉద్దేశింపబడినది?
3. ఈ గ్రంథకర్త ఉపయోగించిన ప్రత్యేకమైన మాటలు ఏవి?
4. ఏ సమయములో ఈ వాక్యభాగము వ్రాయబడినది?
5. ఏ ప్రాంతము నుండి ఈ వాక్య భాగము వ్రాయబడినది?
6. ఏ ఉద్దేశముతో ఈ వాక్య భాగము వ్రాయబడినది?
7. ఏ సందర్భముతో ఈ వాక్య భాగము వ్రాయబడినది?
8. ఈ ప్రత్యేక వాక్య భాగము దానికి ముందున్న వాక్యములకు, తరువాతనున్న వాక్యములకు మధ్యన ఏలాగున సరిపోయినది?

పై ప్రశ్నలకు సహజమైన రీతిలో స్పందించుట అలవాటు చేసికొనిన యెడల, (అవసరమును బట్టి ఒక రిఫరెన్స్ బైబిలును ఉపయోగిస్తూ), బైబిలు అంతటిలో పొందుపర్చబడిన అమూల్య ముత్యముల వంటి సత్యములను, నీ బైబిలు ధ్యానం ద్వారా గ్రహించుకొని, అత్యానందభరితుడవు కాగలవు. అపుడు దేవుడు నీకు క్రమముగా బయలుపర్చుచున్న ప్రవచన వాక్యములను చూచి నీవు బహుగా సంతోషించ గలవు. వాటిలో కొన్ని నెరవేరినవి, కొన్ని ఇంకను నెరవేరవలసినవి కూడా ఉండును.



నీ పరలోకపు తండ్రి యొక్క రూపము, చరిత్రలో ఆయన స్థానము, ఆయన రక్షణ మహా సంకల్పము, యేసుక్రీస్తుగా ఈ లోకమునకు ఆయనే వచ్చుట, సృష్టిలో ఉన్న ఆయన లక్షణములు, ఉద్దేశములు, ఈ కాలమునకు తగినట్లుగా నీకు, నాకు ఆయనిచ్చిన స్పష్టమైన సందేశము మొదలగు అంశములను గూర్చి మీ కన్నులు అత్యధికముగాను, ఆశ్చర్యముగాను తెరవబడినపుడు మీరు గొప్పగా దీవింపబడుదురు. అటువంటి మనోహరమైన బైబిలు జ్ఞానమును ప్రతి విశ్వాసీ నిజముగా బహు జాగ్రత్తగా వెదకవలెను.

# హృదయము

## సహవాస సమయము: దాని దిద్దుబాటులు, సలహాలు

మన హృదయమును శిరస్సును ఆయన సన్నిధిలో ఒకటిగా చేసి, ఆత్మతోనూ, సత్యముతోను ఆయనను ఆరాధించవలెను అనునది దేవుని కోరికయై ఉన్నది. (యోహా 4:24)

నీ బైబిలు పఠన నీకు కేవలము భౌతికమైన జ్ఞానమును మాత్రమే అందిస్తూ ఉంటే దాని వలన నీకు ప్రయోజనము శూన్యమే. ఈ రోజున క్రైస్తవులనేకులలో ఉన్న సమస్య ఏమిటంటే '**వారి శిరస్సులోని వాక్య జ్ఞానాన్ని తమ జీవితములకు అన్వయించుకొనకపోవుటయే**'. విచారకరమైన సంగతేమనగా 'దేవుని వాక్యము గురించి బాగుగా తెలిసిన అనేకులు కూడా ఆ వాక్య జ్ఞానపు అద్భుత వెలుగులో సంచరించుట లేదు గానీ తమ మనసు గూళ్ళలో దానిని

బధించి ఈ లోకపు అజ్ఞాన మార్గములను వెంబడించుచున్నారు. ఇది ఎంత దుఃఖకరమో కదా! అవును దేవుని వాక్యము ఎపుడూ కూడా సమకాలీన జీవిత క్రమములకు, ఆలోచనా విధానములకు అనుగుణముగా ఉండదు.

ఈ లోకపు ఆలోచనా విధానముతో దేవుని వాక్యమును అర్థము చేసికొని, మానవతావాద సంస్కృతి యొక్క తత్వ శాస్త్రము మరియు మానసిక శాస్త్రములతో లేఖనములను ముడిపెట్టుట, నైతిక విలువలకు మరియు నిబద్ధతకు తిలోదకము లిచ్చుటే. ప్రస్తుత పాప లోకములో నుండి మనలను బయటకు తెచ్చుటకు మన ప్రభువు ఊహించ శక్యముగాని వెల చెల్లించెను. గనుక క్రీస్తును నిరాకరించు ఈ తరము యొక్క ఆలోచనలను దేవుని వాక్యము తప్పకుండా వ్యతిరేకించును.

ఈ కాలపు సంస్కృతికి అనుగుణముగా దేవుని వాక్యము ఎప్పటికీ ఉండదు గనుక "నేనేలాగు ఉండవలెనని దేవుడు కోరుకొనుచున్నాడు"? అనే గొప్ప తలంపుతో దేవుని వాక్యమును చదివితే ఆ బైబిలు ధ్యానమే మన జీవిత అలవాటులను విప్లవాత్మకముగా మార్చగలదు. గనుక కేవలము శిరోసంబంధ జ్ఞానము కాక, హృదయ పూర్వకముగా ఏకీభవించు స్థితినే ఆయన తన పిల్లలనుండి ఆశించుచున్నారు.

నీ వాక్యమును నా శిరస్సునందు దాచుకొని యున్నాను అని కీర్తనకారుడైన దావీదు వ్రాయలేదు గాని "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను (కీర్త 119:11) అని వ్రాసాడు. అడాల్ఫ్ హిట్లర్ కూడ తన బహిరంగ దూషణోపన్యాసములలో బైబిలు వాక్యములను ఉదహరించాడు. అయితే ఈ బైబిలు జ్ఞానము అతని జీవిత గతినిగానీ నైతిక విలువల్నిగానీ మార్చుటకు ఉపయోగపడలేదు. ఎందుకంటె అతని వాక్య జ్ఞానం అతని హృదయములోనికి చొచ్చుకొని వెళ్ళలేదు.

'నీ వాక్యమును నా హృదయములో దాచుకొన్నాను'అని దావీదు వ్రాసిన పుడు, తన శరీరమునకు నరముల ద్వారా రక్తమునందించే 'గుండె' గురించి



ఆయన వ్రాయలేదు. ఎందుకంటే ఎవరూ కూడ దేవుని వాక్యమును అక్కడ దాచుకోలేరు. అయితే తన జీవితమును నిర్దేశించే అంతరంగ కేంద్రమును సూచించుటకే దావీదు 'హృదయము' అను పదము ఉపయోగించెను. అలాగే మనమును వాక్యమును చదివి మన హృదయ కేంద్రములో దాచుకొనినపుడు, మన అంతరంగములో నివసించే క్రీస్తు శక్తి ద్వారా ఆ వాక్యమే మనలను శుద్ధిచేసి, బలపరచి, స్థిరపర్చుటను బట్టి మనమెంతో ఆనందించగలము.

ఒక పూర్తికాల విద్యార్థిగా బైబిలును వేదాంత పరముగాను, సాంప్రదాయ రీతిలోను అభ్యసించుట నాకు కల్గిన గొప్ప ఆధిక్యత. అయితే బైబిలు సత్యములను గ్రహించి, వాటిని నిలువచేసికొనుట; దేవునితో ఏకాంతముగా గడిపి ఆయన వాక్యం ద్వారా మనతో ఏమి మాట్లాడుదురో తెలిసికొనుటకు అది ప్రత్యామ్నా యము కాదని నేను నేర్చుకొన్నాను. ఇంకను నేను "దేవుని వాక్యమే నాకు తీర్పు విధించుట కంటే, దేవుని వాక్యమునే విమర్శించుట తేలికైన పని" అని కనుగొన్నాను.

మేము కాలేజీ చదివే రోజుల్లో మా మాస్టారు ఇచ్చే 'ఉపన్యాసము'నకు మేము ఇచ్చిన ఆకతాయి నిర్వచనము ఏమనగా "ప్రొఫెసర్‌గారి నోటు పుస్తకము నుండి విద్యార్థి నోటు పుస్తకములోనికి, ఇరువురి బుర్రలలోనికి ఏ విషయము ఎక్కకుండా సంగతులను రవాణాచేయు సాధనము."

> ఇంతకంటే ఘోరమైన విషయమేమనగా "పాస్టర్‌గారి శిరస్సులోని విషయములు సంఘము యొక్క శిరస్సులోనికి ఇరువురిలో ఏ ఒక్కరి హృదయమును కదిలించకుండా రవాణా చేయబడుచున్నవి. ఈ సందర్భము లో దేవుడు చెప్పిన మాటను బాగా జ్ఞాపకముంచుకొనుము. '... వారు, వినిన వారితో విశ్వాసము గలవారై కలసి ఉండలేదు గనుక విన్న వాక్యము వారికి నిష్ప్రయోజనమైనదాయెను". హెబ్రీ 4:2.

మనము ప్రవక్తయైన యిర్మీయాతో ఏకీభవించినపుడు మాత్రమే దేవుని వాక్యము మన జీవితముల కొరకు ఉద్దేశించిన ఆశీర్వదములు అందుకొన గలము. "ఆయన వాక్యము నా హృదయములో అగ్నివలె మండుచు నా

*ఎముకలలోనే మూయబడినట్లున్నది."యిర్మీయా 20:9.* ఈరోజున అనేక విశ్వాసుల జీవితములలో ఈలాగున ప్రజ్వలించే సాక్ష్యములు కనుమరుగవుచున్నవి. శిరస్సు, హృదయముల మధ్య ఏలాగున వాస్తవికమైన సంబంధము లేదో అలాగే దేవుని స్వరమునకు, విశ్వాసి జీవితమునకు మధ్య కూడ నిజమైన కలయిక లేదు. అందుచేతనే మనకు తెలిసినదానికి, మనము చేసే పనికి చాలా తక్కువ సంబంధము, అదియు బహు కొద్ది పర్యాయములు మాత్రమే ఉంటున్నది.

బైబిలు బోధ నిజముగా నీ హృదయమును తాకినపుడు అది తప్పకుండా నీ జీవితమును మార్చి తీరును. అప్పుడు "కుటుంబ సలహాదారులు మరియు చక్కగా తయారు చేయబడిన ఉపన్యాసములు అను బహిరంగ సాధనముల మీద నీవు బహు తక్కువగా ఆధారపడుదువు". దేవుడు నీ కొరకు ప్రత్యేకముగా దాచి ఉంచిన వాగ్దానములను ఏలాగు స్వతంత్రించుకొనవలెనో అప్పుడు నీవు కనుగొన గలవు. కాబట్టి నీ అంతరంగములో నివసించుచున్న ఆత్మశక్తి ద్వారా నీవు ప్రభువైన యేసు యొక్క స్పష్టమైన ఆజ్ఞలకు విధేయుడవు కాగలవు.

నేను ప్రసంగించుట ముగించిన వెంటనే అప్పుడప్పుడు కొందరు వచ్చి నన్ను ప్రోత్సాహపర్చుటకు ఈ మాటలు చెప్తూ ఉంటారు. 'మేము బాగా ఆలోచించుటకు సరిపడిన ఒక గొప్ప ప్రసంగం చేశారు' ఈ మాట ఎప్పుడైతే వింటానో అప్పుడే నేను నిరీక్షించిన ఉద్దేశము నా ప్రసంగం నెరవేర్చలేదని భావిస్తాను. ఎందుకంటె విజ్ఞానాన్ని ఉప్పొంగచేసే ఒక కోలాహల సాధనముగా దేవుని వాక్యమును భావించుటకును మరియు తమ జీవితమును పరిపూర్తిగా మార్చగల సాధనముగా అన్వయించుకొనుటకును ఎంతో వ్యత్యాసమున్నది. వాస్తవానికి ప్రసంగాలు అనేవి ప్రజలను మార్చేటటువంటివిగా ఉండాలి కానీ కేవలము వారిని ఆలోచింప చేసేటటువంటివి గానే ఉండకూడదు.

అలాగే సహవాస సమయము కూడా, చురుకైన విశ్వాస క్రియను విధేయతను, పాపపుటొప్పుదలను, ఆరాధనా భావమును కలిగించనిచో, అది ఫలభరితమైన సహవాస సమయము కానేరదు.



ఒక దేవుని బిడ్డ, ఎపుడైతే వాక్య జ్ఞానంతో తన శిరస్సును నింపుకొని, పరిశుద్ధాత్మని సున్నిత స్పర్శకు తన హృదయములోవణుకుచుండునో అపుడే తన రక్షకునితో నిత్యమైన, సహవాసమును అతడు నిజముగా అనుభవించగలడు.

ఈ రోజు వరకు కూడ నేను బైబిలు కాలేజీలకు 'అతిధి ఉపన్యాసకుని'గా వెళ్ళినపుడు, నా విద్యార్థులకు ఇదే విషయం చెప్తుంటాను. "కేవలం బైబిలు చదివి అందులోని విషయములు తెల్సుకొనుటకే మీరు ఇక్కడలేరు. **అయితే బైబిలులో ఉన్న దేవునిని ఎరిగి ఉండుటకే మీరు ఇక్కడికి వచ్చారు."**.

నేటి విశ్వాసులలో ఉన్న ఆత్మీయ అజ్ఞాన స్థితి – మృదువైన మాటలతో చక్కగా అమర్చబడిన కొన్ని సంక్షిప్త ప్రసంగముల శక్తిహీనతకు, చేతకానితనమునకు మూగ సాక్షియై యున్నది. దేవునితో ఏకాంతముగా గడుపుట అను ప్రత్యేక అనుభవము యొక్క స్థానమును మరేదైనను ఆక్రమించినచో, అది ఆయనతో నీ కుండిన అత్యంత సామిప్య సహవాసమును బలహీనపరచి, చివరకు దానిని లేకుండా చేయును.

విశ్వాసి ఎప్పుడైతే దేవుని పరిశుద్ధ సన్నిధి యొక్క పారదర్శక కాంతితో సంధించబడతాడో అపుడే అతనికి ప్రభువుతో నిజమైన సహవాసము ఏర్పడగలదు. అట్టి వెలిగింపు ఎన్నో విషయములను ప్రత్యక్ష పరచును. అందులకు నీకునూ, నీ పరలోకపు తండ్రికినీ మధ్య దాపరికములేని, నమ్మకమైన, నిస్వార్థ సంభాషణ ఎంతైనా అవసరమే. నీవు దేవుని వాక్యమును చదువునపుడు, **ఆయన సత్యమునకు నీ హృదయము విధేయతతో స్పందించిన యెడల ఆ సత్యమే నీ ఆత్మకు ఆహారము కాగలదు. అపుడు నీవు ఆయనను గూర్చిన జ్ఞానములోను, తెలివిలోను ఎదగ గలవు.** అందుకే కీర్తనాకారుడు *"నీ వెలుగును పొందియే మేము వెలుగుచూచుచున్నామని" (కీర్తన 36:9)* సాక్ష్యమిచ్చుచున్నాడు. ఈ క్రింది సామెత కూడ ఎంతో వాస్తవమై యున్నది.

"వెలుగుకు విధేయత కనపర్చిన యెడల అది ఇంకా గొప్ప వెలుగును ఇచ్చును.
వెలుగుకు అవిధేయత కనపర్చిన యెడల గాఢాంధకారమైన రాత్రిని తెచ్చును".

ఇతరులకు సలహాలిచ్చి ఆ ప్రకారము నడుచుట కంటె కేవలం సలహాలిచ్చుటే బహు తేలికైన పని అని గుర్తించాను. అయితే 'ఆశ్చర్యకరుడు' 'ఆలోచన కర్త' గా యెషయా వర్ణించిన మన ప్రభువు బహు ప్రత్యేకమైనవాడు. ఎందుకంటె, ఆయన కేవలము సూచనలిచ్చువాడు మాత్రమేగాక, ఆ సూచన మరియు సలహా ప్రకారము మనము నడచుటకు తగిన సామర్థ్యము కలుగచేయు వాడునై యున్నాడు.

ప్రతిరోజు నీవు ఆయనతో గడిపే సహవాస సమయమే ఆరోజు నీవు ఎదుర్కొనే పరిస్థితులకు, సమస్యలకు తగినట్లుగా నిన్ను సిద్ధపర్చుటలో ప్రముఖ పాత్ర వహించును. ఆయన వాక్యమును నీవు చదువు చుండగా ఆయన తన సలహాను నీకిచ్చునపుడు, ప్రభువైన యేసే నీలో నివసించే సమృద్ధియైన సామర్థ్యముగా ఉండి, ఇరుకునబెట్టు ప్రతి చిక్కులో నుండి నిన్ను తప్పించి, నడిపించే మార్గదర్శకుడుగా నుండునని రూఢిగా తెలిసి కొనుము.



## ఆత్మీయ పరిశీలన

1. నేను బైబిలు చదువునపుడు, నా శిరస్సు స్పందించినంత వేగముగా నా హృదయము స్పందించ గలుగుచున్నదా?
2. నేను ప్రార్థించే సమయములో 'దేవుడు నాతో, నేను దేవునితో జరిగించే సహవాస సంభాషణను' నేను నిజముగా కల్గి ఉన్నానా?
3. నా ఆత్మీయ జీవితములో మొదటగా నేను దేవుని ద్వారానా (బైబిలు) లేక మనిషి ద్వారానా సలహాలు పొందుచున్నది?
   (హెచ్చరిక: ఆయన ఆలోచన కొరకు వారు కనిపెట్టుకొనక పోయిరి. కీర్తన 106:13)
4. నా క్రైస్తవ పరిచర్యలో ఇతరులకు నేనిచ్చు సలహాలు, దేవుని ప్రేమతో మండుచున్న హృదయము నుండి, ఆయన వాక్యముతో నిండి ఉన్న మనసు నుండి వచ్చుచున్నవా?
   (హెచ్చరిక: అయినను వారు తమ ఆలోచనను అనుసరించి తిరుగుబాటు చేయుచు వచ్చిరి. కీర్తన 106:43)

### పాపములోని రకములు

లెక్కలేని పాపములు, ఎంతో గొప్ప
పాప తీవ్రత కలిగినవి, నేనొప్పుకొనుచున్నాను.

ఆరాధన సమయములో లోకపు బాధ్యతలు
అతి శ్రేష్టమైన పనిలో స్వార్థపూరిత ఉద్దేశములు
దేవుడు ప్రక్కనే ఉన్నను గర్వాంధకారము
చీకటిలో ఆత్మలు నశించుచున్నను నిర్లక్ష్యము

దేవుడు ఉత్తముడని రుచిచూచియు
విషాహారము కొరకు అర్రులు చాచుట
పరలోకపు ఊటల క్రింద ఉండియు
భౌతిక సంపదల కొరకు తీవ్రముగా అపేక్షించుట

ఇటువంటి పాపములు నా హృదయమును మోసపుచ్చును
కేవలము ఈ కొన్ని మాత్రమే తెల్పిన నీవు వేదనతో రోదించుము.

అనుదిన తప్పుల కొరకు కన్నీరు లేకుండా
ఎంత ఉల్లాసముగా నేను నిద్రించితిని,
శరీరమంతా పాప చిహ్నములు నిండి ఉండగా
పరిశుద్ధ పరిచర్యకై లేచాను తాజాగా.

అయినను నీ ఆదరణ నన్ను విడువదు
స్వస్థపర్చు నీ స్పర్శ ఇంకను నన్ను బాగుచేయును
ప్రభువా! కేవలము నీ కొరకు నావేదన పరికించుము
ఇంకను నీ దయను నాకు కలుగనిమ్ము!

తండ్రీ! నీ ఆత్మకు వ్యతిరేకముగా చేసిన పాపములన్నీ
నీ కుమారుని ద్వారా క్షమించుము.

–విలియం మెక్‌లార్డ్ బంటింగ్
**(1805 - 1866)**

## అధ్యాయము - 3

# ప్రార్థనాపూర్వక సిద్ధబాటు

క్రీస్తును అంగీకరించిన ప్రారంభపు దినాల్లో నాకు చాలా తక్కువ బైబిలు జ్ఞానముండెడిది. ఆ సమయములో నేను బైబిలు తిరగవేస్తూ వెంటనే గ్రహించినదేమనగా 'నేను దేవుని మాటలు కల్గిన గ్రంథమును చదువు చున్నాను'. అవును, ఈరోజు వరకు కూడ నేను వాక్యమును చదువునపుడు ప్రభువైన యేసు నా హృదయముతో మాట్లాడుచునే ఉన్నారని గ్రహించుచూ సంతోషిస్తాను.

ఒక నూతన క్రైస్తవుడిగా కూడ, నేను బైబిలు చదువునపుడు పరిశుద్ధాత్ముడు ఆ వాక్యమును నా హృదయములో జీవింపచేయు ఆశ కల్గి ఉన్నాడని నేర్చుకొన్నాను. కాబట్టి ఒక చిన్న పల్లవిగా నేను నేర్చుకున్న ఈ పార్థనతో నా అనుదిన సహవాస సమయమును ప్రారంభించుదును.

ఆత్మయైన దేవుడే నా బోధకుడై యుండి
క్రీస్తులోని సంగతులను నాకు బయలు పర్చును
నన్ను వెలిగించి సర్వ సత్యములోనికి నడిపించు ఆ
అద్భుతమైన ఆత్మ తాళమును నా చేతిలో ఉంచును.

తన శిష్యులను విడిచి, తండ్రి యొద్దకు వెళ్ళక పూర్వము ఆయన చేసిన వాగ్దానము ఏదనగా *'అయితే ఆయన అనగా సత్యస్వరూపియైన ఆత్మవచ్చినపుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును' (యోహా 16:13)* చిట్టచివరగా మనకు ఒకే ఒక బోధకుడున్నాడు. ఆయనే పరిశుద్ధాత్ముడు. మన జీవితము లలో తన పని చేయుటకు పరిశుద్ధాత్మునికి స్వేచ్ఛలేని యెడల, మన వాక్యపఠన శూన్యముగాను, నిస్సారముగాను ఉండును.

18వ శతాబ్దములో, ఇంగ్లాండ్ దేశములో గొప్ప ఉజ్జీవమునకు కారకుడైన జాన్ వెస్లీ మహాశయునికి కూడ సహవాస సమయము యొక్క విలువ తెలియును. (ఇంగ్లాండ్ దేశములో విప్లవము రాకుండా ఆపిన వ్యక్తిగా జాన్ వెస్లీని అనేక చరిత్రకారులు వర్ణింతురు.) మనము మిగుల ఆసక్తితో అనుసరింప వలసిన గొప్ప పాఠమును వెస్లీ నేర్చుకొనెను. అనగా, సాయంకాలము త్వరగా నిద్రపోయి చాలా వేకువనే లేచుటకు వెస్లీ అలవాటు చేసికొనెను. ప్రతి ఉదయము 4 గం॥లకే వెస్లీ తన ప్రభుని కల్సుకొను ప్రార్థనా పీఠము మీద కొద్ది కాలము క్రితము నేను కూడా ఏకాంతముగా మోకరించి ప్రార్థించితిని. ఆ గదిలోనే, వెస్లీ డైరీలోని ఒక వాక్యమును చదివి నేను బాగా కదిలించబడ్డాను. అదేమనగా, "నేను ఇపుడు ఏకాంతముగా కూర్చున్నాను. దేవుడు మాత్రమే ఇపుడు నాతో ఉన్నారు. ఆయన సన్నిధిలో నేను ఆయన పుస్తకమును తెరచి చదివాను. నేను ఏదైతే చదువుతానో అదే బోధిస్తాను".

రక్షింపబడిన విశ్వాసులు లేఖనములను అర్థము చేసికొనుటకు ఎవరి సహాయము వారికి లేనప్పుడు, వారిని ప్రోత్సాహపర్చు పరిశుద్ధాత్ముని పరిపూర్ణతే, దేవుని వాక్యము ద్వారా వారి హృదయములకు తన్నుతాను చక్కగా రూఢిపరుచుకొనును. అందుకే *"ఆయన వలన మీరు పొందిన అభిషేకము మీలో నిలుచుచున్నది. గనుక ఎవడునూ మీకు బోధింపనక్కరలేదు. ఆయన ఇచ్చిన అభిషేకము సత్యమేగాని అబద్ధము కాదు. అది అన్నిటిని గురించి మీకు బోధించుచున్న ప్రకారముగాను, ఆయన మీకు బోధించుచున్న ప్రకారముగాను, ఆయన మీకు బోధించిన ప్రకారముగాను, ఆయనలో మీరు నిలచుచున్నారు. (I యోహా 2:7)* మీరు దేవుని వాక్యము చదువునపుడు ఇష్టపూర్వకముగా పరిశుద్ధాత్ముని వెలిగింపు మీద ఆధారపడిన యెడల ఆయనే ఆ వాక్య సత్యమును నీ హృదయములో జీవించునదిగా చేయును.



నిండైన, క్రమమైన, ఫలభరితమైన సహవాస సమయము కలిగి ఉండుటకు నీవు నిజముగా ఆశించిన యెడల, ఒక ఏకాంత స్థలము కనుగొని, ఒక ప్రత్యేకమైన సమయమును నిర్ణయించుకొని, నీ వాక్యము తెరచి దేవునితో సహవాసము చేయుము.

దేవునితో మనము గడుపు ఏకాంత సమయములు మన హృదయము లను తరచుగా సంతోషముతోను, ఆనంద నిరీక్షణతోను నింపుచున్ననూ కొన్నికొన్ని దినములలో మన కుటుంబము, వ్యాపారము లేదా బాధ్యతలు మన ధ్యాన క్రమముతో పోటీపడి దేవునితో మన ఏకాంత సహవాస సమయమును పాడుచేయును. నీవు దేవుని ప్రేమలోను, జ్ఞానములోను ఎదగవలెనంటే ఆ సమయములలోనే, నిజమైన క్రమశిక్షణను కనపర్చవలెను. నీవు నీ బైబిలును నిరుపయోగముగా ఉంచితే అది బైబిలు లేని స్థితితో సమానమని బాగా గుర్తించుకొనుము.

వాగ్దాన దేశమునకు వెళ్ళుచున్న ఇశ్రాయేలీయులు తమ శరీర బలము కొరకు దేవుడు అనుగ్రహించిన మన్నాను కూర్చుకొనుటకు ప్రయాస పడ్డారు. అలాగే మనము కూడ దేవుని వాక్యమును భుజించుటకు మనలను మనము సిద్ధపర్చుకొనవలెను.

మొదటిగా: దేవునితో ఏకాంతముగా ఉండుటకు నీ బైబిలును తెరచు ప్రతిసారీ, నీవు మోకరించుట నీకెంతో ప్రయోజనకరము.

రెండవదిగా: నిత్యమూ ప్రకాశించుచున్న ఆయన దగ్గరకు నీవు వచ్చినపుడు ఆయన పరిశుద్ధ సన్నిధిలో నీ హృదయమును ఖాళీ చేసికొనుట ఎంతో అవసరము. ఆయనకు నీవేదియూ దాచలేవు కదా! మరెందుకు ఖాళీచేయ ప్రయత్నించ కూడదూ?

ఆయనతో సహవాసము చేయుటకు నిన్ను నీవు సిద్ధపర్చుకున్నపుడు ఆయన వాక్యమే వాస్తవికమైన వెలుగుగా నీకు బయలుపడును. అప్పుడు ఆ వాక్యమే నీ శిరస్సులో నుండి నీ హృదయములోనికి ప్రవేశించుట నీవు కనుకొనగలవు.

## నీ మోకాళ్ళు వంచుము

గర్వపు హృదయము మరియు క్రీస్తుతో నిత్య సహవాసము కలిసి జీవించలేవు,

తమ విధేయతను, భక్తిభావమును కనపర్చుటకు దేవునియెదుట మోకరించిన అనేక భక్తులను మనము బైబిలులో చూడగలము. ఆచారనిష్ట కలిగిన క్రైస్తవులు, మహ్మదీయులు తమ బహిరంగ ప్రార్థనలో మోకరించు అలవాటును కలిగి ఉన్నా, అది దేవునితో కలిగిన నిత్య సహవాసమును సూచించలేదు. అయితే హృదయ భక్తితో మన సృష్టికర్తయైన నిత్యదేవుని యెదుట మోకరించిన యెడల మన ప్రాణాత్మలు ఎంతో గొప్పమేలును పొందగలవు.

గెత్సేమనెలో తన ప్రాణము మరణమగునంతగా వేదనలో ఉన్నపుడు, ఆయన తన శిష్యులు నిద్రించుట చూచి, వారి నుంచి కొద్ది దూరము వెళ్ళి మోకరించి ప్రార్థించెను (లూక 22:41) యేసు తన తండ్రితో ఒంటరిగా ఉండి, ప్రార్థించుటకు మోకరించెను. అలాగే మనమును దేవునితో ఏకాంతముగా ఉండుటకు, మన స్నేహితుల నుండి, మన కుటుంబము నుండి ప్రత్యేక పర్చుకొని, మోకరించి ప్రార్థించుట ద్వారా, ఆయనకు మన నిజభక్తిని కనపర్చి ఆయన చిత్తమునకు సమర్పించు కొనుటకు వీలగును.



తన పరిచర్య ముగింపు దినములలో అపోస్తలుడైన పౌలు తాను ఎఫెసులో స్థాపించిన సంఘమునకు ప్రేమపూరిత వీడ్కోలు పలికెను. అపుడు పౌలు వారందరితో కలిసి మోకరించి ప్రార్థించెనని అ.కా. 20:36లో చూడగలము. మరొక పర్యాయము సముద్రపుటొడ్డున పౌలు తన శిష్యులకు, వారి భార్య పిల్లలకు వీడ్కోలు పలికినపుడు కూడ అక్కడే మోకరించి ప్రార్థించెనని వ్రాయబడెను. (అ.కా. 21:5). నేటి దినములలో స్త్రీలు, పిల్లలు బహిరంగ స్థలములలో మోకరించుట, చూచువారికి అపార్థము కలిగించునని అనేకులు తలంతురు. 'వీరికి మతోన్మాదము పట్టినది' అనే నిందకు భయపడి మనము కూడ మన ప్రార్థనా కూటాల్లో మాములుగాను, సౌఖ్యముగాను ఉండుటకే ఇష్టపడతాము. అయితే పౌలు, ఆయన శిష్యులు, వారి భార్య బిడ్డలతో కలసి బహిరంగముగా మోకరించుటకు ఏ విధంగాను బాధపడ లేదు. మనము కూడ ఆవిధముగానే బహిరంగ ప్రార్థనా కూటములలోనైనా, ఏకాంతముగా దేవునితో ఉన్నా మోకరించుటకు వెనుక తీయకూడదు.

అయితే దేవునితో మనం వ్యక్తిగతముగా మాట్లాడుకొనుటకు కేవలము మన ప్రార్థనాభంగిమే అంత ముఖ్యమైన విషయముకాదని కూడ గుర్తుంచుకొనవలెను. అయితే ఆయనతో సహవాసమునకు మనసు యొక్క స్థితి మాత్రమే ముఖ్యమైనది. మనము ప్రార్థించునపుడు సరియైన స్వభావమును, మనస్సును కలిగి యుండవలెనని బైబిలు మనలను హెచ్చరించుచున్నది. *"దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. కాబట్టి దేవునికి లోబడి ఉండుడి. అపవాదిని ఎదిరించుడి. అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును. దేవుని యొద్దకు రండి. అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" యాకోబు 4:6-8.*

కొన్ని శరీర సమస్యల వలన, ఎక్కువ సమయము ప్రార్థనలో మోకరించుట కొందరికి కష్టతరమగును. అయితే దేవుడు ప్రతి ఒక్కరి హృదయములను చూచును. గనుక మన శరీర భంగిమ కంటె (మోకరించుట), మన హృదయ స్థితియే ఆయనకు ముఖ్యము. అయితే మోకరించ గల్గిన మనము

మొకరించుట ద్వారానే 'సృష్టికర్తయైన ఆ దేవునితో స్నేహితునివలె మాట్లాడు గొప్ప ఆధిక్యతను కల్గి ఉన్నాము, అను భావనను వృద్ధి చేసికొన గలము. మనలో ప్రతి ఒక్కరికి అతి ప్రాముఖ్యమైన బైబిలు ఆజ్ఞ ఏదనగా "ఆయన దృష్టికి మిమ్ములను మీరు తగ్గించుకొనుడి". మనము ఈ ఆజ్ఞకు విధేయులమైనపుడు "అప్పుడాయన మిమ్మును హెచ్చించును" అను గొప్ప వాగ్దానముతో నడిపించబడుదుము. యాకోబు 4:10.

## నీ హృదయమును ఖాళీ చేయుము

క్రీస్తుతో నిత్య సహవాసము దేవుని కృపా సింహాసనము దగ్గరే ఆరంభమగును.

మన ప్రభువైన యేసు తాను సిలువ మీద చనిపోక పూర్వమే దిక్కులేని మానవులందరూ తనతో సహవాసము కలిగి ఉండుటకు, దేవుడు తన గొప్ప కృపాప్రేమలను బట్టి, తన నిర్దోషమైన కుమారుని మరణమును వారి పాపపరిహారముగా సమ్మతించెను. గనుక మన రక్షకుని మరణమునకు ఎంతో ముందుగానే దేవుడు, తన సేవకులను ఆ కృపా పీఠము దగ్గర కల్సుకొందునని ప్రకటించెను. *"అక్కడ నేను నిన్ను కలుసుకొని కరుణా పీఠము నుండి మీకాజ్ఞాపించు సమస్తమును మీకు తెలియ చెప్పెదను (నిర్గమ 25:22).*

ఈ రోజున మన పాపముల కొరకై ఆయన కార్చిన రక్తము, ఆయన బల్యర్పణ చరిత్రలో ఒక భాగమైనది. ఆయన మరణము ద్వారా మనము దేవునితో సహవాసము చేయుటకు ఒక నూతనమైన జీవ మార్గము ఏర్పడినది. అగోచరమైన ఆయన ప్రేమ, మనము సంతోషముతో కేకలు వేయుటకు శక్తినిచ్చును. *"గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో (ఆయన) కృపాసనమునొద్దకు చేరుదము (హెబ్రీ 4:16).*

దయ అనగా 'ప్రేమ కల్గిన దేవుడు మనము దేనికి తగుదుమో దానిని మనకు ఇవ్వడు' అని అర్థము. కృప అనగా 'ధారళముగా ఇచ్చు దేవుడు



మనము పొందనర్హత లేని దానిని మనకు ఇచ్చున'ని అర్థము. ఇట్టి దయ, కృపలు కలిగిన ఆ దేవుని సహవాసములో నుండుట ఎంత అద్భుతమో కదా!

చెలరేగే ప్రతి తుఫాను ప్రళయము నుండి
ఉప్పొంగే ప్రతి విధమైన వేదనాభరిత అలల నుండి
ఒక నెమ్మదైన నిశ్చయమైన దాగెడు స్థలము
ఆయన కరుణా పీఠము క్రిందే ఉన్నది.

మన తలల మీద ఆనంద తైలమును యేసు
ధారలుగా కార్చుచున్న ఒక స్థలమున్నది
నాకెంతో మధురమైన స్థానమది
అదే రక్తముతో కొనబడిన కరుణాపీఠము

ఆత్మలు మమేకమగు ఒక స్థానమున్నది
అక్కడ స్నేహితులతో స్నేహితుడు సహవాసము చేయును
దూరముగా వారు విడిపోయినా, విశ్వాసముతో కల్సుకొందురు
సహవాసము ఉన్న ఆ ఒకే ఒక కరుణాపీఠము చుట్టూ!

శోధింపబడి నిస్సహాయ నిస్పృహలతో ఉన్నపుడు
సహాయము కొరకు మేమెక్కడికి వెళ్ళగలము
శ్రమనొందే శుద్ధులకు కరుణాపీఠము లేనపుడు
నరకాధిపతి ఏలాగున ఓడింపగలడు?

అక్కడే ఆ గద్ద రెక్కల మీదే మనము ఎగర గలము
కాలము ఆలోచన అక్కడెంత మాత్రము ఉండవు
మన ఆత్మలను అభినందించుటకు పరలోకముదిగి వచ్చును
మహిమ వితానముగా ఉండును, కృపా సింహాసనమునకు కిరీటమై.

హెచ్. స్టోవెల్

**కళంకమైన మనస్సాక్షి, క్రీస్తు యొక్క నిత్యసహవాసమును కలిగి ఉండలేదు:**

ఒక కుటుంబములో జన్మించిన పిల్లవాడు తప్పకుండా ఆ ఇంటి బిడ్డ అగును. ఆ బిడ్డ పుట్టలేదని ఎవరూ అనలేరు. ఆ పిల్లవాడు అల్లరి పనులు చేస్తే వాని తలిదండ్రులు వానితో మాట్లాడక పోవచ్చును. అప్పుడు వారి మధ్య

సంబంధం అయితే ఉండును గానీ సహవాసము ఎంత మాత్రము వీలుపడదు. అదెంత విచారము!

మనము మారు మనస్సు పొంది ఆయన జ్ఞానములో స్నానము చేసిన ఆ క్షణమున పరలోకపు తండ్రితో మనకు పరమ సహవాసము ఏర్పడుచున్నది. సత్ప్రవర్తనతో క్రీస్తును మన హృదయములోనికి అంగీకరించిన యెడల మనము దేవుని పిల్లలమగుదుము. అంతములేని కాలము వరకూ ఆ సంబంధం నిలిచి ఉండును. అయితే మనము పాపము చేసినపుడు మన తండ్రితో ఉన్న ఆ సంబంధం ఎంతో బాధాకరముగా నిర్వీర్యమౌతుంది.

మన జీవితంలో ఆయన ముఖదర్శనముచేత అనుభవించిన సంతోషాశీర్వాదములను, మన అవిధేయత చేత పోగొట్టుకొందుము. పారదర్శక సహవాసములో వచ్చిన కొద్దికాల లేక దీర్ఘకాల ఆటంకమును, దేవునికి మరియు ఆయన ప్రేమకు వ్యతిరేకముగా మనము ఆరోపించకూడదు. అపవిత్రమైన మన మనస్సాక్షి వలననే అట్టి యెడబాటు కలుగును. దేవునితో కలిగే ఏ విధమైన యెడబాటుకైనాను మనమే కారణము.

## కళంకమైన మనసాక్షి:

జాన్ బన్యన్ ఒకసారి ఇలాగు చెప్పెను "పాపము, బైబిలు నుండి నిన్ను దూర పర్చును. బైబిలు, పాపము నుండి నిన్ను దూరపర్చును". ఒక వ్యక్తి తన జీవితములో ఇష్టపూర్వకముగా పాపము చేసి పరిశుద్ధాత్మను దుఃఖ పరచిన యెడల అతడు వాక్యాహారము కొరకైన ఆకలిని కోల్పోవును. ఒక క్రైస్తవుడు తాను వాక్యము చదువునపుడు నిరీక్షించే స్థిరమైన విశ్వాసము పొందవలెనన్నా అతనికి శుద్ధమైన మనస్సాక్షి ఎంతో అవసరము. అందుకే వాక్యములో ఈ విధముగా ఉన్నది. *"విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై ఉండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా! (హెబ్రీ 11:6)*



ఒకవేళ మనము మన పాపమును కప్పిపుచ్చుకొనుచూ వాక్యము చదువుచున్న యెడల మన విశ్వాసము ఎండిపోవును. ఎందుకనగా మన మనస్సాక్షి, ఆ సమయములో పరిశుద్ధాత్మ స్వరముతో ఎంతమాత్రము ఏకము కాలేదు గనుక.

## పవిత్రమైన మనస్సాక్షి:

మనము పాపములో పడిన తరువాత దేవునితో మన సహవాసమును తిరిగి ఏర్పర్చుకొనుటకు, దోషభరితమైన మనస్సాక్షి శుద్ధి చేయబడుట ఎంతో అవసరము. ఈ దోష భారము నుండి విడిపించుకొనుటకు అపవిత్రుడైన క్రైస్తవుడు, దేవుని యెదుట ఆ పాపమును ఒప్పుకొనుచు తన హృదయమును ఖాళీచేయవలెను. అందుకే అపోస్తలుడైన యోహాను ఈలాగు వ్రాసెను *"మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగిన వాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (I యొహా 1:9).*

నా బైబిలులో ఆ వచనము దగ్గర యఫ్. డబ్ల్యూ. క్రమ్మషర్ చేసిన ప్రార్థనను వ్రాసుకొన్నాను. నా స్వంత పాపములు, వైఫల్యములు నాకు తెల్సినపుడు ఆయన కృపా సింహాసనము ఎదుట వాటిని పేరు వరుసన ఒప్పుకొందును. అపుడా ప్రభువు యెదుట నేను చేయు ఒప్పుదలకు ఆయన ప్రార్థనను ఆధారము చేసికొందును.

> "నా దేవా, ప్రభువా! నేను మరొకసారి నీకు విరోధముగా పాపము చేసి, బాధపడుచున్నాను. అందుకు నన్ను నేనే శిక్షించుకొనుచున్నాను. అయితే నా పాపముకంటే నీ దయ గొప్పది గనుక అందులోనే నా నమ్మకము ఉంచియున్నాను. ప్రోక్షణ రక్తముతో నా మనస్సాక్షిని శుద్ధి చేయుము. నా పాపము కొరకు నీవు సహించిన గొప్ప శ్రమల ద్వారా సంపాదించిన ఆ విమోచనను, విశ్వాసముతో నన్ను స్వంతము చేసుకొన నిమ్ము'.

కట్టలు కట్టలుగా ఒకేసారి మనము పాపము చేయముకదా! కనుక పాపముకే లేదా దోషము అనే ఒక్క మాట క్రిందే పాపములన్ని ఒప్పు కొనుటకు

ప్రయత్నించకూడదు. మారుమనసు యొక్క నిజమైన వ్యక్తీకరణ మరియు దేవుని చిత్తములోనికి మరలా వచ్చుట అనునవి కష్టతరమైనవి-గనుక 'నా పాపములన్నీ క్షమించుము" అను ఒక్క వాక్యముతోనే దేవుని క్షమాపణ అడుగుట అనునది మన గర్వపు హృదయములకు సుళువైన మార్గమును వెదకుటయై ఉన్నది. ఒకే ముద్దగా ఉన్న ఒప్పుదల, మనస్సాక్షిని శుద్ధిచేయుటకు చాలా తక్కువగా ఉపయోగపడును. ఏదైనా పాపమును పరిశుద్ధాత్ముడు మన మనసుకు జ్ఞాపకము చేసినపుడు, బైబిలు ఆ పాపమును ఏ పేరుతో వర్ణించుచున్నదో ఆ పేరుతోనే దానిని ఒప్పుకొనవలెను. అనగా తేలిక అబద్ధం కాదు, నిజమైన అబద్ధం; ఉత్సాహసల్లాపములు చేసే మనసుకాదు, వ్యభిచార సంబంధమైన మనస్సు; త్వరపడి మాట్లాడే మాటలు కాదు, నరహత్య, ద్వేషములతో నిండిన హృదయము మొదలగు వాటిని యదార్థముగా ఒప్పుకొనవలెను.

నేరము చేశానేమో అనే భావన మన సమస్య కాదు గానీ నిజమైన నేరమే మనము దోషము గనుక, మనము దేవుని సన్నిధి వెలుగు లోనికి వచ్చినపుడు ద్వంద్వ ఆలోచనతో కూడిన పలుకులు, మానవ సంబంధమైన కుంటిసాకులు మన ఒప్పుదలలో ఉండకూడదు. నీవు దీనముగాను, వాస్తవముగాను నీ పాపమును ఆయన ఎదుట చెప్పుకొనునపుడు, ఆయన తన గొప్ప కృపలో నీ ఒప్పుదలను అంగీకరించును. **అదే దేవుని యొక్క కృపాద్భుతమై యున్నది.**

దావీదు తన ఘోరపాపమును ఒప్పుకొనిన తరువాత, ఆయన వాత్సల్య బాహుళ్యమును సంతోషముతో ధ్యానించాడు. విరిగి నలిగిన హృదయముతో దావీదు దేవుని వైపు తిరిగినపుడు తన ఒప్పుదలలో సత్యవంతుడును, తన పశ్చాత్తాపములో యధార్థవంతుడై యున్నాడని బైబిలు తెలియజేయు చున్నది. నీవు పశ్చాత్తాప పడినపుడు ( అనగా దేవుని మార్గము కాక నీ స్వంత మార్గములో నీవు నడిచితివని గ్రహించి, పరిశుద్ధమైన దేవుని మార్గమునకు మళ్ళవలెనని కోరినపుడు), నీవు బుద్ధి పూర్వకముగా ఎరిగి ఉన్న పాపములను యదార్థముగాను, దీనముగాను ఒప్పుకొని, ఆయన ఎదుట వాటిని ఒక్కొక్కటీ



వరుసగ చెప్పుకొనినపుడు, దావీదువలె నీవు కూడ అపరిమితమైన ఆయన కృపా బాహుళ్యమును బట్టి ఆనందించ గలవు. అపుడు నీ మనసాక్షి శుద్ధీకరించ బడి, పరిశుద్ధమైన దేవుని సహవాసమును తిరిగి కొనసాగించును.

ప్రేమ కలిగిన దేవుని కృపా కార్యముచే నీ అంతఃకరణము శుద్ధీకరించ బడినపుడు ప్రార్థనలో నీకొక నూతన ధైర్యము కలుగుటను నీవు గమనించ గలవు గనుక "సహోదరులారా!.... *ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలము నందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను, మనసాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములు గలవారమును..* విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి యదార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము." (హెబ్రీ 10:19,22). దేవుని యెదుట నిజమైన ధైర్యము, పరిశుద్ధమైన మనస్సాక్షి ద్వారానే పొంగి ప్రవహించును. దేవునితో నిండైన సహవాస ఆనందము కొరకు అవసరమైన ధైర్య విశ్వాసములను, ఆ యదార్థమైన పారదర్శిక హృదయమే వెల్లడి చేయును.

నీ హృదయము నిర్మలమైనదని నీకు తెలిసినపుడు, నీ గత కాల పాప జ్ఞప్తి, నీ మనసాక్షిని ఎంత మాత్రము కదిలించనేరదు. అయితే, సాతాను నిన్ను నిందించుటకు ప్రయత్నించును. అపుడు వాడిని ఎదిరించుటకు, కళంక పడిన నీ మనసాక్షికి దేవుడు ప్రత్యేకముగా ఇచ్చిన జవాబే, నీ జవాబు అయి ఉండవలెను. అదే యేసు ప్రశస్త రక్తము యొక్క శక్తి. ప్రకటన గ్రంథములోని పరిశుద్ధులను క్షమింపబడిన సాతాను వారి పాపములను బట్టి, వారిని నిందించినపుడు, గొర్రెపిల్ల ప్రశస్త రక్తము యొక్క మహా శక్తిని ఆ క్షణమందే వారు అర్థము చేసికొనిరి. వారిని గూర్చి ప్రకటన 12:11లో ఈలాగున ఉన్నది. మన సహోదరులను నిందించువాడైన ఆ అపవాదిని, గొర్రెపిల్ల రక్తముతో వారు జయించిరి. శుద్ధీకరించబడిన మనసాక్షి యొక్క ఆశీర్వాదమును ఆస్వాదించుట మాత్రమే గాక ఎన్నటికీ కదిలించబడని మనసాక్షిని కలిగి ఉండు రహస్యమును కూడ వారు అక్కడ నేర్చుకున్నారు. హల్లెలూయ.

**తప్పుడు ఆలోచనా విధానము గల మనస్సు క్రీస్తు యొక్క సజీవ సహవాసమును కలిగి యుండ నేరదు**

దేవుని వాక్యమనే పాలపోషణ కొరకు మనుష్యులు ఆశపడకుండుటకొక రహస్య కారణమున్నది. నీ ఆకలి పూర్తిగా పోవునంత జ్వరము నీకెప్పుడైనా వచ్చినదా? అపుడు ఆహారము ఎంత రుచిగా ఉన్నను దానిని తినుటకు నీకు ఇష్టము ఉండదు. నీవు అనారోగ్యముగా ఉన్నపుడు ఏలాగున ఆహారము తినబుద్ధి కాదో అలాగే నీ ఆత్మీయ ఆకలిని ఏదైనా తప్పుడు ఆలోచన హరించి వేసినపుడు, బైబిలు నీకే మాత్రము రుచించదు.

'దేవుని వాక్యము అనే పాలను అపేక్షించుడి' అని పేతురు మనలను ప్రోత్సహించు చున్నప్పటికీ, దైవ పోషణ కొరకు ఆకలిగొని ఉండు స్థితిని నాశనము చేయు ఆలోచనలను గూర్చి కూడ అతడు మనలను హెచ్చరించు చున్నాడు. అంతేకాక, ఆ ఆలోచనలను జయించుటకు కూడ ఒకే ఒక మార్గమున్నదని పేతురు గట్టిగా వ్రాయుచున్నాడు. అదే 'సహవాస సమయము. పరిపూర్ణమైన ఆత్మీయ ఆకలికి అటంకముగా ఉన్న ప్రతి దానిని ప్రక్కన పెట్టవలెను. **ఆరోగ్య ప్రదమైన ఆకలి నీలో పునః స్థాపించ బడవలెనంటే అనారోగ్యకరమైన ఆలోచనా విధానములను పూర్తిగా మార్చుకొనవలెను.** అనగా నీవు పశ్చాత్తాపపడుము' అని వేరొక విధముగా చెప్పటయై ఉన్నది.

> సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను అపేక్షించుడి (1 పేతురు 2:2-4)

మన ఆత్మీయ ఆకలిని నాశనముచేయు పై రుగ్మతలు తొలగించ బడనిదే, మనము నిజముగా వాక్యమనే శ్రేష్టమైన పాలను అపేక్షించలేము అని వాక్యము గట్టిగా చెప్పుచున్నది. వాటిని ఒక్కొక్కటిగా పరిశీలించుదము.

**క్రోధము:** ఇతరులు మనలను హింసించినందుకు ప్రతిగా, వారి మీద మనకున్న కోపము, ప్రతీకారేచ్ఛ, అనగా క్షమించలేని ఆత్మను కలిగి ఉండుటే క్రోధము.



రావెన్స్‌బ్రూక్‌లో నాజీలు వారి రాజకీయ ఖైదీలను సమీకరించి, ఘోరముగా అంతమొందించే కేంద్రములో, కోటెన్‌బూమ్ నమ్మ శక్యముగాని హింసలను సహించినది. అటువంటి అమానుష పరిస్థితులలో తనకు బహుగా ప్రియమైన ఒక ఆత్మీయ సోదరిని అక్కడ పోగొట్టుకొనుట, అనగా ఆమె మరణమునకు మౌన సాక్షియై నిలుచుట ఆమెకు మరింత వేదనను కలిగించినది. అంతగా హింసించిన ఆ నాజీ సైనికుల దుర్మార్గతను వివరిస్తూ ఆమె ఏలాగున వారిని పూర్తిగా క్షమించినదో ఇలా వివరించినది: **"క్షమాపణ అనునది ఇష్టపూర్వకమైన క్రియ. అయితే ఆ ఇష్టమే హృదయములోని మంట యొక్క తీవ్రతకు సంబంధము లేకుండ జరిగించగల క్రియ అయి ఉన్నది".**

ఎవరినైన క్షమించలేని మనసు నీకున్నపుడు, ఆ వ్యక్తిచేత నీవెంతగా హింసింపబడినను, క్షమించలేని నీ స్థితిని బట్టి వానికి ఏ హానియు కలగదు. అయితే అటువంటి నైజము నీ ఆత్మీయ జీవితమును ఊపిరి ఆడకుండా చేయును. నిజానికి, ఆ వ్యక్తిని క్షమించుటకు నీవు ఇష్టపడేంత వరకు ఆ వ్యక్తి యొద్ద నీవు బంధకములలో ఉన్నట్లే. అపుడు మాత్రమే మన ప్రభువు నేర్పిన ప్రార్థన నీవు చేయగలవు. *"మాకు ఋణస్థులై యున్నవారి అపరాధము లను మేము క్షమించినట్లు మా పాపములను క్షమించుము" (లూకా 11:4).* క్షమించలేని ఆత్మ (క్రోధము) నీలో ఉన్న యెడల, దేవునితో ఏకాంతముగా గడుపు సమయములో ఆ వ్యక్తిని, ఆ వ్యక్తులను క్షమించుటకు నిశ్చయించు కొనుము. అప్పుడు ఏ వేషధారణ లేకుండ నీవు వారికి దేవుని ప్రేమను కనపర్చగలవు.

**కపటము:** మన పాపములను ఒప్పుకొనకుండా, మనలోని బలహీనతలను కప్పిపుచ్చుకొనుట, మరియు వాటిని న్యాయబద్ధముగా సరిపుచ్చుకొనుటే కపటము. అనగా యదార్థమైన జీవితముగాక మోసపూరితముగా బ్రతుకుట.

**వేషధారణ:** మనము ఏదైతే కాదో, కానివారమో దానికి ఉన్నట్లుగా, ఉన్న వారముగా గొప్ప అహంకార అతిశయముతో నటించుచూ, బహిరంగముగానే

ఇతరులకు తెలియజేస్తూ, మన గురించి వేరొక భావమును ఇతరులకు కలిగించుటే వేషధారణ.

**అసూయ:** ఇతరుల ఆశీర్వాదముల గురించి నిష్కపటమైన సంతోషము కల్గి ఉండుట కంటే అనుమానముతో మాట్లాడి, వారికున్న దానిని చూచి ఆశించుటే అసూయ.

**దూషణ మాటలు:** ఇతరులను గాయపర్చుటకు, కించపర్చుటకు మన నాలుకను వాడుట, ఇతరుల మంచితనమును పాడుచేయు మాటలకు చెవియొగ్గుట, ఇతరుల జీవితములోని పాపములు చూపించుచు, మన స్వంత దోషములను తేలిక చేసికొనుటకు ప్రయత్నించుట, అను వీటిని తప్పని సరిగా ప్రక్కన పెట్టవలెను. దేవుని చేత పోషింపబడవలెనని తలంచిన యెడల పై వాటిని మానివేయవలెను. అప్పుడు చంటి బిడ్డకు ఏలాగున పాలు త్రాగుమని బలవంతము చేయనవసరము లేదో అలాగే నీవునూ బైబిలు తెరచినపుడల్లా ఆ నిర్మలమైన వాక్యము అను పాలను త్రాగి *ఎదుగుటకు, ఆ పాలను అపేక్షించ గలవు. (I పేతురు 2:2)*

**స్వార్థపూరితమైన జీవితముతో క్రీస్తు యొక్క సజీవ సహవాసము కలిగి జీవించ లేవు:**

జపాన్‌లో అనేక సంవత్సరముల నుండి పని చేయుచున్న ఒక మిషనెరమ్మ కొద్ది కాలం క్రితమే ఒక చక్కని ఉత్తరం వ్రాసినది. ఇతర సువార్తీకులనేకులు చేరలేని ప్రజలకు అనగా ఉన్నత ప్రభుత్వాధికారులకు, విదేశీ రాయ బారులకు, ఉన్నత వర్గముల వారికి ఆమె సువార్త ప్రకటించు చున్నది. ఆమె ఈలాగు వ్రాసినది.

> "తన్ను తాను ఉపేక్షించుకొనుట మరియు అనుదినము ఆయన సిలువ నెత్తుకొనుట అను బోధ నేడు ఏమైపోయినది? నా క్రైస్తవ పుస్తకములను సర్దుకొను చున్నపుడు నా మనస్సును తట్టిన సంగతేమనగా, గత ఇరవై సంవత్సరములుగా నేను సంపాదించిన క్రైస్తవ పుస్తకాలలోని ప్రధాన



> అంశములన్ని "నీ క్రైస్తవ జీవిత వృద్ధికి నీ యంతట నీవే చేయుము" అనే సూత్రమునకు సంబంధించినవే. అయితే నా ప్రారంభ క్రైస్తవ జీవితములో ఉన్న పుస్తకములు అన్ని "తన్ను తాను ఉపేక్షించుకొనుట, పరిశుద్ధ జీవితమును జీవించుట, క్రీస్తుతో జీవించుట, క్రీస్తును మనలో నుండి ప్రతిబింబింప చేయుట అను అంశములకు సంబంధించినవే. అటువంటి బోధలు క్రమముగా కనుమరుగు అవుచున్నవా! లేక నేనేమైనా ఆ స్థితిని ఊహించు కొనుచున్నానా?"
>
> బహుశా! హాంకాంగ్‌లో ఉన్న ఒక చైనా క్రైస్తవ నాయకుడు కూడ పై విషయము లనే తన వ్రాతలో ఉద్దేశించి ఉండవచ్చును. "పశ్చిమ దేశాలలో, స్వేచ్ఛయుత క్రైస్తవ ప్రపంచంలో ఉన్న సంఘము, క్రీస్తు యొక్క పునరుత్థాన శక్తితోనే తన్ను తాను గుర్తించు కొనుచున్నది. ఆ క్రైస్తవులకు క్రీస్తుతో అటు వంటి సంబంధమే కావలెను. వారు తిరిగి లేచిన యేసు యొక్క విజయమునకు, అభివృద్ధికి, మేలుకరమైన సంగతులకు మాత్రమే ఎంతో జాగ్రత్తగా ఎదురు చూస్తారు. బహు కొద్ది మంది మాత్రమే ఆయన శ్రమలలో పాలిభాగస్థు లౌతారు. ఇందుకు భిన్నమైన స్థితిని ఆసియా సంఘములలోను, కట్టడి చేయబడి, క్లిష్టమైన పరిస్థితులున్న దేశములలోను నేను చూచాను. ఇక్కడ విశ్వాసులు క్రీస్తు యొక్క శ్రమలలో పాలు పొందుటకు ఎక్కువగా ఇష్టపడ తారు. ఆయన శ్రమలలో పాలి వారగుట, వారికి లభించిన గొప్ప ఆధిక్యత గాను బహుమానముగాను వారు భావిస్తారు."

అపోస్తలుడైన పౌలు ఈ విధంగా ప్రార్థించాడు. *"ఆయన మరణ విషయములో సమాన అనుభవము కలవాడనై ఆయనను ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తము, ఆయన శ్రమలలో పాలివాడనగుట ఎట్టిదో ఎరుగు నిమిత్తమును..." (ఫిలిప్పీ 3:10).* పౌలు వెల్లడి చేసిన ఈ ఘనమైన కోరిక యొక్క సంపూర్ణ సారాంశమును ఆమోసు ఈలాగు తెలియ చేయు చున్నాడు. సమ్మతింపకయే ఇద్దరు కూడి నడతురా? ఆమోసు 3:3. మనము ఆయన పునరుత్థాన ప్రభావములో నడచుటకు ఆశించిన యెడల తప్పకుండా ఆయన శ్రమలలో కూడా పాలిభాగస్థులము కావల్సియున్నది. ఎందుకనగా సగము ఒడంబడిక అసలు ఒడంబడికే కాదు కదా!

తన అపోస్తలత్వపు అధికారమును తృణీకరించిన తన విశ్వాసులకు (అన్యులలో నుండి మారిన వారికి) పౌలు, తిరిగి ఇచ్చుకొనలేని తన ప్రేమను ఇలా నొక్కి వివరించాడు. *"కాబట్టి నాకు కలిగినది యావత్తు మీ ఆత్మల కొరకు బహు సంతోషముగా వ్యయపరచెదను. నన్ను నేను వ్యయపరచుకొందును. నేను మిమ్మును ఎంత ఎక్కువగా ప్రేమించుచున్నానో, అంత తక్కువగా మీరు నన్ను ప్రేమింతురా? (II కొరింథి 12:15)*. వేరొకచోట పౌలు నిజమైన ప్రేమను వివరించుచు *"ప్రేమ దీర్ఘకాలము సహించును, ప్రేమ స్వప్రయోజనమును విచారించుకొనదు"* అని వారి మనసుల్లో నాటుకొనేటట్లు చెప్పుచున్నాడు. *(I కొరింథి 13:4-5)*. అటువంటి స్వార్థరహిత, దీర్ఘకాలిక, స్వచ్ఛమైన ప్రేమ, యేసు క్రీస్తునందు అత్యద్భుతముగా మూర్తీభవించినది.

ప్రేమలేని ఈ లోకమునకు యేసు ప్రభువు మానవాకారములో వచ్చి దేవుని ప్రేమను సంపూర్ణముగా ప్రత్యక్ష పరిచారు. ఆయన పనులు, ఆయన మాటలు, ఆయన అంతరంగ ఆలోచనలు, తన తండ్రి చిత్తమును నెరవేర్చుటకు ఆయన చేసిన సమర్పణ, ఇవన్నీ కూడ స్వార్థరహితమైన ఆయన ప్రేమ చిత్రమునకు అందమైన ఆకృతిని ధరింపచేయుచున్నవి. మన ప్రభువైన యేసు తాను పుట్టిన క్షణము నుండి మరణమగు పర్యంతము తన మానవ పరిపూర్ణతలోని అపరిమిత ఆధిక్యతలను తన కొరకు కాక ఇతరుల ప్రయోజనము కొరకే ఉపయోగించెను.

ఆ ప్రకారము భూలోకములో తన 33 1/2 సం॥ల జీవితములో ఆయన అనునిత్యము ఇతరుల మేలు కొరకే తన ప్రాణమును ధారపోసెను. (I యోహాను 3:16). చివరకు ఆయన సిలువ వేదన సమీపించినపుడు *"తాను ఈ లోకము నుండి తండ్రి యొద్దకు వెళ్ళవలసిన గడియ వచ్చెనని యేసు పస్కా పండుగకు ముందే ఎరిగినవాడై, లోకములోనున్న తన వారిని ప్రేమించి, వారిని అంతము వరకు ప్రేమించెను." (యోహాను 13:1)*. అవును, నిశ్చయముగా ఆయన ప్రేమ ఎంతో కాలము బాధపడినది.

మన రక్షకునితో మనము నిజముగా సహవాసము చేసినపుడు మన హృదయములను పరిశోధించుకొనుటకు మనము వేసికొనవలసిన ప్రశ్న



ఏమనగా "దేవుడు నాకు ఈ లోకంలో ఇచ్చిన మేలు రకమైన ఆధిక్యతలను నా స్వంత ప్రయోజనముల కొరకు ఉపయోగించు కొనుచున్నానా! లేక ఇతరులను యదార్ధముగా ప్రేమించుటలో, ఒకవేళ అది నాకు శ్రమకరమైనను, ఆఖరికి నా ప్రాణమును అర్పించుటకైనను నేను సిద్ధముగా నున్నానా? 'మొదట నేనే' అనుకొనే ఈ తరమునకు అనగా స్వార్థపూరిత ప్రేమనే ఒక సుగుణముగా భావించి, ఇతరుల సౌభాగ్యము కన్నా తమ స్వంత హక్కులే ప్రాముఖ్యమని ప్రకటించే ఈ తరము వారికి దేవుని ప్రేమ ఒక నిర్దిష్టమైన భేదమును ప్రస్ఫుటముగా కనుపర్చుచున్నది. ఇటువంటి 'స్వార్ధచింతననే', ఒక అంత్య దిన సూచనగా లేఖనములు ప్రత్యక్షపర్చు చున్నవి. *"ఏలయనగా మనుష్యులు స్వార్థ ప్రియులును... దేవుని కంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించు వారును..' (II తిమోతీ 3:2-4)*

గనుక అలెగ్జాండర్ మెక్‌లారెన్ నొక్కి చెప్పినట్లు "ఉన్నతమైన ఆత్మీయ అంతస్థుకు పోవుమార్గము, గాయములతో నిండిన స్వార్థపూరిత ప్రేమ నుండి స్రవించుచున్న రక్తపు మరకలతో కళంకపడినది".

తలంపుల ద్వారాగాని, క్రియల ద్వారా గాని వెల్లడి చేయబడిన పాపము మనలో గూడుకట్టుకొన్న స్వార్థపూరిత తత్వమునకు అద్దంపడుతుంది. ఈ స్వార్థపరత్వమును ఓస్వాల్ట్ ఛాంబర్స్ ఈలాగు నిర్వచించారు. "నా స్వంతము కొరకు, నా హక్కును, నేనే వినియోగించుకొనుట". ఈ స్వార్థమే గౌరవప్రదమైన నీతితో కూడి ఉన్నా, లేక నీచమైన దుష్టత్వముతో కూడి ఉన్నా, రెండునూ ప్రమాదకరమైనవే. దొంగతనమును, దోపిడి యొక్క కనికరము లేని స్థితిని, స్వార్థపరత్వమును ఖండించుట తేలికైన విషయమే. అయితే మనిషి యొక్క స్వార్థములోని పాపము మరిన్ని సూక్ష్మ మార్గములలో కూడ వెల్లడి చేయ బడునని మనము గ్రహించవలెను.

ప్రతి ఇంటి సమస్య వెనుక మరియు సామాజిక గందరగోళము మరియు అనేక సమస్యల వెనుక దాగి ఉన్న మూల కారణము ఏమంటే "మోసపూరితమైన నా హక్కు, దాని కొరకైన నా వాదన, నా సమయము, నా డబ్బు, నా మార్గము, నా కోరిక, నా ఇష్టము అనే తత్వమే. వాస్తవానికి, తన కొరకు ఆలోచించుకొనని

దేవుని ప్రేమను ప్రతిబింబించని ఏదైననూ సరే అది మానవునిలో దాగి ఉన్న స్వార్థపూరితమైన భావనే.

## నా పరలోకపు అవగాహన

మనము స్వార్థపరత్వమును నిజముగా గుర్తించుటకు ఉన్న ఏకైన మార్గము దేవుని దృష్టితో మనలను మనము చూచుకొనుటయే. జె.బి. ఫిలిప్స్ "చిన్న సంఘముల కొరకైన లేఖలలో, పౌలు కొలస్సై సంఘములో ఉన్న వారికొరకు చేసిన ప్రార్థనను ఈలాగు అనువదించెను. మీరు సంపూర్ణ జ్ఞానమును, ఆత్మ సంబంధమైన వివేకమును గలవారై దేవుని దృష్టితో ఈ సంగతులను చూడవలెనని ప్రార్థించుచున్నాను. *(కొలస్స 1:9)* మనము పౌలు మాదిరిని అనుసరించి మన ఆత్మీయనేత్రములను తెరువుమని ప్రార్థించినపుడు మాత్రమే, మన వ్యక్తిగత జీవితము యొక్క నిజమైన పరిస్థితులను సరిగా చూడగలము. మన స్వార్థపూరిత జీవితము యొక్క నేత్రములతో గాక దేవుని పరలోకపు దృష్టి (అవలోకనము) ప్రకారము చూడగలము. ఈ ప్రకారముగా మాత్రమే మన జీవితములోని వాస్తవికతలను ఆయన ఆత్మీయ దర్పణములో నుండి చూడగలము.

ఒక రాత్రి నాకు, డోరతికి చాలా కాలము నుండి స్నేహితురాలైన శ్రీమతి సైలెన్సు, ప్రార్థనాపూర్వకముగాను మరియు విధేయతతోను, తన కుటుంబములో వచ్చిన సంక్షోభమును పరలోకపు దృష్టితో ఎదుర్కొనినందున, గొప్పగా ఆదరించబడెను. తెల్లవారుజాము 2 గంటల సమయములో వచ్చిన టెలిఫోన్ పిలుపునకు ఆమె లేచినది. ఆ ఫోన్‌లో ఒక పోలీస్ అధికారి "ఈ రాత్రి నీ కారును ఎవరు నడుపుచున్నారో నీకు తెలుసా?" అని అడిగెను. ఆమె నిర్భయముగా అవును, నా ఇద్దరు కుమారులు యౌవనస్థుల బైబిలు సమావేశము నుండి ఇంటికి వచ్చుచున్నారు అని చెప్పెను. "మంచిది. నేను నీకొక విషాద వార్తను తెలియజేయు చున్నాను. నీ కారు డ్రైవరు నిద్రపోయినందున నీకారు చెట్టుకు గుద్దుకొని రోడ్డు ప్రక్కన చుట్టబడియున్నది. కారు డ్రైవరు మరణించాడు. అయితే కారులో ఉన్న ఆ యౌవనస్థులు బ్రతుకుతారన్న ఆశ ఎంత మాత్రము లేదు". నిత్యము తన పిల్లలకొరకు సున్నితమైన ప్రేమతో నిండి ఉన్న ఆ తల్లి హృదయమును ఈ దిగ్భ్రాంతి కలిగించే వార్తను విస్తుపోయేటట్లు చేసెను.



ఫోన్ క్రిందపెట్టి శ్రీమతి సైలెన్సు తన పరలోకపు తండ్రికి ఈలాగు మొర్రపెట్టెను. "ఓ దేవా! ఇటువంటి సమయములో ఒక తల్లి ఏమి చేయగలదు"? అయితే ఆమె బైబిలు పరముగా ప్రార్థించుటకును, ఆలోచించుటకును నేర్చుకొన్నది. తరువాత ఆమె నాతో ఈలాగు చెప్పెను. 'ఆ సమయములో నేను చేయగలిగిన దేమనగా 1 దెస్స 5:18 లో ఉన్న ఆజ్ఞను స్మరించుకొనుటయే'.

"ప్రతి విషయమునందును కృతాజ్ఞతా స్తుతులు చెల్లించుడి" ఆమె ఇంకనూ ఈలాగు ప్రార్థించినది "దేవా! ఈ సమయమునందు నా హృదయము కృతజ్ఞతతో లేదని నీకు తెలుసును. అది చల్లగాను, ఖాళీగాను, దిగ్భ్రాంతి లోనూ మునిగి ఉన్నది. అయినను ఈ భయంకర రాత్రి సమయమున నేను నీ ఆజ్ఞకు లోబడుదును. నేనీలాగు చేయుచుండగా దయచేసి నా హృదయములో ఒక అద్భుతము చేయుము. నేను నీకు లోబడి, వందనములు చెల్లించునపుడు నీవు తప్పని సరిగా ఈ పనిని చేయవలెను. ఎందుకంటె ఈ విషాదకరమైన ఘడియలో కృతజ్ఞతా భావము నాలో ఎంత మాత్రము పుట్టుట లేదు". ఈలాగున శ్రీమతి సైలెన్సు తన విశ్వాసమును ఉపయోగించు కొని ప్రార్థించుట మొదలు పెట్టెను.

సున్నిత హృదయము కలిగిన ఈ తల్లి మొదటిసారిగా "తండ్రీ! నీకు స్తోత్రము. ఎందుకంటే నీవు ఉన్న వాడవు" అని ప్రార్థించినపుడు, విస్తుపోయిన ఆమె హృదయము చల్లగాను, ఖాళీగాను ఉండినది. అయితే ఆమె విశ్వాసముతో పలుమారులు వందనములు చెల్లించగా పరిశుద్ధాత్ముడు ఒక గొప్ప అద్భుతమును జరిగించెను. ఆయన ఆమె హృదయమును ఆదరణతోను, యదార్థమైన కృతజ్ఞతతోను నింపెను. అవును ఆ నిశీధ రాత్రి ఘడియ

లలో ఆదరణ కర్త అయిన పరిశుద్ధాత్ముడు సైలెన్సు యొక్క విశ్వాసము, విధేయతలకు జవాబిచ్చెను. ఆయన, దేవుని యొక్క మార్పులేని ప్రేమను ఆమెకు, ఆమె కుటుంబమునకు మరల ధృడ పరచెను. అయితే ఉదయమైనప్పుడు నిస్సందేహముగా ఆమె కనులలో ఇంకను కన్నీళ్ళుండెను. అయితే అదే సమయములో ఆమె హృదయమును నడిపించుచున్న, వర్ణింప శక్యము గాని దేవుని సమాధానము యొక్క ఆదరణను ఆమె అనుభవించుచుండెను. తన యొక్క అనంతమైన ప్రేమ కౌగిలిలో చుట్టివేసిన దేవుని యొక్క కృపను అనుభవించిన, ఆ ఆవేదన గల తల్లి యొక్క అద్భుతమైన సాక్ష్యమే ఇది. మానవ జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము ఏలాగున ఆ చీకటి రాత్రివేళ, ఆమె హృదయమంతటినీ ఆవరించినదో, లోతైన స్థిరమైన నమ్మకముతో శ్రీమతి సైలెన్సు వివరించెను. ఆమె దేవునితో నడచుటలో తన్నుతాను ఋజువు చేసుకొనుటను బట్టి, సమస్య వచ్చినప్పుడు మానవ ఆలోచనకు మరియు పరలోకపు దృష్టికి ఎంతో గొప్ప తేడా కనబడినది.

**దేవునితో సామీప్యమైన సహవాసమును నీవు ఆస్వాదించుచున్నప్పుడు విశ్వాసము మరియు కృతజ్ఞతల మధ్య ఉన్న అవినాభావ సంబంధమును నీవు గ్రహించగలవు.** యదార్థమైన విశ్వాసము యొక్క సంపూర్ణ కృతజ్ఞత నీ హృదయమును నింపినపుడు, మారుతున్న నీ జీవిత పరిస్థితులను అవి బహిరంగమునకు మంచిగా కనిపించినా లేక చెడుగా కనిపించినా, ఆయన తన దృష్టితో చూచుటకు నీకు శక్తి దయచేయును. అటువంటి పరలోకపు దృష్టితో, గాయపడిన నీ హృదయమును దేవుడు తప్పనిసరిగా దృఢపర్చును. ఏలాగనగా "దేవుని ప్రేమించువారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని ఎరుగుదుము" రోమా 8:28. ఈ వచనము యొక్క ఆదరణ చల్లగానూ, శూన్యముగాను, తరచుగా ఉదహరించు సత్యము గాను ఉండిపోరాదు. మన ప్రతి ఒక్కరి హృదయములలో ఈ గొప్ప వాగ్ధానము యొక్క ఆశ్చర్యకరమైన వాస్తవికత మారుమ్రోగునట్లు, దేవుడు దానిని దయచేసెను. నీవాలాగున అనుభవించక పోయినను దేవుని స్తుతించుము.



నీవు అట్టి అనుభూతిని పొందువరకు దేవుని స్తుతించుచునే యుండుము. నీ జీవితములో గాని, నా జీవితములో గాని దేవుని స్తుతించుట అసందర్భముగా భావించు పరిస్థితి వచ్చుట అసాధ్యము. పశ్చిమ ఆసియాలోని ఒక దేశములో, బహుకఠిన పరిస్థితులలో నమ్మకముగాను, ఫలభరితము గాను క్రీస్తు కొరకు పనిచేయుచున్న దీర్ఘకాలిక మిషనరీల నుండి నాకు, డోరతికి ఒక ఉత్తరము వచ్చినది. ఆ ఉత్తరములో స్టాన్ ఈలాగు వ్రాసినాడు. "నేను **తప్పనిసరిగా దేవుని ఆయన యొక్క గుణగణాలను బట్టి స్తుతించవలెను, స్తుతించగలను కూడా – నా ఆదరణ కొరకు మాత్రమే కాదు**". క్షమాపణ గురించి కోరిటెన్‌బూమ్ చెప్పిన వాక్యమును మనము విపులీకరించిన యెడల మన మీలాగు కూడ చెప్పుకొనవచ్చును. దేవుని స్తుతించుట అనునది ఇష్టపూర్వకమైన క్రియ గనుక ఆ ఇష్టమే, హృదయవేదనతో నిమిత్తము లేకుండ దేవుని స్తుతించుటకు నిశ్చయించుకొనగలదు. మనము ఆయనను స్తుతించుకొనుటకు నిశ్చయించు కొనినప్పుడు, మన పరిస్థితులు ఏవైననూ సరే ఆయన సమాధానము యొక్క మర్మమైన కాంతి, మార్పులేని తన ప్రేమ యొక్క నిత్యమైన వాగ్ధానమును ఆయన తప్పకుండ మనకు అనుగ్రహించును.

ప్రతి విషయము కొరకు మనము దేవునికి వందనములు చెల్లించవలెనని వ్రాయబడలేదు గాని ప్రతి విషయములోను దేవునికి కృతజ్ఞత చెల్లించవలె నని ఉన్నది. మన పరలోకపు అవగాహన నుండి ప్రవహించు యదార్థమైన కృతజ్ఞత, గొప్ప వేదనలో మన మీద మనమే జాలిపడే స్థితిని వేరు చేయుటకు ఒక విశ్వాస కారకమై ఉన్నది. మనము ఆస్పత్రిలో ఉన్నా, దేవాలయములో ఉన్నా ఈ సంగతి నిజమని గుర్తుంచుకొనుము.

*జీవితములోని ఉప్పెనలు ముట్టడించినపుడు మన ఇహలోక విషయములలో బంధించబడిన హృదయము 'నన్ను దయ చూడండి' అను స్వభావమును సుళువుగా కలిగి యుండును. అయితే క్రీస్తును కేంద్రముగా కలిగిన హృదయము ఇంకను దేవుని స్తుతించును.*

మనలో చాలా మంది శ్రమ యొక్క మొదటి పట్టులో పడిపోవుదురు. వెంటనే మనము దేవుని ప్రణాళికల యొక్క ద్వారాము దగ్గర చతికిలబడి స్వీయ చింతనతో వాడిపోవుదుము. ఆఖరికి ఎంతో గొప్పదిగా పిలవబడే క్రైస్తవ సానుభూతి కూడ పై క్రమమునే తొందరగా జరిగించును. అయితే తన గొప్ప ప్రేమలో దేవుడు అలాగు జరగనీయడు. పొడవబడిన తన కుమారుని ప్రేమా హస్తముల కౌగిలితో ఆయన వచ్చి ఈలాగు చెప్పును "నా సహవాసము లోనికి రండి, లేచి ప్రకాశించండి" విరిగిన నలిగిన హృదయము ద్వారా దేవుడు ఈ లోకములో తన ఉద్దేశ్యమును నెరవేర్చుకొనుచున్నట్లైతే అప్పుడు నీ హృదయమును విరిచిన దేవుని స్తుతించుము. "మహోన్నతుడైన ఆయనకే నా సర్వస్వము" ఓస్వాల్డ్ ఛాంబర్స్ (విపులీకరించబడిన వచనము) లో నుండి సంగ్రహించ బడినది.

అవును, దేవుడేలాగున తన మహిమ స్వాతంత్ర్యముతో మనలను నింపినాడో అర్థము చేసుకొనుటకు, మన జీవితములను పరలోకపు దృష్టితో చూచుట ఎంతో ప్రాముఖ్యము.

స్వార్థపూరితమైన జీవితమునకు దేవుడు ఇచ్చు ప్రతిఫలము అభివృద్ధి లేక అభ్యాసము కాదు గాని, మరణమే. ఈ భూలోకములో స్వార్థపరమైన జీవితము యొక్క పీకులాటలతో మరియు దాని ఆకర్షణశక్తితో పోరాడు చున్నప్పుడు యదార్థమైన విశ్వాసము దేవుని నిత్య సత్యములో మనలను ఆనందింప జేయును. "ఏలయనగా మీరు మృతి పొందితిరి. మీ జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడి ఉన్నది" (కొలస్స 3:3).

మనము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడి ఉన్నాము గనుక మరణము, సమాధి, పునరుత్థానముల యొక్క క్రమము ద్వారా, ఇహలోకపు స్వార్థపరమైన చింతనలు, బాంధవ్యముల నుండి, మనము విప్లవాత్మకముగా విడిపించ బడుచున్నాము గనుక (రోమా 6:2-4) ఇప్పుడు మనము జీవితము యొక్క నూతన ఆలోచనా విధానమును బట్టి హర్షించగలము.

పాత సృష్టికి మరణమైన నిజ క్రైస్తవులు దేవుని యొక్క నూతన సృష్టిలో భాగమై ఉన్నారు. అదే మన రక్షణ యొక్క సంపూర్ణతమై యున్నది.



క్రీస్తులో నేను మరణించాను, క్రీస్తులో నేను లేచాను
క్రీస్తులో నా శత్రువులను జయించాను.
క్రీస్తును బట్టే పరలోకములో స్థానము సంపాదించాను.

నరకము ఓడిపోయినది, పరలోకము సంభ్రమములతో నిండిపోయినది.

క్రీస్తుతోపాటు సిలువ వేయబడిన స్థితిని, స్థానమును మనము గ్రహించుకున్న యెడల ఈ లోకములో మన అనుదిన జీవితము స్వార్థపూరిత మైన బ్రతుకు నుండి క్రీస్తే కేంద్రముగా కలిగిన అనుభవములోనికి రూపాంతరము చెందును. అటువంటి నిత్య సహవాసమును ఆయనతో ఎల్లప్పుడు అనుభవించుటకు, మన ఇహలోక సమస్య అయిన స్వార్థ పూరిత మైన జీవితమును ఏలాగున జయించవలెనో తప్పని సరిగ తెలుసు కొనవలెను.

## నా ఇహలోక సమస్య

ఇప్పుడు మన హృదయమును పరీక్షించే ప్రశ్న వేసికొనవలెను. ఈ లోకములోని నా జీవితము నిజముగా క్రీస్తు కేంద్రీతమైనదా లేక నా చుట్టూ మాత్రమే పరిభ్రమించేదై యున్నదా?

స్వార్థపూరితమైన జీవితము ఎవరికైనా త్వరగా వ్యతిరేకము కాగలదు. లేదా దాని ఉనికిని, సౌఖ్యమును, ఆనందమును, స్వాభిమానమును రూపుమాపే పరిస్థితిలో తప్పకుండా కోపపడుతుంది. జి. కాంప్‌బెల్‌మోర్గాన్ ఇలా అన్నారు. "పాపము యొక్క పరిపూర్ణతే స్వార్థ పరత్వము విరోధ భావము యొక్క మధ్య స్థానము, నరకమును తయారు చేసిన మూల పదార్థము. (హోషెయా: దేవుని హృదయము మరియు పరిశుద్ధత)

ఒక సాయంకాల ప్రార్థన కూటములో ఒక స్త్రీ అసాధారణ క్రమశిక్షణతో ప్రార్థించుట నేను విన్నాను. ఆమె అలా ప్రార్థించుచున్నప్పుడు జీవితమును పరివర్తన చేసే ఒక నూతనమైన మార్గములో ఆమె దేవుని కలిసికొనుచున్నది. "ప్రభువైన యేసూ! మీ ప్రేమ హస్తములతో నన్ను చుట్టివేయండి. నన్ను సిలువకు అధిమి పెట్టి మరణము వరకు నన్ను ప్రేమించండి. నేనుగా జీవించు నా జీవితము ఇంక ఎంత మాత్రము నాకు వద్దు. క్రీస్తే నాలో నివసించ కల్గిన జీవితము నాకు కావలెను". అమె ప్రార్థన నన్ను ఎంతగానో ముగ్ధునిగా చేసింది.

ఆమె ముందుగానే విడిపించ బడినదని ఆ స్త్రీకి తెలిసినా, మరణ పునరుత్థానముల క్రమము ద్వారా క్రీస్తుతో పరలోకములో నివసించుటకు.. ఆమె శరీరము ఇంకా ఈ లోకములోనే ఉన్నదని ఆమెకు బాగా తెలియును. గనుక ఆమె ప్రార్థించుచున్నపుడు తన స్వార్థ క్రియలకు, శరీర సంబంధమైన మాటలకు, స్పష్టముగా దేవుని పరిష్కారమును ఆమె కోరుకొనుచున్నది. అటువంటి అర్థవంతమైన ప్రార్థన, తన దేవునితో చనువైన సహవాసము కొరకు ఆమె కల్గి ఉన్న అమితమైన తృష్ణను వెల్లడి చేయుచున్నది. తరువాత ఆ ప్రార్థనను నేను ధ్యానించినపుడు, అటువంటి వేదనాభరితమైన హృదయ విన్నపమునకు పౌలు బైబిలు ఆధారమును కల్పించాడని గ్రహించాను. "మీరు *శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసినవారై వుందురు గాని ఆత్మచేత శరీర క్రియలను చంపిన యెడల జీవించెదరు" ( రోమా 8:13).*

చదువరులలో కొందరు ఈ క్రింది ఆలోచనలను పై వచనము యొక్క విశిష్టతను మరింతో లోతుగా ధ్యానము చేసుకొనుటకు సహాయపడేవిగా భావించ వచ్చును. అయితే ఈ తదుపరి వివరణ భాగమును మరి కొందరు ఆచరణాత్మకమైనదిగా, ఉపయోగకరమైనదిగా తలంచవచ్చును. గ్రీకు భాష తెలిసిన వారు, మనం ధ్యానించుచున్న ఆ వచనములోని విమోచనా సత్యము యొక్క పూర్ణ అవగాహనను మనకు కలిగించ గలరు.



**మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసిన వారై ఉందురు గాని ఆత్మ చేత శరీర క్రియలను చంపిన యెడల జీవించెదరు ( రోమా 8:13).**

**మొదటగా:** గ్రీకు భాషలో 'చంపిన యెడల' అను పదములకు, "మీరు" అను మాట కర్తగా (Subject) ఉండి, కర్త ప్రయోగము (active voice)లో వ్రాయబడినది.

బైబిలు సత్యము: నేను నా శరీర క్రియల నుండి (నా స్వార్థ పూరిత జీవితము నుండి) విడిపించబడవలెనంటె నేను ఉత్సాహముగాను, దృఢముగాను దేవునితో సహకరించవలెను.

**రెండవదిగా:** స్వార్థపరమైన లోకముతో ముడిపడిన మన క్రియలను జయించుటకు దేవుడు తన ఆత్మ ద్వారా (దైవ ప్రణాళికలు నెరవేర్చువాడు) అద్భుతకరమైన మార్గమును ఏర్పాటు చేసెనని ఆ వచనము మనకు తెలియచేయుచున్నది.

బైబిలు సత్యము: నేను ఆ క్రమములో ప్రార్థనా పూర్వకముగాను, చురుకుతనముతోనూ పాల్గొనవలసినప్పటికినీ, నా అంతట నేనే నా స్వార్థ క్రియలను అంతమొందించలేను. నేను ఈ లోకములో ఉన్నపుడు నా యొక్క స్వార్థపూరిత క్రియల నుండి నన్ను విప్లవాత్మకముగా ఖండించి వేరు చేయునది పరిశుద్ధాత్మయే.

**మూడవదిగా:** ఈ వచనము వర్తమాన కాలములో (present tense) వ్రాయబడుట కూడా చాలా ఆసక్తిగా నున్నది. ఆచరణాత్మక రీతిలో ఆలోచిస్తే, ఈ వాక్యం వర్తమాన కాలములో వ్రాయబడుట ఎందుకనగా ప్రభువుతో నా ప్రార్థనా పూర్వక చురుకైన సహవాసమును నిత్యము అనుభవించుచుండవలెను.

బైబిలు సత్యము: ఇది రూపాంతరం చెందించు అనుభవమైనప్పటికీ మొదటిసారి ఒక క్రైస్తవుడు పరిశుద్ధాత్ముని అడుగునదేమనగా "నా స్వార్థ పూరిత జీవితము మరణింపచేయును". అది కేవలము ఒకసారి మాత్రమే చేయు

పనికాదు. అవును, ఎప్పుడైతే ఈ అసహ్యకరమైన స్వార్థచింతన మనలో తలెత్తుతుందో, అప్పుడే మనలను విడిపించు పరిశుద్ధాత్మునికి సహకరించుటకు, మనము ఖచ్చితమైన ప్రార్థన చేయవలెను. అప్పుడు పరిశుద్ధాత్ముడు జరిగించు కార్యక్రమము మీద మనము (సంపూర్ణముగా) నిరంతరము ఆధార పడినపుడు, మన స్వార్థక్రియలు తప్పకుండ అంతమొందించబడ గలవు. ఇటువంటి విశ్వాస నైజము మన విషయములో ఒక నిత్యమైన, అనగా నిరంతరము పొందే అనుభవమై ఉండవలెనని దేవుడు ఉద్దేశించుచున్నారు.

పై వాక్యమును అర్థము చేసికొనుటకు మన మనసులో ఒక కోర్టు హాలును ఊహించుకుందాము. అక్కడ ఒక వ్యక్తి నరహత్య చేసినందుకు విచారించబడుచున్నాడు. సాక్ష్యం నిర్ధారించబడినది. నేరం ఋజువయ్యింది. గనుక ఇప్పుడు శిక్షను ప్రకటించే పూర్తి భాద్యత జడ్జీగారి మీద ఉన్నది. అప్పుడు జడ్జీలేచి "ఈ మనిషి హత్య చేసి, నేరస్థునిగా కనుగొనబడినందున ఇతను మరణమగుటకు నిర్ధారించ బడినది" అని ప్రకటించనపుడు ఆ కోర్టు గది అంతా నిశ్శబ వాతావణము అలుముకొన్నది.

అటువంటి బాధారకమైన ప్రకటనతో జడ్జిగారి పని పూర్తయినది. అయితే ఆ జడ్జీ తానే ఆ మరణ శిక్షను అమలు చేయుటకు తన బల్ల క్రింద నుండి తుపాకీ తీసి ఆ నరహత్య చేసిన వానిని కాల్చి చంపినయెడల, జడ్జిని నరహత్య నేరం చేసినవాడగును.

మరణ శిక్ష విధించిన తరువాత జడ్జిగారు చేయవలసిన పని ఏమిటంటే ఆ తీర్పు పొందిన వ్యక్తిని ఉరితీసే వ్యక్తికి అప్పగించుటయే.

ఆ ప్రకారముగానే, మన వ్యక్తిగత జీవితము తన స్వార్థపరత్వమును గుర్తించి, ఒప్పుకొనుట మినహా మరేమీ చేయజాలదు. కోర్టులో ఉన్న జడ్జిగారి వలె మన స్వార్థ క్రియలన్నిటి మీద మనము మరణ శిక్షను ప్రకటించవలెను. జడ్జిగారు ఎలాగున ఆ నరహంతకుని ప్రాణము తీయలేరో అలాగే స్వార్థభరితమైన స్థితిలో ఉన్న మనము కూడా మన స్వార్థ జీవితము యొక్క క్రియను అంతమొందించుటకు శక్తిలేని వారమే. అయితే దేవునికి స్తోత్రము.



ఎందుకనినా ఆయన పరిశుద్ధాత్మ అను ఒక పరలోకపు తలారిని (మరణశిక్ష అమలు చేయువాడు) మనకు అనుగ్రహించారు. గనుక మనలో ఉన్న బలమైన స్వార్థచింతనను రూపుమాపి నిర్మూలించు శక్తి పరిశుద్ధాత్మయే కల్గి ఉన్నారు.

అవును, దేవుని కృపను బట్టి, పరిశుద్ధాత్మ ద్వారానే శరీర క్రియలను చంపుటకు మనము శక్తివంతము చేయబడ్డాము. ఈ అత్యద్భుతమైన సౌకర్యమును మనము ఒక నిరంతరమైన, ఉద్దేశపూర్వకమైన పద్ధతి ప్రకారము వాడుకొనిన యెడల, నిజముగా క్రీస్తే కేంద్రముగా కల్గిన జీవితము యొక్క విమోచనానందమును మనలో నిత్యము అనుభవించగలము.

అటువంటి స్పష్టమైన వాక్యవివరమును బట్టియు, నేను ఆ ప్రార్థనా కూటములో వినిన ప్రార్థన అనగా స్త్రీ మిక్కిలి ఆశతో చేసిన ఆ ప్రార్థన యొక్క కదిలించే పాఠములను బట్టియు, నేను కూడా అనేకమారులు అంతే భారముతో ప్రార్థించుచున్నను. "ప్రభువా! నీ పరిశుద్ధాత్మతో నన్ను నీ సిలువకు అంటగొట్టుము. నా స్వార్థ జీవితము మరణమగునంత వరకు నన్ను ప్రేమించుము. ఇకను జీవించువాడను నేను కాను క్రీస్తే నాయందు జీవించవలెనని నేను కోరుకొనుచున్నాను".

మనము వాక్యము చేత పోషించబడుటకు, పెంపొందించబడుటకు ఉన్న ప్రముఖ ఉద్దేశ్యము – అత్మ సంతృప్తి కల్గిన జీవితమునకు చేరుకొనుటయే అని తలంచుట సులభము. అయితే అలాగున తలంచకూడదు. ఎందుకనగా, పాతనిబంధనలో యాజకుడు తన మందలో శ్రేష్టమైన వాటిని ఎందుకు బాగుగా మేపినాడు? తన దగ్గరున్న మంచి రకములైన గొర్రెలను బహిరంగముగా చూపించుట కొరకా? కాదుగానీ విలియం స్టిల్ చెప్పినట్లు అవి వధించుట కొరకు నిర్దేశింపబడినవి. అనగా తాము పుట్టినది మొదలు బలి అర్పించుట కొరకే ఉద్దేశింపబడినవి.

రక్షించబడిన బోధక సమూహము యెదుట తమ వాయిద్య లేదా మాటలాడే సామర్థ్యముతో 'గోల్డ్‌మెడల్ (బంగారు పతక) సంపాదించుటకు ప్రయత్నించుట ద్వారా, తమ క్రియలు దేవుని సంతోష పరచును అని

క్రైస్తవులనేకులు తప్పుగా బావిస్తూ ఉంటారు. దేవుడు తన ప్రేమ ఏర్పాటులో మనలను తన వాక్యము నుండి పోషించుట ఎందుకనగా మనము స్టేజీల మీద ఆసక్తికరమైన ప్రదర్శనలు ఇచ్చుటకు కాదు గాని మన జీవితములోని ప్రతి అణువు ఆయన బలిపీఠము మీద ప్రతిక్షణం అర్పించబడుట కొరకే. ఆయన పరిపూర్ణతకు సమానమైన పరిపూర్ణత కలవారముగా మనం జీవించుటకు ముందుగా, మనలో ఉన్నదంతయు అనగా స్వీయ పరితాపము, (మన గురించి మనమే పరితపించుట) స్వీయ సంతుష్టి, స్వీయ న్యాయ నిరూపణ (మనలను మనమే నీతిమంతులముగా నిర్ధాంచుకొనుట) స్వార్ధపరత్వము, స్వంత అవసరములు పూర్తిగా నెరవేర్చుకొనే స్థితి, ఈ వరుసలో ఇలా ఎన్నో ... వీటన్నిటినీ చంపివేయవలెను.*

కొలస్సై సంఘము గురించి జాగ్రత్త (శ్రద్ధ) తీసికొనుటకు, ఒక్క తిమోతీ మినహా మరెవరూ లేరని పౌలు వేదనాభరిత హృదయముతో చెప్పుచున్నాడు. ఎందుకంటె ఆ పట్టణంలో ఉన్న అనేక క్రైస్తవులకు "ప్రేమ స్వప్రయోజనమును విచారించు కొనదు" అను సంగతి అనుభవపూర్వకముగా తెలియదు. పౌలు ఎంత విచారముగా ఈ విషయం వ్రాసాడో – మనం ఫిలిప్పి 2:21లో గమనించ గలము...." అందరును తమ స్వంత కార్యములనే చూచుకొను చున్నారు గానీ, యేసు క్రీస్తు కార్యములను చూడరు".

ప్రపంచంలో అనేక ప్రాంతల్లో హింసపొందుచున్న క్రైస్తవ సంఘం గురించి నిజంగా శ్రద్ధ తీసుకునే క్రైస్తవులు నేడు ఎక్కడున్నారు? తమ గురించి

---

*పుట్‌నోట్స్:

బైబిలులో మరణమనగా కనిపించకుండ పోవుట కాదుగానీ, వేరుచేయబడుట. ఉదాహరణకు శరీర మరణమనగా, ఆత్మ శరీరమునుండి వేరు చేయబడుట: అలాగే నిత్య మరణమనగా దేవుని నుండి ఆత్మ ఎప్పటికీ వేరుచేయబడుట. అదే ప్రకారముగా స్వార్ధ జీవితమును మరణింపచేయుట అనగా మన మానవ ఆలోచనా విధానము నుండి స్వార్థపూరిత తలంపులను క్రియలను నిత్యముగా వేరుచేయుటయే. మనము ముందు నేర్చుకొన్నట్లుగా ఈ కార్యము కేవలము పరిశుద్ధాత్మ దేవుని శక్తి వలననే సాధ్యపడును, నెరవేరును.



నిజంగా పట్టించుకునే వారెవరూ లేని వారిని గూర్చి శ్రద్ధ తీసికొనుటకు కొంచెము కూడ ఖాళీ లేనంతగా మన స్వంత పనులలో మునిగి ఉన్నామా! ఒకవేళ ఆలాగు చేస్తే మన ప్రయోజనాలు దెబ్బ తింటాయేమో అని దూరంగా ఉంటున్నామా! ఒక్క దేవుని ప్రేమ మాత్రమే. తన గురించి తాను ఆలోచించు కొనకుండా దీర్ఘకాలము సహించి, భరించును అని మనము బాగా జ్ఞాపకముంచు కొనవలెను. వెనిగర్ (పులియబెట్టిన ద్రవము) తో నిండిన ఒక కప్పు నుండి మొదటగా ఆ చేదు రసమంతయు తీసి వేసినపుడు ఏలాగున అది తియ్యని, రుచులూరించే నారింజ రసమున్న పాత్రగా ఉండగలదో, అలాగే మనము కూడా దేవుని ప్రేమతో నింపబడుటకు ముందు మన స్వార్ధ జీవితము పూర్తిగా తుడిచి వేయబడవలెను. దేవునికి స్తోత్రము! ఎందుకంటే ఈ రెండు కార్యములు కూడ పరిశుద్ధాత్ముడు మన జీవితంలో జరిగించే దయాపూర్వక పరిచర్యలో భాగమై యున్నవి. ఆమెన్.

మన స్వార్థ జీవితక్రియలను, మన నుండి వేగముగా వేరు చేసి నిర్మూలించుటకు, దేవుని దీర్ఘ ప్రేమతో మన హృదయములు నిండి పొర్లి పారుటకు ఆ పరశుద్ధాత్మ దేవుని నిత్యమూ అర్థించుట మనందరకు ఎంత అవసరమో కదా! *"మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరించబడినది". (రోమా 5.5.)*

నీ సహవాస సమయములో, నీ హృదయమునందు ఈ సత్యములు ప్రజ్వలించుట ప్రారంభమైనపుడు, పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యములో నుండి నూతన సత్యములను నీకు బహిరంగ పర్చుచుండును.

అందుకే ప్రతి విశ్వాసి కూడ దేవుని దగ్గర చిన్ని లెక్కలను ఉంచుకొన వలెనని బాగుగా చెప్పబడినది. మన జీవితంలో ఆయనతో గల అతి సామీప్య సహవాసమును ఆర్పివేయునది ఏది కూడా లేదని మనం నిత్యమూ రూఢి పర్చుకొందము. ఆమెన్...

Blank



## ఆత్మీయ పరిశీలన

1. నా దేవుని సన్నిధిలో నేను పశ్చాత్తాపడి, ఒప్పుకొనని పాపమేదేనా నేను ఎరిగి ఉన్నానా?
2. ఈ క్రింది అంశములతో నాకేమైనా సమస్య ఉన్నదా?
   i. క్షమించని ఆత్మ?
   ii. ఇతరులను ప్రేమించుటకు ఇష్టము లేని నైజము.
   iii. బహిరంగమునకు మంచిగా కనబడి ప్రజలను మోసపుచ్చుచుండుట.
   iv. ఇతరుల ఆస్థిని, బహుమతులను ఆశించుట?
   v. సణుగుట, విమర్శించుట.
3. నా మనస్సాక్షి శుద్ధి చేయబడుట ద్వారా నేను నిరీక్షించే విశ్వాసమును ఉపయోగించ గలుగుచున్నానా?
4. ఈ లోకములోని నా జీవితము నిజముగా క్రీస్తు కేంద్రితమైనదా లేక ఇంకనూ స్వార్థచింతన కల్గినదా?

*ఇప్పుడు నీవు విలియం మెక్‌లార్డీ బంటింగ్ చేసిన ప్రార్థన మరొకసారి చేయవలెనని తలంచిన యెడల మౌనముగాను, ధ్యాన పూర్వకముగాను నీకు నీవుగా ప్రార్థించుకొనుము.*

ఆయన వాక్యపు వెలుగులో
మనము క్రీస్తుతో కూడ నడిచినపుడు
మన మార్గములను ఆయనెంత మహిమకరముగా చేయునో!
మనమాయన మంచి చిత్త ప్రకారము చేసినపుడు
ఆయనింకా మనలను విడువక మనతోనే ఉండును,
నమ్మి విధేయులగు ప్రతివారితోనూ.

ఏ చీకటి మన ముందుకు రాలేదు
ఆకాశమందలి ఏ మేఘము అడ్డుకాలేదు
ఆయన చిరునవ్వు వాటిని వడిగా పారద్రోలును
ఏ అనుమానము, ఏ భయము,
ఏ నిట్టూర్పూ, ఏ కన్నీరు కూడా మన దరి చేరవు,
మనం ఆయన్నే నమ్మి విధేయులైనపుడు.

అయితే ఆయన ప్రేమలోని ఆనందములను
మనం ఎప్పటికీ ఋజువు చేయలేము
ఆయన బలిపీఠముమీద మన సమస్తమును అర్పించే వరకు
ఆయన చూపించు అభిమానము
ఆయన కుమ్మరించే ఆనందము
ఎవరికంటె.... నమ్మి విధేయులగు వారికే.

అప్పుడు మధుర సహవాసములో
ఆయన పాదముల దగ్గర కుర్చుంటాము
ఆయన మార్గములో ఆయన ప్రక్కనే నడుస్తాము.
ఆయనేమీ చెపితే అదే చేస్తాము
ఆయనెక్కడికి పంపితే అక్కడికే వెళ్తాము
భయములేదు, కేవలము నమ్మకము, విధేయత చాలును

జాన్. హెచ్. సామిస్

# అధ్యాయము - 4

# సహవాస సమయము

తెరువబడిన హృదయముతో ఒక సమగ్రమైన బైబిలును *(Open Bible)* తెరచి ఉంచి, ప్రభువైన యేసు క్రీస్తు సమృద్ధికర సహవాసమునకు నీవు మొదటగా ఆకర్షించబడకుండా, ఆ రోజు నీ మీద పడే సవాళ్ళన్నటినీ ఎదుర్కొనగలనని నీకు నీవు తలంచినపుడు, దానికి మించిన అతిశయపు ఆలోచనలు, పలుకులు ఉండవేమో కదా!..

ఆత్మీయముగా సారవంతమైన జీవితమును పెంపొందింప చేయుటకు సాధనమైన ఒక అంకురించే విత్తనమును దావీదు కనుగొన్నాడు. అందుకనే దేవుని వాక్యమును ధ్యానించే వ్యక్తి తన కాలములో ఫలమిచ్చు చెట్టు వలె ఉన్నాడు. *అతడు చేయునదంతయు సఫలమగును అని దావీదు వ్రాసెను. (కీర్త 1:3)*

ఇటువంటి వ్యక్తి ఎవరై ఉంటారు? *"ధర్మశాస్త్రము నందు ఆనందించుచు, దివా రాత్రము దాని ధ్యానించువాడు" అటువంటి వ్యక్తియై ఉండ గలడు. (కీర్తన 1:2)*

క్రీస్తును తమ హృదయములోనికి, బ్రతుకులోనికి అప్పుడే చేర్చు కొన్న వారితో నేను కొన్నిసార్లు ఈలాగు చెప్తు ఉంటాను. "రోజుకొక అధ్యాయము చదివినా, దయ్యము మీ దరికి రాదు". గనుక వాక్యములో నుండి నీ అనుదిన పాఠమును చదివి, చదివిన భాగమునే మరొక మారు చదువుము. నీవు అలాగు చేయుట ద్వారా ఆ వాక్య భాగమును వచనము వెంబడి వచనముగా నీవు ధ్యానించగల్గుదువు. పొలములో నెమరువేయుచున్న ఆవును నీవు ఎప్పుడైనా చూచావా? ఆవు ముందుగా గడ్డి నమలి మ్రింగివేయును. ఆ తరువాత ఆగడ్డిలోని సారమంతయు దానిలోనికి వెళ్లు వరకు నెమరు వేయుచునే ఉండును. నిజమైన వాక్య ధ్యానమునకు ఇది ఒక చక్కని ఉదాహరణయై యున్నది.

తన 70వ జన్మ దినమందు మార్పు చెందిన ఒక వ్యక్తి నాకు తెలుసును. ఆ సమయములో అతనికి బైబిలు గూర్చి చాలా తక్కువ తెలుసును. అతను క్రీస్తులో నూతన జీవము పొందక ముందు చర్చికి కూడా వెళ్ళే వాడు కాదు. అలా అని అతడు పెద్ద విద్యాధికుడేమి కాదు. ఏది అయినప్పటికీ తన నూతన జన్మానుభవము తరువాత, యేసు క్రీస్తు యొక్క జ్ఞానములోను, ప్రేమలోను, కృపలోను ఎదగవలెననెడి ఆయన తీవ్రమైన కోరిక ఎటువంటిదనగా, తన 83వ ప్రాయంలో పరలోకము వెళ్ళుసరికి, 13 సార్లు బైబిలును ఆ చివర నుండి ఈ చివర వరకు చదివి ముగించెను. నీ యొక్క వయస్సు, విద్యార్హతలు ఏవైనప్పటికీ, నీవు కూడ ప్రతిరోజు బైబిలు చదువ వచ్చును.

ఒక సమగ్రమైన బైబిలు, శుద్ధ హృదయము, మోకాళ్ళ మీద నిలువబడిన స్థితి, దీన ఆత్మ, దావీదు ప్రార్థన: నేను నీ ధర్మశాస్త్రము నందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము (కీర్తన 119:18); ఇవన్నీ దేవునితో ఫలభరితమైన సమయము కొరకు నీకు మార్గమును సిద్ధపర్చును.

మనము ఇంతకు ముందు గమనించినట్లు, సహవాస సమయమును ఇరువైపుల నుండి జరిగే సంభాషణగా కొందరు గుర్తింపరు. మనము



చదువుతూ ఉన్న బైబిలు వాక్యములనే ధ్యానించినపుడు, దేవుడు మనతో మాట్లాడును. అయితే దేవుడు తన ప్రేమను బట్టి మన హృదయములతోనే మాట్లాడేటంత స్థితికి దిగి వచ్చినపుడు అనేక మంది విచారకరంగా ఆయనను అర్థం చేసికొనుటలో విఫలమగుచున్నారు. అందుకే ప్రార్థనలో ఆయనతో మాట్లాడేంతవరకు ఆయన ఎదురుచూస్తు ఉంటారు. మనము దేవుని వాక్యమును ధ్యానించునపుడు ఆ వాక్యము మన ఆలోచనలో ఒక భాగమగును. మనము ప్రార్థనా పూర్వకముగా వాక్యమును అనుసరించి నడుచుకొన్నప్పుడు అది మన జీవితములో ఒక భాగమగును.

ఈ అంశము దగ్గర "నేను బైబిలు చదువునపుడు దేవుడు నాతో ఎలా మాట్లాడును", అని నీ వడుగ వచ్చును. వ్యక్తిగతముగా నేను చదువు ప్రతి వచనమును నా మనసులో ధ్యానించుటకు కొన్ని ప్రశ్నలు నాకు ఎంతో ఉపయోగకరముగా నున్నట్లు నేను కనుకొన్నాను. అందులో కొన్ని, చాలా సంవత్సరముల క్రితమే నాకు సూచించబడినవి. నేను ప్రార్థనాపూర్వకముగా నా ప్రభువుతో సహవాసము చేయునపుడు ఈ ప్రశ్నలు నన్ను నడిపించును. నీవునూ దేవుని వాక్యమును ధ్యానించునపుడు ఇదే పద్ధతిని అవలంబించుమని చెప్పుచున్నాను. నేను ఈ ప్రశ్నల మీద అనేక సంవత్సరాల నుండి ఆధారపడ్డాను గనుక నేను దేవునితోను, ఆయన వాక్యముతోను సహవాసము చేయుటకు నన్ను నేను ప్రత్యేకపర్చుకున్నపుడు అవి నాకెంతో ఉపయోగకరమైన ఆలోచనలను ఇచ్చినవి.

ఈ క్రింది ప్రశ్నలలో కొన్ని విధేయతాకార్యము నకు సంబంధించినవని గమనించగలవు. మరికొన్ని విశ్వాసము యొక్క ప్రతి స్పందనను పుట్టించును. ఇంకొన్ని ప్రశ్నలు కొన్ని ప్రమాదములను, హెచ్చరికలను వెలుగులోనికి తెచ్చును. కొన్ని ప్రశ్నలు నీకు ఆరాధనా భావము కలిగించి ఆయనను స్తుతింపజేయును. చివరగా మరికొన్ని శత్రువైన సైతాను యొక్క కుయుక్తులను అర్థము చేసుకొనుటకు సహాయపడి, వాడి మీద క్రీస్తు పొందిన విజయము ఏలాగున నీదగునో నీవు అర్థము చేసుకొనుటకు తోడ్పడును.

# విధేయత యొక్క ప్రతిస్పందన

మనం దేవునితో కొద్ది లెక్కలను కల్గి ఉండుటకు, ఆయన స్వరమునకు అనుగుణముగా ఏలాగున మన శృతి కలపవలెనో అలాగే మన సహవాస సమయము కూడ అచేతన స్థితి నుండి రక్షింపబడవలెనంటే పరిశుద్ధాత్ముడు మనతో మాట్లాడు ప్రతిసారి మన చిత్తమును ఆయన మాటకు లోబరుచుట ఎంతో అవసరమై ఉన్నది.

**దేవునితో నిత్య సహవాసమునకు సులభముగా సమ్మతించెడి చిత్తము కావలెను:**

నీ సహవాస సమయములో బైబిలు చదువుచున్నపుడు ఈ ప్రశ్నలు వేసికొనుట మంచిది.

**ఈ వచనములో:**

నేను లోబడేందుకు ఏదైనా ఆజ్ఞ ఉన్నదా?
నేను విసర్జించే పాపమేదైనా ఉన్నదా?
నేను అనుసరించుటకు ఏదైనా మాదిరి ఉన్నదా?
నేను తప్పించుకొనవల్సిన చెడు సందర్భమేదైనా ఉన్నదా?

ఏలాగున ఆ ప్రశ్నలు దేవునితో వ్యక్తిగతమైన, పరస్పరమైన సంబంధమునకు నిన్ను నడిపించుచున్నవో నీవు గమనించగల్గు చున్నావా? నీవు విన్న సత్యమును గురించి నీవు కేవలం ఆలోచించేవాడుగానే, అవి నిన్ను ఉంచవు. ఈ ప్రశ్నలకు దేవుని సన్నిధిలో నీవు జవాబులు ఇవ్వగల్గినపుడు, దేవుని బోధకు నీ హృదయములో చురుకుగా స్పందించుటకు అత్యవసరమని నీవు కనుగొందువు.

నీవు దేవుని వాక్యము చదువునపుడు పరిశుద్ధాత్మ తండ్రి తానే నీతో ఉన్నారని నీవు జ్ఞాపకముంచుకొనుము. నీవు ఆయన మీద ఆధారపడినపుడు ఆయన తన వాక్యమును నీలో 9 అంగుళముల లోతులోనికి అనగా నీ తలలో నుండి నీ హృదయములోనికి పంపిస్తారు.



ఈ లోకము దేవుని ఆజ్ఞలకు అవిధేయత కనపర్చుచు, తిరుగుబాటు చేయుటకు పరుగులెత్తుచున్న, నాశనకరమైన దినములలో మనమందర మున్నాము. క్రీస్తును తిరస్కరించే ఈ తరమును ప్రభావితము చేయుటకు మనము విధేయులుగాను, యదార్ధ హృదయములుగాను ఉండవలెను. దేవుడు మనకు చూపించు సత్యములకు మనము విధేయులమైనపుడు మాత్రమే ఆయన శక్తిని ప్రభావమును ఈ లోకమునకు ప్రవహింప చేయుటకు మనము సిద్ధముకాగలము.

కొద్ది కాలము క్రితమే ఓస్వాల్డ్ ఛాంబర్స్ వ్రాసిన "మహోన్నతునికి నా సర్వోత్తమమైనది" అను పుస్తకము నేను డొరతి చదువుచున్నాము. మేము చదివిన ఆ పుస్తక సారాంశము ఏమనగా:

> "దేవుడు నీకు చూపించు విషయములో వెంటనే ఆయనకు లోబడుము అయితే దాని తర్వాత విషయము నీకు మరుగు చేయబడినపుడు,... "ఏదో ఒక రోజుకు నేను దానిని గ్రహించగలనని నీవు చెప్పవచ్చును. అయితే ఒక నిమిషం!!! నీవు దానిని ఇప్పుడే గ్రహించవచ్చును. ప్రత్యేక వెలిగింపునిచ్చేది వాక్య పఠన కాదు గానీ విధేయతే. విధేయత యొక్క అతి సూక్ష్మ రేణువైనా, పరలోకపు ద్వారములను తెరవగలదు. అప్పుడు లోతైన దైవ సత్యములు తిన్నగా నీకు సిద్ధమై ఉండగలవు. అయితే నీకు ఇంతకు ముందే తెసిన సత్యములకు నీవు విధేయత చూపించు వరకు దేవుడు నీకు ఇంకను అధికమైన వాక్య సత్యములను బయలు పర్చడు.

మిషనరీ సువార్త సేవలో మార్గదర్శకులైన చార్లెస్ టి. స్టడ్ మరియు హడ్సన్ టేలర్, ఒక చిన్న అటక గదిలో ఉండవలసి వచ్చినది. తెల్లవారు జామునే టేలర్ లేచే సరికి అతని స్నేహితుడు మిణుకు మిణుకుమనుచున్న క్రొవ్వొత్తి ముందు సంగ్రహ బైబిలును దీక్షతో పఠించుట చూచి, ఎంతసేపటి నుండి ఈలాగున చదువుచున్నావని అడిగెను. టేలర్ అడిగిన ప్రశ్నకు స్టడ్ ఈలాగున జవాబిచ్చెను.

యేసు ప్రభువు పలికిన ఈ మాటలు అర్ధరాత్రివేళ నా మనసులోనికి వచ్చుట ద్వారా నేను మేల్కొంటిని. "మీరు నన్ను ప్రేమించిన యెడల నా

*ఆజ్ఞలను గైకొందురు" (యోహా 14:14)* ఆ వెంటనే నేను నా ప్రభువునకు పూర్ణ విధేయతను కనుపరచుట ద్వారా నా ప్రేమను నిరూపించుకొంటినా? అని ప్రశ్నించుకొంటిని. వెంటనే నా బైబిలును తీసుకొని మిగిలిన రాత్రంతయు సువార్తలు చదువుటలో గడిపితిని. అందులో ప్రభువు తన శిష్యులకిచ్చిన ప్రతి ఆజ్ఞ కొరకు నేను వెదకితిని. దేవుని కృపను బట్టి, నేను ఏఏ ఆజ్ఞలకైతే విధేయత చూపుచున్నానో ఆ ఆజ్ఞల దగ్గర నా బైబిలులో చిన్న గుర్తు పెట్టుకొని హల్లెలూయ అని వ్రాసికొంటిని. నేను ఏ ఆజ్ఞకయితే అవిధేయుడనైతినో అక్కడ నా పాపమును ఒప్పుకొని నన్ను బలపరచు ఆయన కృపకు విధేయుడనగుటకును, నేనాయనను నిజముగా ప్రేమించుచున్నానని ఋజువు చేసుకొనుటకును, నన్ను నేను మరల సమర్పించుకొంటిని".

ప్రియచదువరీ! ఒకసారి నీవు ఆయన వాక్యపు వెలుగులో, ఆయనతో కలసి నడిచినపుడు నీవుకూడ కీర్తన రచయితతో కలసి ( జె. సామెన్) "నమ్మి విధేయత చూపించుటకు" మించిన మార్గము వేరొకటి లేదని సాక్ష్యమివ్వగలవు.

## విశ్వాసమును స్వతంత్రించుకొనుట

నీ సహవాస సమయములో బైబిలు చదువునప్పుడు ఈ ప్రశ్నలు అడుగుకొనుట కూడ మంచిది. ఈ వచనములో నేను స్వాధీన పర్చుకొనుటకు ఏదైనా వాగ్ధానమున్నదా? లక్ష్యపెట్టుటకు ఏదైనా హెచ్చరిక ఉన్నదా? బైబిలు అంతయు వాగ్ధానములతో నిండి ఉన్నది. మనము దేవుని వాక్యమును ధ్యానించునప్పుడు దైవ వాగ్ధానములను స్వంతము చేసికొనుట ఎంతైనా అవసరమే. అదే సమయములో ఆయన మనకిచ్చునట్టి తీవ్రమైన హెచ్చరికలను మనము గమనించుకొనవలెను. ఆయన హెచ్చరికలను నిర్లక్ష్యపెట్టుచు, ఆయన వాగ్ధానములను మాత్రము స్వతంత్రించుకొనుట, విశ్వాసముతో జీవించుట కానేరదు. గాని దానికి బదులుగా కేవలము చనిపోవుటకు మాత్రమే విశ్వసించనటు వంటిదిగా ఉండును.



నీవు దినదినము బైబిలు చదువుచున్నప్పుడు, ప్రతి వాగ్ధానమును గుర్తించి ప్రతి ఒక్కటియు నీ స్వంతమని స్వతంత్రించుకొనుము. నీవెప్పుడు దేవుని వాగ్ధానములను స్వాధీనపర్చుకొనుచున్నా, నిన్ను బలపరచు యేసు క్రీస్తు యొక్క సమృద్ధియే, విధేయత నీలోను ప్రతి నూతన మెట్టును నీ వ్యక్తిగత అనుభవము యొక్క నిజస్థితిగా మార్చుటకు కావలసిన పూర్ణ శక్తియై ఉండును.

ఆయన వాగ్ధానములు నీకెందుకివ్వబడినవనగా నీవు దేవునితో నడుచునపుడు అవి నీకు నిత్య సత్యములుగా మారుటకే. నీవాయన వాగ్ధానములను గట్టిగా పట్టుకొను కొలది నీ విశ్వాసము నిత్యము బలపడు చుండునని ఈ వాక్యములో ఉన్నవి. *"కాగా వినుట వలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17)*

విశ్వాసమునకు వ్యతిరేకమైనది ఏమై ఉండునని నీవెప్పుడైనా ఆలోచించినావా? దీని జవాబు అనుకున్నంత తేలిక కాదు. అవిశ్వాసమే విశ్వాసమునకు వ్యతిరేకమనే జవాబు చెప్పుట, ఈ ప్రశ్నయొక్క పూర్తి వివరములను నిజముగా ప్రక్కన పెట్టినట్లగును. నీకిష్టమైన ముగ్గురు జీవమునిచ్చే సహోదరులను ఊహించుకొనుము. మొదటి సహోదరుడు విశ్వాసము. రెండవవాడు ఆధారపడుట (నమ్మకము). మూడవ వాడు దీనత్వము. ఇప్పుడు భయంకరమైన మరొక ముగ్గురు సహోదరులను ఊహించండి. మొదటివాడు అవిశ్వాసము, రెండవ వాడు స్వేచ్ఛ, మూడవ వాడు గర్వము.

విశ్వాస పురుషుడు ఎవరంటే 'ఏ పనిచేయుటకైన తన కొరకు తాను చేసుకొనక ప్రభువైన యేసు క్రీస్తు మీదే ఆధారపడువాడు'. బైబిలు చదువుతూ ఉన్నప్పుడు, నిజమైన విశ్వాసి అచంచలమైన దేవుని వాగ్ధానములను గుర్తించి వాటిని తన స్వంతము చేసికొనును. ప్రభువైన యేసు తన శిష్యులతో *"నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు" (యోహా 15:5)* అని చెప్పెను. ఎవరైనా ఒక వ్యక్తి తన ద్వారా ఏదైనా ఆత్మీయముగా విలువగల పని దేవుడు జరిగించునని నమ్ముటకు ముందు, తన స్వంత శక్తిని బట్టి పరలోకములో

లెక్కింపబడు పని అతనేమియు చేయలేడని ఒప్పుకొనవలెను. కేవలము అణుకువ కలిగిన హృదయములో నుండే ఇటువంటి ఆధారపడే విశ్వాసము పుట్టును.

మరోవైపు అవిశ్వాసియైన మనిషి తన్నుతాను స్వతంత్రునిగా భావించుకొని దేవుని మీద తాను ఆధారపడనవసరము లేదని తలంచును. నేడు కోట్లకొలది ప్రజలు తమ రక్షణ కొరకు ప్రభువైన యేసు క్రీస్తు మీద ఆధారపడలేదని చెప్పుటకు చాలా విచారముగా ఉన్నది. అంతే విచారకరమైన వాస్తవమే మిటంటే అనేకమంది క్రైస్తవులు కూడా, తాము నిజ క్రైస్తవ మార్గములో నడుచుటకు శక్తినిచ్చు, అంతరంగ వాసియైన క్రీస్తు మీద ఆదారపడుట లేదు. ఏరకమైన మానవ స్వతంత్రతయైనను లోబడనొల్లని, గర్వపు హృదయములో జనించును.

గనుక విశ్వాసమునకు వ్యతిరేకము గర్వము అని మనము చెప్ప వచ్చును. అయితే అవిశ్వాసమునకు వ్యతిరేకము దీనత్వము. ఏంత ప్రజామోదమైన ఆలోచన అయినప్పటికీ, స్వంత విశ్వాసము, స్వయం సమృద్ధి అనునవి ఆరోగ్యకరమైన విశ్వాసమునకు వ్యాధికారకములుగా పని చేయును.

మానవ అహంభావమును ఉప్పొంగచేయుటకు రూపించబడిన ప్రతి ఒక్కలోకాకర్షణ. మానవులకు పునరుత్థానుడైన క్రీస్తు యొక్క మానవాతీత శక్తి మీద గల నమ్మకమైన విశ్వాసమును పూర్తిగా తొలగించివేయును. దేవుడు చేసిన ప్రతి వాగ్దానము వెనుక ఆయన యొక్క అపారమైన వనరులు ఉన్నాయి. గనుకనే మనము ఈ లోకంలో మన తెలివితోనో లేక మన స్వీయకల్పిత సౌకర్యములతోనో మన జీవిత యాత్ర కొనసాగించుటకు ఆయన మనలను వదలి వేయలేదు.

జి.కె. చెస్టర్‌టన్ (1874-1936) బహు సూక్ష్మ బుద్ధితో స్వీయసమృద్ధి అనే గర్వము యొక్క వింత పోకడను ఇలా వివరించారు. "ఈ రోజున మనం బాధపడే విషయమేమిటంటే అవసరము లేని స్థలములో నమ్రత కల్గి ఉండుట. అణుకువ అనేది ఎక్కడైతే ఉండకూడదో అక్కడే, అనగా రుజువాదము అనే



సాధనము మీదే స్థిరపడి ఉన్నది. ఒక మనిషి తన గురించి తాను అనుమానపడకుండుటకు ఉద్దేశింపబడెను. సత్యమును గూర్చి సందేహపడుటకు, అయితే ఈ విషయమే అటుది ఇటు, ఇటుది అటుగాను నేడు ఉన్నది.

తన ప్రభువు మీద కాక, ఇతరుల ఆలోచన మీద మరియు తనకు నమ్మకము ఉన్న స్థలముల మీద ఆధారపడు ఏ క్రైస్తవుడైనా దైవాశీర్వాదము యొక్క పరిపూర్ణత లోనికి వెళ్ళలేడు.

నీరు ఎప్పుడు కూడ ఏలాగున అట్టడుగు భాగమునకు ప్రవహించునో, అలాగే క్రీస్తు ప్రభువు జీవజలముగా నిర్ణయించిన పరిశుద్ధాత్మడు కూడా *గర్వముతో ఎత్తబడిన హృదయములోనికి ప్రవహింపలేడు. (హబ 2:4)*

అయితే క్రీస్తుయొక్క బలపరిచే శక్తి అవసరతను తన జీవితంలో గుర్తించగల ఏ విశ్వాసి హృదయములో నుండైనా పరిశుద్ధాత్ముడు సమృద్ధిగా పొంగి ప్రవహించును.

> "ఆ పండుగలో మహాదినమైన అంత్యదినమున యేసునిలిచి – ఎవడైనను దప్పి గొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పితీర్చుకొనవలెను. నా యందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్లు వాని కడుపులో నుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను". యోహా 7:37,38.

ప్రతిదినము నీవు యేసు పాదముల యెదుట సాష్టాంగపడి ఆ జీవ జలమును పానము చేయుము. నీవు అలాగు చేయునపుడు నీ జీవితము ఇంకను, నీ అభ్యాసము లేదా తలాంతుల ద్వారా వివరించబడదు గానీ అందుకు బదులుగా నీ హృదయాంతరంగములో నుండి పొంగి నిండుగా ప్రవహించు దేవుని పరిశుద్ధాత్మ ద్వారా నీ జీవితము వర్ణించబడుతుంది.

పరిశుద్ధాత్ముడనే వ్యక్తిలో, రక్షింపబడిన ప్రతి దేవుని బిడ్డకు పునరుత్థానుడైన మన ప్రభువు తన రూపమును ధరింప చేయుటకు దిగి వచ్చెనని జ్ఞాపకముంచుకొనుము. వాస్తవానికి, దేవుడు లేని ఈ లోకములోనికి చొచ్చుకొని వెళ్ళుటకు విశ్వాసే ప్రభువైన యేసు క్రీస్తు యొక్క ప్రధాన ఆయుధము

అయి ఉన్నాడు. ప్రతి ఒక్క అనుకూల క్రైస్తవుని ద్వారా పరిశుద్ధాత్ముడు ఇతరులను రక్షించే తన పనిని కొనసాగించుచు విస్తరింప చేయుచున్నారు.

*"మనము జీవముగల దేవుని ఆలయమై ఉన్నాము. అందుకు దేవుడీలాగు సెలవిచుచ్చున్నాడు. నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై ఉందును. వారు నా ప్రజలై ఉందురు" (II కొరింథి 6:18)*

అవును, మనము దేవుని ఆలయమై ఉన్నాము. మన నుండే ఆయన తన మహిమను, పరిశుద్ధతను నిరూపించుకొనుటకు ఆశపడుచున్నారు.

ఈ ఆశ్చర్యకరమైన సత్యమును గుర్తించే, పౌలు, వేదనాభరితమైన ఈ ఉద్బోధన చేసారు.

*ప్రియులారా! మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక దేవుని భయముతో, పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కల్గిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము" (II కొరింథి 7:1)*

## యధార్థమైన ఆరాధన

మన సహవాస సమయములో దేవుని నిజముగా స్తుతించుటకు, ఈ క్రింది ప్రశ్నలను మన మనసులో నుంచుకొనుట ఎంతో ఉపయోగము.

ఈ వచనములో ఏదైనా

తండ్రియైన దేవుని గూర్చిన నూతన భావము ఉన్నదా?
కుమారుడైన దేవుని గూర్చిన నూతన తలంపు ఉన్నదా?
పరిశుద్ధాత్మ దేవుని గూర్చిన నూతన ఆలోచన ఉన్నదా?

ఈ రోజున దేవుని ప్రజలలో నిజముగా ప్రభువును ఆరాధించవలెననెడి నూతన కోరికను గమనించుట చాలా ప్రోత్సాహకరముగా నున్నది. *"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను" (యోహాను 4:24)* అని ప్రభువు చెప్పినపుడు ఆయన



అటువంటి ఆరాధననే ప్రోత్సాహపరచెను. వేరొక మాటల్లో చెప్పాలంటే నిజమైన ఆరాధన వాక్య సత్యమును అనుసరించినదై, పరిశుద్ధాత్మ అభిషేకమునకు లోబడినదై ఉండవలెను. ఇటువంటి ఆరాధన మాత్రమే నీ తండ్రి హృదయమునకు సంతోషము తేగలదు.

దేవుని వ్యక్తిత్వము యొక్క మహదైశ్వర్యము అనగా ఆయన ప్రేమ, ఆయన శక్తి, ఆయన పరిశుద్ధత, ఆయన మహిమ, ఆయన కృప, ఆయన మంచితనము, ఆయన సౌందర్యము యొక్క రూపలావణ్యముల వైపు పరిశుద్ధాత్ముడు మనలను ఆకర్షించినపుడు, మన హృదయములు నిజ ఆరాధన అనెడి నూతన గీతములతో పరవశించి దేవుని స్తుతించును. ప్రార్థించుటకు మనము దేవుని సన్నిధిలోనికి వచ్చినపుడు మోకాళ్ళ మీద ఉండుట, మన మనసుకు సరియైన ఆలోచన మరియు ఏకాగ్రత కలిగించుటకు సహాయపడును. అయితే నీ జీవితములో కొన్ని ప్రత్యేక ఏకాంత సమయములలో నీకు కలిగిన అనుభవములను బట్టి – ఆయనకు నీ కృతజ్ఞత, ప్రేమ వెల్లడి చేయుటకు ఆయన ముందు మోకరించుట నీకు చిన్నతనమనిపించదు అని నాతో పాటు నీవు కూడ కనుగొనగలవు.

పత్మాను ద్వీపంలో యోహాను, మహా మహిమతో నిలచిన క్రీస్తు యొక్క సన్నిధిలోనికి వచ్చినపుడు, తాను కేవలము మోకరించితినని మాత్రమే యోహాను చెప్పుట లేదు గానీ *"నేను ఆయనను చూడగానే చచ్చిన వాని వలె ఆయన పాదముల యెదుట పడితినని" ప్రక 1:12*లో సాక్ష్యమిచ్చుట చాలా ఆసక్తికరమైన సంగతియై ఉన్నది.

అయితే ఎప్పుడైనా విశ్వాసికి, ఏదైనా సంగతి అమూల్యమనిపించినపుడు వెంటనే దాని ప్రక్కను దానికి వ్యతిరేకమైన ప్రమాదము పొంచి ఉండునని గ్రహించుట ఎంతైనా ముఖ్యము. ప్రభువైన యేసు యదార్థమైన ఆరాధన గురించి మాత్రమే ఆజ్ఞ ఇవ్వలేదు గానీ కొందరు నిజమైన ఆరాధనగా భావించు ***వ్యతిరేకమైన ఆరాధనను*** గురించి చాలా తీవ్రమైన హెచ్చరిక చేసెను. ఆ సమయములో ఆయన ఆ సమరయ స్త్రీతో ఆత్మతోను,

సత్యముతోను ఆరాధించవలెను అని చెప్పినపుడు ఆయన సూటిగా ఇచ్చిన గమనిక ఏమంటే "మీరు మీకు తెలియని దానిని ఆరాధించు వారు" (యోహా 4:22)

ఆరాధన ఉద్రేకమును మించినది గనుక ఆరాధన ప్రభువైన యేసు క్రీస్తునే తన కేంద్రముగా కలిగి ఉండవలెను. ఆరాధన యొక్క ఉద్దేశము ప్రజలను మార్చగల్గినదిగా కాకుండా, ప్రజలను పరిభ్రమించేటట్లు చేయునదైతే, అప్పుడు నిజమైన ఆరాధనకు బదులు తప్పుడు ఆరాధన ప్రవేశించినదని గ్రహించవలెను. మనము దేవునికి స్తుతించే స్తుతిభావముతో పూర్తిగా నింపబడవలెనంటే ఆత్మీయ ఉద్వేగమునకు మించిన స్థితిని ఆయన తప్పనిసరిగా మన నుండి కోరతారు.

**సర్వాధికారియై, నిత్యము జీవించుచూ, దేవుని వాక్యములో బయలుపడిన కీస్తు యేసు మీదే దీన మనసుతోను, నలిగిన హృదయముతోను మనసు లగ్నము చేయుటే యదార్థమైన ఆరాధన. ఇటువంటి భావము ఎప్పుడైతే మనకు కలుగుతుందో అప్పుడే, అక్కడే సమర్పణతోను, స్తుతిభావముతోను మన అంరంగములో ఆయన ఎదుట సాష్టాంగపడుట జరుగును.**

## వాక్యములోని యుద్ధ సామాగ్రి

అవును, దేవుడు నీ సహవాస జీవితమును దీవించుచున్నారు. నీ మనస్సాక్షి ఇప్పుడు శుభ్రముగా ఉన్నది. క్రీస్తు నీ కొరకు తన సిలువలో చేసిన త్యాగమునకు కృతజ్ఞతగా నీ మీద నీకున్న హక్కులను, నీ కీర్తిని, నీ ఆశలను, నీ ఆస్థులను నీవు పరిత్యజించితివి. గనుక ఇప్పుడు నీవు ఒక నూతనమైన కోణములో క్రీస్తుకు నీ ఆరాధనను స్తుతిని అర్పించుచున్నావు. అందుచేత నీవు నీ సహవాస, సమయములో, దేవుని ఉద్దేశములయొక్క ఆశీర్వాదములు శిఖరమునకు చేరుకొన్నావా? ఇంకా పూర్తిగా కాదు.

నీవు బైబిలు చదువునప్పుడు నీవు నీ మనస్సులో గుర్తుంచుకొన వలసిన మరి కొన్ని ప్రశ్నలున్నవి. ఈ ప్రశ్నలు దేవుని బద్ధశత్రువైన సాతాను యొక్క పన్నాగములను నీవు ఎదుర్కొనుటకును, జాగరూకుడవుగా ఉండుటకు నీకు సహాయపడును.



**నేను చదివే ఈ వచనములో**

సాతానుని గురించి ఏదైనా ఒక నూతన అవగాహన ఉన్నదా?
వాడి క్రూరమైన ఆలోచనలను గురించి ఏదైనా నూతన భావము ఉన్నదా?
వాడి కుయుక్తులను తెలియచేసే ఏదైన నూతన వెలిగింపు ఉన్నదా?

ఒకప్పుడు నేను - సండే స్కూలు నుండి ఇంటికి తిరిగి వచ్చిన ఒక చిన్న పిల్లవాడి గురించి విన్నాను. ఆ రాత్రి ఆ పిల్లవాడు తన మంచము మీద మోకరించుట ఆ తల్లి గమనించి, నీవు ఏమి చేస్తున్నావు అని అడిగెను. అప్పుడు ఆ బాలుడు వెంటనే నేను సాతానును వణికిస్తున్నాను అని చెప్పెను. ఈ రోజు మేము సండే స్కూలులో "అతి సామాన్య విశ్వాసులలో ఎవరైనా మోకరించినపుడు సాతాను వణికి పోవును" అను ఒక క్రొత్త పాట పాడాము. అందుకే నేను సాతాన్ను గడగడలాడించుటకు మోకాళ్ళ మీద ఉన్నానని చెప్పెను.

అయితే సాతాను వణికించుటకు కేవలం మోకరించుట మాత్రమే గాక ఇంకా అనేకమైనవి ఉన్నవి. నీ జీవితంలో ప్రభువైన యేసు నామమున వాడికి నివాస స్థలం లేకుండా చేసినపుడు వాడు తప్పక భయపడి వణుకును. అలాగే, అదే సర్వ శక్తివంతమైన యేసు నామములో, వాడి యొక్క భయంకర కోరలలో ఉన్న అనేక విలువైన ఆత్మలను, పరిశుద్ధాత్మ ద్వారా నీవు బయటకు తెచ్చినపుడు వాడు మరింతగా గడగడలాడును.

అనేక క్రైస్తవులకున్న అభిప్రాయమేమంటే వారు సాతానును ఒంటరిగా వణికిస్తే, వాడు వారిని ఒంటరిగా ఉంచుతాడని వారు అనుకుంటారు . అయితే వారు విచారకరంగా మోసగించబడతారు. ఉదాహరణకు, గతకాల ఓటమికి సంబంధించిన ఒక విషయములో, నీవు దానిని దేవుని యెదుట ఒప్పుకొని క్షమింపబడినప్పటికీ, అప్పుడప్పుడు ప్రార్థించుటకు నీవు దేవుని సమీపించినపుడు, ఆ విషయమై విచారపడుట ఎప్పుడైనా నీవు గమనించావా? సిలువ దగ్గరే నీవు శ్రద్ధగా విడిపించుకొన్న పాపము గురించి, నిన్ను నిందించుటకు సాతాను ఎప్పుడూ ప్రయత్నించు చుండును. గనుక సాతాను

నీ గతము గురించి ఎత్తినపుడు, నీవు వాడి భవిష్యత్తును జ్ఞాపకము చేయుము. దేవుడు తాను క్షమించిన పాపమును మరలా జ్ఞాపకము చేసికొననప్పటికీ, సాతాను వాటిలో ప్రతి ఒక్క దాని మీదకు మరలా నీ దృష్టిని మరల్చి, నీవు దేవుని ప్రేమ క్షమాపణ యొక్క యదార్ధతను ప్రశ్నించునట్లు చేయును. దేవునితో నీ సహవాసము ఆటంకపర్చుటకు, సాతాను కలిగించు సందిగ్ధత, భయము, గందరగోళము మరియు నిరాశ అనునవి వాడి యొక్క గొప్ప సాధనములై ఉన్నవి. నీ యొక్క సంతోషమును, సమాధానమును దొంగిలించుటకు వాడు ఏ పనైనను చేయును. అయితే నీవు దేవుని వైపు చూచిన యెడల, వాడు ఎక్కడ స్థావరమేర్పరచు కొన్నాడో ఆయన నీకు తెలియజేసి, ఎల్లపుడు తన శక్తితో నిన్ను నింపుచుండును. అప్పుడు ఆయన నీకు అనుగ్రహించిన ఆయుధములతో, సిగ్గులేని సైతాను ప్రవేశాన్ని నిరోధించటానికి ప్రతి ద్వారమును నీవు మూయవలెను.

మానవ యుద్ధములో ఆత్మ రక్షణ మరియు ఎదురుదాడి చేయు తంత్రములు ఉండును. ఏ యుద్ధము కూడా కేవలం ఆత్మ రక్షణ పథకములతోనే ఎప్పుడూ నిలవబడలేదు. అలాగే, ఆత్మీయ యుద్ధములో కూడా స్వీయరక్షణ మరియు పోరాడి ఎదిరించు తంత్రము కూడ ఎంతో అవసరము. రెంటికి కూడ దేవుని వాక్య యుద్ధ సామాగ్రి అవసరము. ఫలభరితమైన సహవాస సమయమును పెంపొందించు కొనుటకు ఉన్న అనేక ప్రోత్సాహకర మార్గాల్లో ఒక విధానమేదనగా "నీవు సైతానుతో ప్రత్యక్షముగా కాని పరోక్షముగా కానీ పోరాడునపుడు నీవు ధ్యానించుచు ఉన్న వాక్యములనే అధికారపూర్వకముగా ఉదహరించి వాడిని ఎదిరించుచుండ వలెను. తద్వారా బైబిలు ఆధారముగా నీవు ప్రార్థించుటకు తగిన శక్తి పొందెదవు." నీవు దేవుని వాక్య ప్రకారము ప్రార్థించునపుడు, నీవు దేవుని చిత్త ప్రకారము ప్రార్థించిన వాడవని తెల్సుకొనుట బహు ఆశ్చర్యమును పుట్టించును. మరియు నీ ఆత్మీయ జీవితమును పడద్రోయు సాతాను మీదను, వాడి ప్రయత్నము మీదను నీవు జయము పొందినావని తెలుసుకొనుటయే నీ విషయములో దేవుని చిత్తమైయున్నది.



**స్వీయ రక్షణ (తో కూడిన) ఆత్మీయ యుద్ధము:**

మన ప్రభువైన యేసు ఎప్పుడు సాతాను చేత శోధింపబడినాడో నీవు గుర్తుకు తెచ్చుకోగలవా? ప్రభువు ఆ సమయములో ద్వితీయోపదేశ కాండము చదువుతూ తన సహవాస సమయమును గడుపుతు ఉన్నాడని నేను అనుకొంటాను. ప్రభువు తన స్వీయ రక్షణకు, వాడికి వ్యతిరేకముగా ఉదహరించిన వాక్యములన్నియు ఆ గ్రంథములోనివే.. *"వ్రాయబడి ఉన్నది... వ్రాయబడి ఉన్నది... వ్రాయబడి ఉన్నది..." (మత్తయి 4:4,7,10).* దేవుని వాక్యములోని బలమైన ఆయుధములు, యేసునొద్ద నుండి సాతానును పారిపోవునట్లు చేసెను.

ఆ ప్రకారముగానే నీవు సైతానును గెలువవలెనన్నా, బైబిలును ఎలాగున నీ స్వీయ రక్షణ యుద్ధాయుధముగా ప్రయోగించవలెనో నీవు నేర్చుకొని ఉండవలెను. సైతాను తన దుష్ట ఆలోచనలను నీ మనసులో నాటుచుండు నపుడు దేవుని వాక్యమే నీ సహాయము, ఆశ్రయమై ఉండవలెను. నిలకడైన సహవాస సమయమే దేవుని వాక్యము ఆ ప్రత్యేక సమయంలో నీలో నిలబడి నట్టి నిశ్చయత కలిగించును.

రచయిత ఎవరో తెలియని ఈ క్రింది పద్యమే ఎఫెసీ 6వ అధ్యాయం ఆధారముగా పై సత్యములో స్థిరముగానాటబడియున్నది.

**సైతాను పన్నాగములు**

ఈరోజు చేసితిని నేనొక ఘోర యుద్ధము
నా ప్రార్థనా స్థలములోనే ఉండి..
దేవునిని కలుసు కొనుటకు, మాట్లాడుటకు నేను వెళ్ళాను
అయితే అక్కడ సాతానును కనుగొన్నాను
వాడు గుసగుసలాడాడు "నీవు నిజముగా ప్రార్థించలేవని,
ఎంతో కాలం క్రితమే నీవు తప్పిపోయావని,
నీవు మోకరించి కేవలం మాటలు పలక గలవేమోగానీ,
నీవు నిజంగా ప్రార్థించలేవని నీకే తెలుసునని"

ఆ వెంటనే నా శిరస్త్రాణమును నేను క్రిందకు లాగాను
నా చెవుల మీదికి వచ్చునట్లుగా చేసాను
అది వాడి స్వరమును కనబడకుండా చేసినది
నా భయములన్నిటినీ అణచి వేయుటకు సహాయపడినది
వెంటనే నా ఇతర కవచములను కూడా సరిచేసుకున్నాను
సమాధానములో నా పాదములను స్థిరపర్చుకొన్నాను
సత్యముతో నా నడుమును కట్టుకొని సిద్ధపడ్డాను
నా ఖడ్గమే దేవుని వాక్యము
నీతియను నా రొమ్ముదట్టిని ధరించే ఉన్నాను
నా హృదయ ప్రేమను కాపాడుకొనుటకు
నా విశ్వాసడాలు స్థిరంగా ఉన్నది
వాడి భయంకర బాణాలు వెనక్కి తిరిగి పోయినవి
యేసు నామములో నేను దేవుడ్ని పిలిచాను
పవిత్ర రక్తమును అర్థించాను
సైతాను సిగ్గుతో జారుకున్నపుడు
నేను దేవుడ్ని కలుసుకొని ఆయనతో మాట్లాడాను.. ఆమెన్

**ఎదురుదాడితో కూడిన ఆత్మీయ యుద్ధము:**

ఏది ఏమైన, సంపూర్ణ విజయాలు కావాలంటే స్వీయ రక్షణ పథకములకు మించిన ప్రణాళికలు అవసరము. ఎందుకంటే గాయపరచే ప్రపంచం మన ప్రక్కనే ఉన్నది. క్రీస్తు తన ప్రాణము పెట్టిన అనేక కోట్ల మంది యొక్క నివాస స్థలము అది. అందులో ప్రతి చోటా స్త్రీలు, పురుషులు అనేకులు సాతాను చేత గాయపర్చబడి, అంధులుగా చేయబడి బంధింపబడు చున్నారు. సాతానుకు వాడి సమయము తక్కువని తెలుసును. అందుకే వాడు చనిపోయే ప్రజలకు దేవుడు లేని నిత్యత్వాన్ని సంపాదించుటకు తన "పెరికి ఆహ్వానం" చివరిసారిగా పంపిస్తున్నాడు అని నేను అనుకుంటున్నాను.



దేవుడు నరకాగ్నిని సాతానుకు, వాడి చెడు దూతలకు సిద్ధము చేసినాడని వాక్యములో చదివినా ఆయన అదే నరకమును నరుల కొరకు కలుగచేయ లేదని మనం బాగా జ్ఞాపకముంచుకోవాలి. అవును, నిజానికి తప్పిపోయిన ఈ ప్రజలందరికొరకే క్రీస్తు మరణించాడు. అయితే మంచి, పరిశుద్ధతల మీద తనకు కల్గిన ద్వేషముతో, క్రోధముతో వాడు ఎన్ని ఆత్మలను తీసుకెళ్ళుటకు అవకాశమున్నదో అన్నిటినీ, తనతో నిత్య శ్రమకు తీసుకెళ్ళుటకు చూస్తున్నాడు. తప్పిపోయిన ఆత్మల కొరకైన ఈ యుద్ధములో క్రీస్తు ఇంకనూ వెదకుచూ, ఆయనకు తమను అందుబాటులో ఉంచుకున్న క్రైస్తవుల ద్వారా తన రక్షణ కార్యక్రమమును ఆయన ఇంకను కొనసాగించుచునే ఉన్నారు.

జ్ఞానవంతులైన ప్రజలు, అంత సులభమైన సువార్తను ఎందుకు అర్ధము చేసికోలేకపోతున్నారో నీవు ఎప్పుడైనా ఆలోచించి ఆశ్చర్యపడ్డావా? ఎవరు వారి ఆలోచలను గందర గోళపరుస్తున్నారో, విశ్వాసులుగా మారుటకు కొంత మంది అవిశ్వాసులకు ఎందుకంత కష్టమో, బైబిలులో మనకు వివరించ బడినది.

*"మా సువార్త మరుగు చేయబడిన యెడల నశించుచున్న వారి విషయములోనే మరుగు చేయబడియున్నది. దేవుని స్వరూపియై ఉన్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగ సంబంధమైన దేవత (సాతాను) అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డి తనము కలుగచేసెను" (2 కొరింధి 4:3,4)*

దేవుని ప్రేమ సత్యముల వెలుగు ఒక అవిశ్వాసి యొక్క మనసులోనికి చొచ్చుకొని పోకుండా ఆపే వాడెవరు ? సాతానే. స్త్రీ పురుషులైన వారి రక్షణ గురించి ప్రార్థించునపుడు నీవు ఈ అంశమును పరిగణనలోనికి తీసుకుంటావా? మనము ప్రార్థించునపుడు, సర్వశక్తిగల యేసు నామమును ఉద్ఘాటించుట ద్వారా, మార్పుచెందని ప్రజల యొక్క మనస్సును సైతాను యొక్క మోసపూరిత బంధకముల నుండి తప్పని సరిగా విడిపించ వలెను. ఇటువంటి అద్భుతమైన, శక్తికల్గిన జయ నామమును గూర్చి చార్లెస్ వెస్లీ ఇలా వ్రాసాడు:

1 పాతాళమందైనా, భూమిమీదైనా, ఆకాశంలోనైనా,
2 యేసు నామమే అన్నిటి కంటే పైనున్నది
3 భూతాలు ఆ నామమునకు భయపడి పారిపోగా
4 మనుషులు, దూతలు దాని ముందే సాగిలంపడుదురు

అవును, సైతానుపైనా, వారి దుష్టపు దూతలందరి పైనా కల్వారి సిలువ పై దగ్గరే మనకు కలిగిన జయము నిత్యత్వము వరకు దాచబడి ఉన్నది. *"అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" (I యోహా 3:8).* హల్లెలూయ. మనము ఓడిపోవుచున్న యుద్ధము జరిగించుట లేదు. అవును నిశ్చయముగా మన కొరకు రెండు వేల సంవత్సరముల క్రితమే మరి తిరుగు లేకుండా భద్రము చేయబడిన జయమునే మనము ఇంటికి మోసికెళ్ళుచున్నాము.

చదరంగపు క్రీడలో నీ ప్రత్యర్ధి మీద గెలుచుటకు ఒక నిర్ధిష్టమైన, తిరుగులేని విధంగా పావులను కదుపుటకు నీకు అవకాశమున్నది. అప్పుడు నీ ప్రత్యర్ధి యొక్క ఓటమి నిర్ధారించబడుతుంది. అయితే నీ ప్రత్యర్ధి మొండివాడైతే, అతనికి ఓటమిని తప్పించుకొనే మార్గము ఏదీలేనప్పటికీ, అతను పూర్తిగా జయించబడే సమయమును ఇంకొంచెము ఆలస్యము చేయవచ్చును.

సైతాను పరిస్థితి కూడా అలాగే ఉన్నది. వాడు తన యుద్ధములో గెలిచేందుకు ఏ విధమైన అవకాశం లేనప్పటికీ, సాధ్యమైనంత వరకు దేవుడు అనాదిలోనే వాడికి నిర్ణయించిన నరక శిక్షను ఆలస్యము చేయుటకు విఫలయత్నం చేయుచున్నాడు. సైతాను సంకెళ్ళతో బంధింపబడబోవుటకు ముందు మిగిలిన ఈ కొద్ది సమయములో, వాడు ఓడింపబడిన శత్రువు మాత్రమే కాదుగానీ, వాడి గుట్టు బయటపడిన శత్రువు. **సైతాను తంత్రము లను మనము ఎరుగని వారముకాము** (2 కొరిం 2:11) అని బైబిలు మనకు చెప్పుచున్నది. *శత్రువు యొక్క తంత్రమును ఎరుగుట అంటే యుద్ధములో తిరుగులేని ఆధిక్యతను కూడగట్టుకొనుటయే.*



అపోస్తలుడైన యోహాను, సాతాను మీద పరిశుద్ధులు పొందిన విజయమును, ఏలాగు ప్రభువు సంపాదించిన జయమును వారు స్వంతంత్రించుకొన్నారో చక్కగా వ్రాసెను. *"వారు గొర్రెపిల్ల రక్తమును బట్టియు, తామిచ్చిన సాక్ష్యమును బట్టియు వానిని (సాతానును) జయించి యున్నారు గాని మరణము వరకు తమ ప్రాణములను ప్రేమించిన వారు కారు". ప్రక. 12:11. మనము మన ప్రాణములను మరణము వరకు ప్రేమించము, ఎందుకంటే "మన ప్రాచీన పురుషుడు ఆయనతో కూడ సిలువ వేయబడెను" (రోమా 6:6)*

**అవును, ఆయన రక్తము చేయు శుద్ధి, మన పెదవుల ఒప్పుకోలు, క్రీస్తుతో కూడ మనము సిలువవేయబడిన స్థితి, నర శక్తుల మీద, క్రీస్తులో మన విజయమునకు కావలసిన హక్కును మనకు ఋజువు చేయును. హల్లెలూయ...**

నాతో కలసి ఆనందించండి. మనము పరిపూర్ణులైన, జయించిన క్రైస్తవులుగా మారుటకు ప్రభువైన యేసు ప్రతి విధమైన సౌకర్యమును (అవకాశము) మనకు కల్పించారు. అయితే అదే సమయంలో, మనం బాగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే మనము ఆయన విషయంలో చిన్న పిల్లల తరగతి (నర్సరీ) నుండి ముందుకు కొనసాగుటకు ఇష్టపడని యెడల, ఆయన ఎంత మాత్రము ఆత్మీయ పరిపూర్ణతను మనకు (బలవంతముగానైనను) అందించలేరు. ఆయన విషయమైన మన ఆత్మీయ సామర్ధ్యము, ఈ లోకములో మనము ఉన్నప్పుడే నిర్ణయించబడుతుంది.

అలాగే మనము ఆయనలో ఎంతగా పరిపూర్ణులమౌతామో పరలోకము చేరినపుడు, మన పనిని బట్టి, మనము అనుభవించ గల్గిన స్థితిని బట్టి, ఛాయలేని, అతి సామీప్య సహసములో ఆనందముగా అంతగా ఆయనతో ఉండగలము.

Blank



## ఆత్మీయ పరిశీలన

1. నేను నిద్రపోవుటకు వెళ్ళునపుడు దేనిని గురించి ఆలోచిస్తాను?
2. నేను బైబిలు చదువునపుడు దేవుని స్వరము వినుటకు ఎదురుచూచుచున్నానా?
3. నేను బైబిలు చదువునపుడు దేవుడు చెప్పిన ప్రకారము చేయుటకు నేను ఇష్టపడుచున్నానా?
4. నా జీవితము ఇంకా "నేను" అను తీరును బట్టి వివరించ బడుచున్నదా? లేక నాయందు జీవించుచున్న క్రీస్తును బట్టి వివరించ బడుచున్నదా (గలతీ 2:20)?
5. నేనొక స్వతంత్రమైన వ్యక్తినేనా? అలా అయితే నేను నా గర్వమును విడిచి పెట్టి దేవుని మీద సంపూర్ణముగా ఆధారపడి బ్రతుకుటకు ఇష్టపడు చున్నానా?
6. నా దేవుని ఆరాధించుటే, నేను ఆ లోకంలో చేయదగిన అత్యున్నతమైన కార్యమని నేను గుర్తించితినా?
7. నా జీవితంలో సాతానుకు ఏదైనా నివాస స్థలం ఉన్నదా?
8. సాతాను మీద క్రీస్తు సంపాదించిన విజయమును నేను వ్యక్తిగతముగా స్వతంత్రించుకొనవలసిన అవసర మున్నదా?

నా విశ్వాసమునకు ఒక విశ్రాంతి స్థలము దొరికినది
మత పద్ధతిలోకాని సిద్ధాంతములోకాని కాదుగాని
నిత్యము జీవించు వానినే నేను నమ్ముదును
ఆయన గాయములు నా కొరకు విజ్ఞాపన చేయును

నా హృదయము ఆయన వాక్యము మీదే ఆనుకొనుచున్నది
వ్రాయబడిన దేవుని వాక్యమది
నా రక్షకుని నామము ద్వారానే నాకు రక్షణ
ఆయన రక్తము ద్వారానే విమోచన

మరే ఇతర కారణము నాకు అవసరం లేదు
మరే ఇతర సాకు నాకు అవసరం లేదు
యేసు చనిపోయాడు అంతే చాలును
ఆయన నాకోసమే చనిపోయాడు

లీడ్ హెచ్. ఎడ్మండ్స్

## అధ్యాయము - 5

# విశ్వాస లక్షణము

అవతలి గట్టుమీదున్న తన స్నేహితుని చేరుకొనుటకు, పరవళ్ళు తొక్కుతూ ప్రవహించుచున్న నదిని దాటే ప్రయత్నంలో మధ్యలో చిక్కుబడి ఉన్న ఒక వ్యక్తిని నీ మనసులో ఊహించుకొనుము. అతని దగ్గర పడవలేదు. కానీ కేవలం గాలిపటం, ఒకటే ఉన్నది. దానితో పాటు దారపు బంతులు అనేకము అతని దగ్గరున్నవి. వాటిలో ప్రతి ఒకటి, దాని ముందున్న దారము కంటే మందమైనవై, చివరి దారపు తీగ ఒక పెద్ద త్రాడు అంత బలముగా ఉన్నది. అతి పలచనైన దారమును ఉపయోగించి ఆ వ్యక్తి ఆ గాలిపటమును ఎగరవేసి అవతల గట్టుమీదున్న తన స్నేహితుని చేతులలో అది పడేటట్లు చేస్తాడు. ఇప్పుడు ఆ గాలిపటం అసలు దారమునకు, దానికి కొంచెం మందమైన దారమును

జోడించును. ఆ తరువాత ఇంకొంచెం మందమైనది జతచేస్తూ, చివరికి దాటుటకు అసాధ్యమైన ఆ నది ఆవలి గట్టు వరకు ఆ త్రాడు వచ్చునట్లుగా చేసెను. అప్పుడు నదికి అతల ఉన్న చెట్టుకు ఆ త్రాడు కట్టిన తరువాత ఆ వ్యక్తి తన స్నేహితుని దగ్గరకు క్షేమముగా చేరగలిగెను.

ఒక రక్షింపబడిన దేవుని బిడ్డగా, నీ పాపముల కొరకు, దేవుని ప్రేమ పూర్వక ప్రత్యామ్నాయమైన యేసు క్రీస్తు ప్రభువు యొక్క మరణమందు నీ విశ్వాసము నుంచినావు. అయితే నీవు మొదటగా బైబిలు చదువుట ప్రారంభించినపుడు నీ విశ్వాసము ఆ త్రాడు యొక్క మొట్టమొదటి దారమంత బలహీనముగా ఉండవచ్చును. అయితే గాలి పటంతో సంబంధం కలిగి ఉండుటకు అది చాలును, ఎందుకంటె గాలి పటం అప్పటికే అవతలి తీరం చేరుకొంది గనుక. *"వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట (దేవుని వాక్యము) వలన కలుగును" (రోమా 10:17)* అని వ్రాయబడినది. గనుక నీవు దేవుని వాక్యమును చదువుతూ ఆయన అమూల్య వాగ్దానములను గట్టిగా పట్టుకొనుచున్నపుడు, నీ విశ్వాసము రోజురోజుకి మరింత బలపడును. తన ప్రతి బిడ్డ కూడ విశ్వాసములో దృఢముగా ఉండాలని దేవుడు సంకల్పించినాడు. ఆ విశ్వాసమును బట్టే దేవుని బిడ్డకు, పరలోకపు తండ్రికి మధ్య సామీప్యమైన సహవాస బంధము స్థిర పడగలదు.

అటువంటి రక్షించే విశ్వాసము యొక్క ప్రారంభ పునాది మీద కట్టబడుట ఎంత అవసరమో యూదా తన పత్రికలో తెలియ చేయుచున్నాడు. "ప్రియులారా! మీరు విశ్వసించు అతి పరిశుద్ధమైన దాని మీద మిమ్మును మీరు కట్టుకొనుచు..." గనుక ప్రార్థన, ప్రేమ, జీవ నిరీక్షణ, క్రియాకనికరము, నిస్వార్థమైన ఆత్మల రక్షణలతో కూడిన జీవితమును పెంపొందించుకొనుట ద్వారా, మనము ఆత్మీయముగా (అనగా పరిపూర్ణులముగుటకు, విశ్వాసమును ధృడ పర్చుకొనుటకు) ఈ స్థిరమైన రక్షణ పునాది మీద మనలను మనము నిర్మించు కొనవలెనని ఈ వచనము గట్టిగా చెప్పుచున్నది.



ఆంప్లిఫైడ్ బైబిలు *(The Amplified Bible)* (విస్తరింప చేయబడిన బైబిలు) లో పై అంశము ఇలా తర్జుమా చేయునది.

> *"ప్రియులారా! " అతి పరిశుద్ధమైన విశ్వాసము మీద మిమ్మును మీరు (ఒక పెద్ద భవంతివలె అంతకంతకు కట్టబడుచు వృద్ధి చెందునట్లు) కట్టుకొనుడి (పునాది వేయబడుడి) పరిశుద్ధత్మలో ప్రార్థన చేయుచు; దేవుని ప్రేమలో మిమ్మును మీరు కాపాడుకొనుచు ఉండుడి; ప్రభువైన యేసు క్రీస్తు (మెస్సయ్య) యొక్క అనగా మిమ్మును నిత్య జీవమునకు నడిపించు కరుణ కొరకు అపేక్షించుచు ఓపికతో ఎదురు చూడుడి. సందేహపడి తడబడు వారి మీద కనికరముంచుడి; అగ్ని నుండి బయటకులాగునట్లు ఇతరులను రక్షించుటకు (ప్రయాసపడుడి) మరి కొందరి మీద జాలి పడుడి (కాని) భయముతో; శరీర అపవిత్రతో, ఇంద్రియ సుఖములతోను మైలపడిన వస్త్రమును అసహ్యించుకొనుచు.. (యూదా 20-23)*

**నీ రక్షణ, విశ్వాసము ద్వారా నీవు పొందిన ఉచిత బహుమతి అయినప్పటికీ, అదే విశ్వాసము ద్వారా పునరుత్థానుడైన యేసు ప్రభువు యొక్క సర్వ సమృద్ధికర జీవమును నీవు స్వతంత్రించు కొన్నపుడు, నీ జీవితము నీలో నివసించు క్రీస్తు ద్వారా పర్యవేక్షించబడును.** అవును "నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును" (రోమా 1:17; గలతీ 3:11; హెబ్రీ. 10:38).

పరలోకంలోనైనా లేదా ఈ లోకంలో ఉన్నంత కాలమైనా నీవు విశ్వాస మూలముగా జీవించవలెను. ఆయనను, ఆయన వాగ్దానములను నమ్ముచు, నీ ద్వారా ఆయన పని జరిగించబడుటకు నీ వెల్లపుడూ ఆయనకు అనుకూలముగా ఉండుట ద్వారా, నీవు జీవించవలెను. నీవు పరలోకము వెళ్ళినా కూడ, అక్కడ ఆయన అనంత ప్రేమ ఉద్దేశములను బట్టి నీవు సంతోషము తోను, కృతజ్ఞతతోను అత్యానందమొందుటకు నీ విశ్వాసమే నీకు ఆధార మగును. విమోచింపబడిన నీ మనసు అర్థము చేసికొనగలిగిన దేనినైననూ దాటి ఆ నీ విశ్వాసమే ముందుకు వెళ్ళును.

నీవు ఇంకా ఈ లోకములో ఉండగానే నీవు ఎప్పటికీ సాధించలేని కార్యములను నీలోను, నీ ద్వారాను జరిగించుటకు అసలైన విశ్వాసము

ఎల్లప్పుడూ ప్రభువైన యేసు క్రీస్తు మీదే ఆధారపడి ఉండవలెను. దేవుని పిల్లలముగా మనలో ప్రతి ఒక్కరము విశ్వాసములో ఎదుగుట మన విధియై ఉన్నది. మన జీవదాత, మన అనుదిన జీవిత శిల్పియైన ఆ ప్రభువు మీద మనము అత్యధికముగా ఆధారపడుట నేర్చుకొనవలెను.

యదార్ధమైన విశ్వాసమునకు బదులుగా ఎన్ని సంగతులైనా తెచ్చి పెట్టుటకు ప్రయత్నించు మన మానవ ఆలోచనను తెలివిని, చాలా తరచుగా మనము ఆశ్రయిస్తూ ఉంటాము. విశ్వాసము యొక్క స్థానంలో ఉత్సాహ భరితమైన, ఆఖరికి క్రీస్తు కొరకు త్యాగపూరితమైన పనులను కూడ మన మానవ స్వతంత్రత చేయించును. అయితే ఒక క్రైస్తవ కార్యక్రమునకు హాజరుగుట ద్వారానైనా లేదా ఒక బోధకునికి నమ్మకముగా ఉండుట ద్వారా, బైబిలు విషయమందైన సంగ్రహ పరిజ్ఞానమును సంపాదించుకొనుటకు సమర్పించు కొనుట ద్వారానైనా సరే, ఒక యదార్ధమైన జీవ విశ్వాసము నిరూపించ బడవలసిన అవసరం లేదు. అటువంటి పనులు కొన్నిసార్లు అసలైన విశ్వాసమును ప్రతిబింబించినా, అవి ఉద్దేశపూర్వకంగా కాని, లేక అనుకోకుండా కానీ, ఒక శక్తివంతమైన వ్యక్తిగత విశ్వాసమునకు బదులుగా కొన్నిసార్లు మన భయంకరమైన స్వార్ధ ప్రయోజనముల కొరకు ఉద్దేశించబడినవై ఉన్నవి.

నిజమైన విశ్వాసమునకు మరియు పునరుత్థానుడైన ప్రభువు మీద నిరీక్షణతో ఆధారపడుటకు మధ్య ప్రత్యక్ష సంబంధము ఉన్నది. అయితే అనేక క్రైస్తవులు, తమ తలాంతులను వాడుకొనుట ద్వారానో లేదా వారి యొక్క యుక్తి గల వ్యక్తిత్వము ద్వారానో లేదా వారి బ్యాంక్ ఖాతాల మీద ఆధారపడుట ద్వారానో, తమ జీవితములో నెగ్గుకుపోగలమని అనుకొంటారు. అయితే బైబిలు స్పష్టముగా చెప్పునదేమంటే రక్షింపబడిన విశ్వాసులుగా మనము జయజీవితము కలవారమగుటకు మన జీవితములు పరిశుద్ధాత్మునిచే నియంత్రించబడవలెను. ఆయన మీదే ఆధారపడిన విశ్వాసమును మనము అభ్యసించక పోతే, ఆయన బలమైన శక్తికి మారుగా మన తెలివి తక్కువతో



చేసిన పని అంతయూ చివరికి వ్యర్ధమగును అని వాక్యము తేటతెల్లము చేయుచున్నది. క్రైస్తవులుగా మన చురుకుతనము, మనం చేసే పనిలో మనమెంత ఉత్సాహముగా ఉన్నాము అను అంశమును బట్టి నిర్ణయింపబడదు కాదుగాని, మనము చేయు పనులన్నిటికీ నిజమైన విశ్వాసము ప్రేరణయై ఉన్నదా లేదా అను సంగతిని బట్టి మాత్రమే నిర్ధారించబడును.

దేవుని ప్రేమగాకుండా మరేదైనా అనగా నీ ధనమైనా, నీ విద్య అయినా, నీ స్నేహితులైనా, నీ బలమైనా, నీ ఉద్యోగమైనా, ఆఖరికి నీ బహిరంగ స్వరూపమైనా.. నీ జీవితంలో నీకొక భద్రత భావమును, ప్రాముఖ్యతను కల్పించుచున్న యెడల, నీవు విశ్వాసము ద్వారా జీవించుట లేదనుటకు అవి ఒక సూచనగా ఉన్నవి. నీ జీవితంలోని అసలైన కాపుదలను, విలువను నీ దేవునిలోను, నీ విమోచకునిలోనే నీవు కనుగొనవలెను. నీ భూలోక ప్రయాణములో నీవు విశ్వాసము ద్వారా జీవించకపోతే, నీ జీవితములో దేవుని సన్నిధి యొక్క నిత్యానందమును, నీ ద్వారా జరిగించు ఆయన ప్రేమ పరిచర్యను నీవు కోల్పోవలసిన వాడవగుదువు. "విశ్వాసమూలము కానిది ఏదో అది పాపము". (రోమా. 14:23).

నిజముగా, మన విశ్వాసమును పురిగొల్పుటకు దేవుని వాక్యము ద్వారా పోషింపబడుట ఎంత అవసరమో తన అవగాహనమును జి.కీత్ ఈ విధంగా వ్యక్త పరిచాడు.

ఆయన యొక్క మిక్కిలి శ్రేష్టమైన వాక్యంలో
ఓ దేవుని సేవకులారా!
మీ విశ్వాసము కొరకు
ఆహా! ఎంత స్థిరమైన పునాది వేయబడినది

మన జీవితములో, హృదయములో దేవుని స్వరమును గుర్తించకుండా ఉన్నపుడు ఆత్మీయ అభివృద్ధికి ఎటువంటి పునాది ఉండదు. అలాగే మన రక్షకునితో చనువైన, అత్యంత సమీప్యమైన సహవాసము చేయుటకు, ఆయన అనాది సంకల్పన ప్రకారము, ఆయనతో మనము ఒంటరిగా సమయమును గడపని యెడల ఆ పునాదికి ఏ రక్షణ ఉండదు.

**దేవునితో నిత్య సహవాసమును పెంపొందించుటకు తగిన శక్తిని ఇచ్చునది విశ్వాసమే:**

అనేక సంవత్సరముల క్రిందట ఇంగ్లాండ్ దేశములోని వంద మంది పాదుర్లు హాజరైన కూటములో "ఉజ్జీవము" అను అంశమును గూర్చి నేను మాట్లాడుట నాకు జ్ఞాపకమున్నది. దేవుడు గొప్ప శక్తితో అందరి హృదయములను పరిశీలించుచు, మావద్ద బలముగా పని చేయుచుండెను. బహిరంగ ప్రార్ధనలు జరిగించు సమయములో, ఒక పాదరిగారు తన మోకాళ్ళ మీద లేచి, విరిగి నలిగిన హృదయముతో, కన్నీళ్ళతో ఈలాగు ప్రార్థించాడు "ఓ దేవా! అనేక మారులు నేను ఈ సహోదరులను ప్రార్థనలో నడిపించు చున్నపుడు, నా ముందున్న వారిమీద, నా వేదాంత జ్ఞానము మీదనే నా ధ్యాస ఎక్కువగా ఉంచుకొన్నాను గానీ నీ పరిశుద్ధ సన్నిధి మీద నా మనసు లగ్నము చేయలేక పోతినని ఇప్పుడు ఒప్పుకొను చున్నాను".

మనము ప్రార్థించునపుడు మన పరలోకపు తండ్రి యెదుట, మన అసలైన హృదయ అవసరతలను శ్రద్ధగా తెలియచేయుటకు ప్రయత్నించకుండా, మన స్వంత వాడుక మాటలలోనే మన ప్రార్థన బంధింపబడి ఉండే అవకాశమున్నది. అంతగా మన హృదయము మనల్ని మోసము చేయును. ఒక ప్రార్థనను ఉచ్ఛరించుట లేదా నోటితో పలుకుట నిజముగా మనము ప్రార్థించుట కాజాలదు.

ఆయన అనంత వెలుగు, పరిశుద్ధాత్మల పారదర్శకతలో మన హృదయములు బహిరంగముగా ఆయనకు జత చేయబడినపుడు మాత్రమే, మన ప్రభువు మన సహవాస సమయము నుండి దైవిక ఆనందమును పొందగలరు.

పరిశుద్ధుడైన దేవునికి, ఒక బీద పాపి ఏ విధమైన సంతృప్తినైనా కలిగించగలడు అని తలంచుటకు భయంకరముగా నుండును. అయితే దేవుడు మనిషిని ఆ అభిప్రాయముతోనే అనగా తనకు మహిమ తెచ్చుటకే కలుగ చేసాడని బైబిలు మనకు చెప్పుచున్నది. మనకు ఇష్టమున్నా లేకపోయినా మనలో ప్రతి ఒక్కరము ఆయన మహిమ కొరకే జీవించు చున్నాము.." అన్ని విషయాలలో ప్రభువును సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్లుగా నడుచుకొనవలెను (కొలస్సై 1:10) అనునది కొలస్సైలో ఉన్న సంఘము గురించి పౌలు యొక్క అత్యాసక్తి గల కోరికయై ఉన్నది. "అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు" అను వాక్యమును బిషప్ హాండ్లే మౌల్ "ఆయన చిత్తములోని ప్రతి ఆకాంక్షకు తగినట్లుగా" అని తర్జుమా చేసెను. 'సరిగా ఉండుము' అనే మాటను మనం ఉపయోగించినపుడు కూడా బహుశా పై భావమునే మనము కలిగి ఉండవచ్చును. సంపూర్ణముగా ప్రీతికరముగా ఉండుట అనగా "నీ ఇష్టమునకు ముందు ఇతరుల ఇష్టమునకు అనుకూలత కల్పించుట".



మన దేవుని సంతుష్టిపర్చుట కంటే మనలను మనమే సంతోషపర్చుకొనుటకు ప్రయత్నించిన యెడల, మన మునివేళ్ళతో ప్రతిరాయిని ఎదురు తన్నుటకును, ప్రతి గోడకు మన తలను గుద్దుకొనుటకును, జీవిత బాటలో ప్రతి ఆటంకమునకు తట్టుకొని పడిపోవుటకును మనము ముందుగానే నిర్ణయించబడినామని అర్ధము. అయితే, దేవుని బిడ్డలు దేవుని యొక్క మహిమ ప్రేమల పారదర్శక కాంతిలో, ఎప్పుడైతే ఆయనతో సహవాసము చేస్తారో, అప్పుడు ఆ దేవుని హృదయములోను, ఆ ప్రతి విశ్వాసి హృదయములోను ఎంతటి మహిమానందముండునో కదా!

మన ఉపయోగార్థమై బైబిలు, "విశ్వాసమునకు మరియు దేవుని సంతుష్టి పర్చుటకు ఒక నిర్దిష్టమైన సంబంధమున్నదని" ప్రత్యక్ష పర్చుచున్నది. అని వ్రాయబడిన వచనము, విశ్వాసమునకును దేవునికి హాయినిచ్చుటకును ఉన్న సంబంధమును మరింతగా నొక్కిచెప్పుచున్నది. అయితే ఈ వచనములోని తరువాత వాక్యములు యధార్థమైన ప్రతి విశ్వాసికీ అనుకూలమైన నిశ్చయ వాక్యముగా మారి గొప్ప పోత్సాహమును కలిగించును. ఏలాగనగా దేవునితో సహవాసము, దేవుని నుండి 'ఈవులను' అందించునని కూడా ఆ వాక్యము తెలియజేయుచున్నది. "దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము, దయచేయు వాడనియు

నమ్మవలెను గదా!" (హెబ్రీ. 11:6) తన రక్షకుడైన ప్రభువుతో అతి సామీప్య సహవాసములో జీవించు ప్రతి వ్యక్తి మీదా దేవుడు దయాపూర్వకముగా కుమ్మరించు ఆత్మీయ ఫలములు ఎవరునూ వివరింప శక్యముకానివి. వ్యక్తిగతముగా అనుభవించినపుడు మాత్రమే వాటిని మనము అర్థము చేసికొనగలము. ఆయనకు ఆహ్లాదమును, ఆయన పిల్లలకు అత్యానందమును కల్గించే ఆ దైవ సహవాసమునకున్న తాళము విశ్వాసమే....

**పునరుత్థానుడైన క్రీస్తు యొక్క విజయమును అంచెలంచెలుగా దేవుని బిడ్డకు అందించుటకు, పరిశుద్ధాత్మ యొక్క సాధనము విశ్వాసమే.**

ఇంతకు ముందే మనము గమనించినట్లు, దేవుని వాక్యమును చదువుట ద్వారా కానీ, ఒక బోధకుని మాటలు వినుట ద్వారా గానీ మనము దేవుని వాగ్దానములను సంపాదించుట ఎంతైనా సాధ్యమే. అయితే ఇటువంటి అనుభవమే ఏ ఆత్మీయ ప్రయోజనం లేకుండా కూడా ఉండవచ్చును. ఎందుకనగా, *"వారు వినిన వారితో విశ్వాసము గలవారై కలిసి ఉండలేదు గనుక వారు విన్న వాక్యము వారికి నిష్ప్రయోజనమైన దాయెను" హెబ్రీ 4:2.*

దేవుని వాక్యమును, విశ్వాసమనే చెంచా (Spoon)తో, సిరస్సు నుండి హృదయము వరకు దిగునట్లు బాగా త్రిప్పి నపుడు మాత్రమే ఆ వాక్యపఠన మనకు ఫలభరితముగా నుండగలదు. సరిగా ఆ స్థితిలోనే పరిశుద్ధాత్ముడు, ప్రభువైన యేసు యొక్క బలపరిచే కృపను మన జీవితములకు అద్దగలడు. అప్పుడు మనం ప్రభుని సేవించుటకు వచ్చు ప్రతి అవకాశమును ఉపయోగించుకొన గలము. మన జీవితములోని ప్రతి సమస్యను ఎదుర్కొనుటలో, బలపరిచే ఆయన శక్తిని, మనము నిరూపించ గలము.

అయితే ఈ విషయము మాత్రము నిశ్చయముగా జరుగును. యదార్థమైన ప్రతి విశ్వాసీ, తీవ్రమైన శోధనను, శ్రమను కొద్ది దినములు అనుభవించును. మన ప్రభువుతో అనుదిన సహవాస జీవితము నుండి మనలను దారి మళ్ళించుటకు, సాతానుడే స్వయముగా లోకము, దాని యొక్క మోసపూరిత



ఒడంబడికలను నీపై ప్రయోగించును. తన విమోచకునితోనూ, ప్రభువుతోను గొప్ప సహవాసములో ఉన్న దేవుని బిడ్డ కంటే, సైతానుకు అసహ్యకరమైనది వేరకటి లేదు. గనుక రక్షించబడిన విశ్వాసులు తమ సృష్టికర్తతో, వారి విశ్వాసమును నిర్మించే సహవాస సమయములు అనుభవించకుండా మిత్ర భేదము, (మనసు విరుగునట్లు) చేయుటకై, ఆ దుష్టుడు ఎంతటికైనా వెనుదీయడు అని గ్రహించుట ఆశ్చర్యము అనిపించదు.

ఆత్మీయముగా పసిబిడ్డయైన వ్యక్తికి, ఈ భౌతిక ప్రపంచమే జీవితము యొక్క వాస్తవరూపముగా కనిపించును. అయితే అది నిజంకాదు. వాస్తవానికి ఆత్మీయ ప్రపంచమే అత్యున్నతమైన వాస్తవ రూపమై యున్నది. *"లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవి కావు; అవి లోక సంబంధమైనవే" (1 యోహా 2:26)* ప్రజలు చాలా తేలికగా మోసపోతారు కాబట్టి క్రైస్తవుని ప్రలోభపెట్టుటకు తన మోటు తంత్రములను ప్రయోగించుట సైతానుకు పెద్ద కష్టముకాదు.

*శరీరాశ* (భాధ్యతలేని సుఖము) ద్వారా, *నేత్రాశ* (భాధ్యత ఎరగని సంపాదనలు) ద్వారాను, *జీవపుడంబము* (భాధ్యత విస్మరించిన బలము) ద్వారా మనము శోధింపబడుచున్నామని బైబిలు చెప్పుచున్నది. దేవుడు మన కొరకు సిద్ధము చేసిన ప్రతి ఈవిని భంగము చేయుటకు అవసరమైన అన్ని తంత్రములు సైతానుకు తెలుసు. మనం దేవునితో కలిసి జీవించకుండుటకు వాడు ఏదైనా చేస్తాడు. మనము మన దేవునితో అటువంటి చనువైన పరిచయం కల్గిఉంటే, మనం ఆత్మీయముగా పరిపూర్ణుల మౌతామని, తద్వారా మన పరలోకపు తండ్రికి అమితమైన ఆనందమును అందిస్తామని ఆ దుష్టుడికి తెలుసును.

*శరీరాశ:*

వ్యభిచార కాలుష్యముతో పరిపక్వమై బహిరంగముగా దుర్నీతిని వెదజల్లు చున్న నేటి ప్రపంచము ద్వారా, సాతాను శరీరము యొక్క పాపేచ్ఛను

ప్రేరేపించుచున్నాడు. భౌతికమైన ,లోకానుసారమైన, శరీరానుసారమైన వాటితో కలిసిపోయిన ప్రజల జీవితములలోనే సాతానునకు శీఘ్ర ప్రవేశము దొరుకుచున్నది. అయితే, సాతాను యొక్క చెడుసలహాలకు మోసపోయిన వారు, వాడు కల్పించిన ఆ పాప సుఖములనే గాలిబుడగలు వెంటనే పగిలిపోయి, వారికి సిగ్గను, శూన్యమును మాత్రమే మిగిల్చినదని వెంటనే గ్రహిస్తారు.

నేత్రాశ:

నూనె వంటి నునుపైన మాటలు గలిగిన ఈ వ్యాపార సంబంధమైన లోకమునకు మనం ఆకర్షించబడితే, ఇతరులు కల్గి ఉన్న దానిని చూచి అసూయ పడితే, సాతానుడు క్రూరముగా ముందుకు జొరబడగలడు. ఆ గొప్ప మోసగాడు మన చెవిలో ఈలాగు గుసగుసలాడతాడు. "నీకు ఒక మంచి కొత్త చేతి గడియారం ఉంటే, ఒక ఎకరం పొలం ఉంటే, ఒక పెద్ద భవనం ఉంటే నీవు చాలా సుఖంగా ఉండగలవు. మన వినూత్నమైన ఆలోచనల్లో మనము పూర్తిగా మునిగిన తరువాత గానీ, మన నూతన సదుపాయములు మనకు శాశ్వతమైన సంతృప్తిని కలిగించలేవని కనుగొనగలము. ఎందుకంటే *"మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును" (మత్త 4:4)*

జీవపు డంబము:

మన యొక్క దురహంకారము, ఆత్మాభిమానము, స్వీయ సమృద్ధి యొుక్క తప్పుడు భావన ద్వారా సైతాను యొుక్క నాశనకరమైన కుతంత్రములకు ద్వారము తెరవబడుచున్నది. గర్వము ఏ రకముగా ఉన్నను దేవుడు దానిని ద్వేషించును. మన గతిని నియంత్రించుటకు మన స్వంత సామర్థ్యము మీద నమ్మకముంచడమే విశ్వాసమునకు వ్యతిరేకమైన ఆలోచన. ఎందుకంటే విశ్వాసమనునది ప్రభువైన యేసు మీద మాత్రమే నమ్మకము



ఉంచునది. మనము ఇంతకు ముందు గానే గమనించినట్లు జీవపు డంబమునకు దేవుడు చెప్పిన ఏకైక విరుగుడు ఏదనగా *"ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి" యాకోబు 4:10.* సాతాను – "నీకు నీవే స్వయం సమృద్ధి కలవాడువు కదా!" అని నీతో యుక్తిగా చెప్పినపుడు. సర్వశక్తుడైన దేవుని మీదే నీవు ఆధారపడిన స్థితిని దీనముతో అంగీకరించినపుడు, వాడికి ఇక ప్రవేశము లేకుండా నీవు ద్వారము మూయగలవు.

*దేవుడు స్పష్టంగా మనకు చెప్పునదేమనగా "లోకమును జయించిన విజయము మన విశ్వాసము" (I యోహాను 5:4).*

అయితే నీవు, జయించిన విశ్వాసము యొక్క విజయములోనికి పూర్తిగా ప్రవేశించక ముందు (ఈ లోకంలో ఉన్న సమస్తము ద్వారా సాతాను నిన్ను సమీపించినపుడు), ప్రభువు తన శిష్యులకు నేర్పిన పాఠమును నీవు నేర్చుకొనుట ఎంతో ముఖ్యమై ఉన్నది. యదార్థమైన విశ్వాసమునకు అడ్డువచ్చు మరొక గొప్ప ఆటంకమును గూర్చి ఆయన వారిని ఇలా హెచ్చరించెను. "అద్వితీయ దేవుని వలన వచ్చు మెప్పునుకోరక, యొకనివలన ఒకడు మెప్పుపొందుచున్న మీరు ఏలాగు నమ్మగలరు?" (యోహా 5:44) అని యేసు ప్రశ్నించెను. ఈ మాటలలో ప్రభువు తన శిష్యులైన వారికి మనస్ఫూర్తిగా సూచించిన దేమనగా **ఇతరుల యొక్క మెప్పును, పొగడ్తను, అభిమానమును పొందవలెననే రహస్య కోరికతో విశ్వాసము ఎప్పటికీ కలిసి జీవించలేదు.**

నీవు ప్రతి దినము నీ సహవాస సమయమును ఆనందించగల్గితే నీ విశ్వాసము పెరుగును. అప్పుడు జీవితము యొక్క పరీక్షలను మరియు అవకాశములను నీవు ఎదుర్కొన్నపుడు, జయించే నీ ధృడమైన విశ్వాసమును ఏలాగున వాడుకోవలెనో నీవు తెలుసుకొన గలవు.

## ఆత్మీయ పరిశీలన

1. నా అనుదిన కార్యకలాపాల్లో, నేను ఆచరణాత్మక మైన విశ్వాసమును కలిగి ఉండి ఆనందించ గలుగు చున్నావా?
2. ప్రతి సమస్యలోను క్రీస్తు యొక్క సమృద్ధిని ఋజువు చేయుటకు; ప్రతి అవకాశంలోను లేదా ఏదైనా ఒక పరిస్థితిలోను, నేనేమైనా ఇబ్బందిని ఎదుర్కొంటున్నానా?
3. దేవుని పని ముందుకు సాగవలెనని నేను కోరుకుంటున్నానా లేక నా ద్వారా ఆయన పనిని ముందుకు సాగించవలెనని కోరుకుంటున్నానా?
4. నేను దిన దినము ప్రభువు మీద ఆధారపడుటను బట్టి భయరహితమైన జీవితమును గడుపుచున్నానా?

ప్రభువా! నేను మాట్లాడునట్లు మీరు నాతో మాట్లాడండి
మీ స్వరము యొక్క జీవపు ప్రతిధ్వనులతో;
మీరు వెదకినట్లే నన్నును వెదకనియ్యండి
తప్పిపోయి ఒంటరిగా ఉన్న నీ బిడ్డలను.

ఓ ప్రభువా! నేను బోధించునట్లు నాకును బోధించండి
మీరు అందించే అమూల్యమైన సంగతులను;
నా మాటలకు రెక్కలు దయచేయండి అవి అనేకుల
హృదయాంతరంగములలోనికి చొచ్చునట్లుగా,
ప్రభువా! సంపూర్ణతతో నన్ను పరిపూర్ణునిగా చేయండి
నా హృదయమే పొంగిపొరలునట్లుగా;
వెలిగించే ఆలోచనలలో, ప్రకాశించే మాటలలో
నీ ప్రేమ చెప్పుటకు, నీ స్తుతి చూపించుటకు.

– ఫ్రాన్సిస్ రిడ్లే హావెర్గల్

## అధ్యాయము - 6

# ప్రకటించే సమయము

ఒక రాత్రి కాల ఆరాధనలో నేను మాట్లాడి ముగించిన తరువాత ఒక తండ్రి నా దగ్గరకు వచ్చి, నేను ఆయన కొరకు ప్రార్థించవలెనని కోరినాడు. దేవుడు ఒక అసాధారణ శక్తితో ఆ సమయంలో మా మధ్య ఉన్నారు. అపుడా తండ్రి, "తన స్నేహితులకు, తోటిపని వారికి క్రీస్తును గూర్చి సాక్ష్యమివ్వ లేకపోవుచున్నాను"అని చెప్పాడు. ఎవరికైనా సహాయం చేయాలనుకొనేటప్పుడు నేను ఎప్పుడూ చేయునట్లే, అయ్యా! ఈ మనిషి జీవితములో ఉన్న అసలైన అవసరత ఏమిటో గ్రహించుటకు తగిన వివేక మిమ్మని మౌనంగా ఆయన్ను అడిగాను. అప్పుడు నేను "అది మీ యొక్క అసలైన సమస్య కాదని నేననుకొంటున్నాను. ఇప్పుడు మీరు నాతో మోకరించి దేవా! నేను నీ గురించి

ఎందుకు సాక్ష్యమివ్వలేకపోతున్నానో నాకు చూపించండి" అని ప్రార్థించగలరా? అని అప్రయత్నంగా అతనితో చెప్పాను. వెంటనే మరో మాట లేకుండా ఆ తండ్రి మోకరించి ప్రార్థించాడు.

అతను ఆలాగు చేసి మౌనంగాఉన్నపుడు, మాట్లాడలేని స్థితి కంటే మరింత గొప్ప సమస్యను అతనికి ప్రభువే స్వయంగా బయలుపర్చు చున్నట్లు నాకు అనిపించినది. అప్పుడు ఆ స్నేహితుడు గొప్ప విరిగి నలిగిన స్థితిలో ప్రభువుతో తన 'ఇంట్లో తాను ఎంత నిరంకుశుడో, తన పిల్లల విషయంలో ఎంత కఠినంగా ఉండేవాడో ప్రభువుతో చెప్పుకొనుచున్నాడు. అలాగు హృదయపూర్వక పశ్చాత్తా పముతో అతను ప్రభువును క్షమాపణ వేడుకొన్నాడు.

యేసు ప్రభువే స్వయముగా ఆ తండ్రికి ఒక నూతనమైన, సజీవమైన రీతిలో తన్నుతాను ప్రత్యక్ష పరచుకొన్నాడు గనుక సాక్ష్యమివ్వలేని అతని సమస్య గురించి ఆ రాత్రి మేము అసలు మాట్లాడుకోలేదు. ఆ మరుసటి రాత్రి ప్రజ్వలించే ముఖముతో ఆయన కూటమునకు వచ్చి ఎంతో సంతోషంగా "ఈ రోజు అంతా నా యేసును గూర్చి ఇతరులకు చెప్పకుండా ఉండలేక పోయాను" అని చెప్పాడు.

బైబిలులో ఎక్కడా కూడా, ఇంకనూ రక్షింపబడని వారికి ఒక, ఉపాయకరమైన రక్షణ సంకల్పన బోధించుమని లేదు. అయితే ప్రభువైన యేసు క్రీస్తు యొక్క నిత్య సహవాసములో మనము ఎప్పుడు నడవవలెనని బోధించబడుచున్నాము. అప్పుడు మనము ఇతరులతో సువార్తను పంచు కొన్నపుడు మన నుండి పొంగిపొర్లుచున్న ఆయన ప్రేమ, వారి హృదయములను సువార్త సత్యము వైపు త్రిప్పును.

అయితే మన హృదయములు ఆయన సజీవ సహవాసములో ఏకము కాని దినములలో మన సాక్ష్యము అంత ఫలభరితముగాను, క్రియా, రూపకము గాను లేనట్లు మనము కనుగొనగలము. వాస్తవానికి అటువంటి దినము లలో ఇతరులకు వాక్యము చెప్పకుండా మన పెదవులు మూయబడినట్లు ఉండును. అలాగే మన చుట్టు ఉన్న, క్రీస్తును వ్యతిరేకించు ప్రపంచమునకు కూడ ఉన్నపాటున ప్రభువును ప్రత్యక్ష పరచలేము. అన్యులైన వారికి ప్రభువైన యేసు క్రీస్తును గూర్చి ప్రకటించే అవకాశము కలిగినపుడు, నీ మనస్సులో తేలికగా ప్రవేశించు బలహీన తలంపుల నుండి నీవు పూర్తిగా తప్పింపబడవలెనంటే ,ప్రతి దినమును నీ ప్రభువు యొక్క సహవాస సమయముతో ప్రారంభించుట ఎంతైన నీకు ముఖ్యము.



దేవుడు తెలియని ఈ ప్రపంచములో ఆత్మీయముగా ఫలభరితమైన జీవితమును యదార్ధముగా అనుభవించుటకును మరియు ఒక సువార్త వర్తకుని గాను ఉండుటకు ఎంతో గొప్ప తేడా ఉన్నది. ఒక విశ్వాసి ఈ లోకము ఎదుట లేచి ఏవో కొన్ని మాటలు చెప్పి యేసు కొరకు సాక్ష్యమిచ్చునట్లుగా నియమింపబడలేదు గాని, తాను క్రీస్తులోనే ఉన్నట్లు నిర్ధారించుకొని ఆ స్థితి నుండి యేసును గూర్చి సంతోషముగా మాట్లాడవలెను.

మన ప్రభువు తన శిష్యులకు చెప్పినట్లుగా *"ఎవడు నా యందు నిలిచి ఉండునో, నేను ఎవని యందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును: నాకు వేరుగా ఉండి మీరేమియూ చేయలేరు" ( యోహా 15:5.)* ఆయనలో ఉండుట మరియు ఆయన గురించి ఇతరులకు చెప్పుట నీ బాధ్యత, ఫలింపునిచ్చుట ఆయన బాధ్యత.

పునరుత్థానుడైన యేసుతో శిష్యులు వ్యక్తిగతముగా మాట్లాడి, నడచినారు. కాబట్టి పెంతెకొస్తు అనుభవము తరువాత వారు తమ ఆనందమును ఉత్సాహమును ఆపుకోలేక పోయారు. వారు ఎక్కడెక్కడికైతే వెళ్ళారో అక్కడి ప్రజలకు దేవుని ఆశ్చర్య కార్యములను *(అ.కా. 2:11),* యేసు యొక్క వ్యక్తిత్వమునకు వ్యతిరేకులైన వారికి కూడ ప్రకటించారు. వారి మాటలు, వినే వారిలో ఆసక్తి రేకెత్తించినందున, పేతురు బహిరంగముగా 'క్రీస్తు యొక్క దైవాధికారము' అను అంశము మీద ప్రసంగించినపుడు వేలాది మంది కూడుకొనిరి. పేతురు అలాగు ప్రసంగించినపుడు వ్యక్తిగత పాపమును గూర్చిన సంపూర్ణ ఒప్పుకోలు ఆ సంఘమంతటిని ఆవరించినది. కొద్దికాలము క్రితమే యేసు ప్రభువును సిలువ వేసిన ఆ ప్రజలు *"సహోదరులారా! మేమేమి*

*చేతుము? (అ. కా 2:37)* అని రోదించారు. శిష్యుల యొక్క వ్యక్తిగత సాక్ష్యము, పేతురు యొక్క బహిరంగ ప్రసంగము, రెండూ కలిసి ఆ రోజున గొప్ప ఆత్మల పంటను సమకూర్చినవి.

ఆ తరువాత, ప్రతికూల వాతావరణంలో జీవిస్తు, ఒక ప్రాముఖ్య ప్రార్థనా సమావేశంలో శిష్యులు మరొకసారి ప్రభువును కలుసుకొన్నారు. శిష్యులను, వారి బోధను అసహ్యించుకొనిన యూద మత పెద్దలు యేసు గురించి మాట్లాడవద్దని వారికి ఆజ్ఞాపించారు. అయితే అంతకు ముందు మేడ గదిలో తన గురించి సాక్ష్యమిచ్చుటకు ప్రభువు తన శిష్యులకు వ్యక్తిగత సువార్త తరగతులు నిర్వహించలేదు. గానీ వారు పరిశుద్ధాత్మతో నిండి ఉన్నందున, *ఈ ఔత్సాహిక క్రైస్తవులు (శిష్యులు) మేము కన్నవాటిని, విన్నవాటిని చెప్పక యుండలేమని" (అ. కా. 4:20)* ఏకకంఠంతో ఉత్తరమిచ్చిరి. వారు మరలా దేవుని మహిమ సన్నిధిలో ఉన్నందున, పునరుత్థానుడైన క్రీస్తు యొక్క వాస్తవమును గురించి వారి హృదయములు మండుచుండెను గనుక వారు ఏకాంతంగా ఉండలేకపోయారు.

1960 ప్రారంభదశకములో నేను నా భార్య డోరతి, ఆ కాలములో "ఇనుప తెర"గా పిలువబడుచున్న ప్రాంతములో సువార్త పరిచర్య జరిగించాము. ఆ యొక్క నియంత్రత్వ ప్రభుత్వము క్రింద సేవ చేయుటలో ఉన్న కష్టములను గురించి అడిగినపుడు, ఒక నమ్మకమైన పాదిరిగారు ఈలాగు జవాబిచ్చాడు. "మేమిప్పుడు చాలా కొద్ది సంఖ్యలో ఉన్నాము. అయితే మేమెవరమో మాకు తెలుసు. తిరిగి లేచిన క్రీస్తును ఎరిగి ఉన్న మేము అజేయులము (ఎవరునూ జయించలేని వారము.) అటువంటి శ్రమలు నా చదువరులలో కొందరి యొుక్క అనుభవమై ఉన్నది. అంయుతే ఇప్పుడున్న పరిస్థితులను బట్టి చూడగా ప్రభువైన యేసు త్వరగా తిరిగిరాని పక్షమున, మనలో అనేకులము కూడా మన ఊహకు అందనటువంటి మార్గములలో ప్రభువు కొరకు మన సమస్తమును విడిచి వెళ్ళుటకు పిలువబడుదుము.



డొరతీ కొద్దికాలము క్రితము తన సహవాస సమయ పుస్తకములో ఈలాగు వ్రాసుకొన్నది "ఆయన ఆత్మ గనుక నాలో నుండి ప్రవహించు చున్నట్లయితే, ఆయన మరణము యొక్క ఖరీదు నా ప్రతి శ్వాసయందు స్మరణకు తెచ్చుకొనవలెను. నిశ్చయముగా ఆది క్రైస్తవులు తమ ధైర్యవంతమైన సాక్ష్యమునకు గొప్ప మూల్యమునే చెల్లించిరి. అయితే వారు యేసును గూర్చి మాట్లాడినందుకు ఖైదు చేయబడుదురని బెదరింపబడినపుడు, వారు ప్రార్థించుటకు సమకూడిరి. గనుకనే *"అప్పుడు వారందరూ పరిశుద్ధాత్మతో నిండినవారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి" (అ. కా. 4:31)* అని వ్రాయబడినది.

**ఆత్మపూర్ణుడైన విశ్వాసి జీవితము నుండి పరిశుద్ధాత్ముని యొక్క ప్రవాహములు పొర్లిపారుచుండగా, శక్తివంతమైన సువార్తీకరణ ఆ ప్రవాహముల నుండి బయలు వెళ్ళును. అలాగున విశ్వాసి అంతరంగ వాసియైన క్రీస్తు యొక్క నిజస్థితిని ఇతరులకు బైలుపర్చగలము.**

మనము క్రొత్త నిబంధన చదువునపుడు ఆది సంఘము యొక్క సువార్త ప్రకటన, కేవలము వేదిక లెక్కి బోధించే వ్యక్తుల అనుకరణ కాదు. శిష్యులు ముందుగా దేవుని ఆశ్చర్యకార్యములను ప్రకటించుటకు (అ. కా. 2:11) వ్యక్తిగతముగా వెళ్ళియుండని యెడల, పెంతెకోస్తు పండుగ దినమున పేతురు ప్రసంగమును వినుటకు ప్రజలు ఉండేవారు కాదు.

నిరాశా నిస్పృహలతో ఉన్న ఈ లోకమునకు, ప్రభువైన యేసు క్రీస్తు యొక్క పరిశుద్ధత, ప్రేమ, జీవములు విశ్వాసి హృదయములో నుండి ప్రవహించుచున్న యెడల, ప్రజల హృదయములు మెత్తన చేయబడి సత్య సువార్తను వినుటకు సిద్ధము చేయబడుదురు. అందుచేతనే, ఆయన ఆత్మతో నిత్యము *నింపబడుచుండుటకు (ఎఫెసీ 5:18),* ఆయన వాక్యపు వెలుగులో ప్రతిరోజు ప్రభువును కలుసుకొను చుండవలెను.

# ఉప్పొంగే సువార్త ప్రకటన

నా క్రైస్తవ జీవితము యొక్క ఆరంభ దినాల్లో నేను కొందరు యౌవ్వనస్థుల కూడికలో చేరాను. అప్పటికి మాకు వాక్యజ్ఞానం కంటే ఉత్సాహమే ఎక్కువగా ఉన్నది. ఈ స్థితిలో కూడా (బహుశా! ఈ స్థితిని బట్టి) దేవుడు మమ్ములను ఇంకా మార్పు చెందని మా స్నేహితుల మధ్య వాడుకొనుటకు సమర్థులుగా ఎంచుకొన్నాడు. యౌవ్వనస్తులుగా మేము పాల్గొన్న ఈ పరిచర్యలోని కొన్ని అనుభవములను మీకు వివరిస్తాను.

**ఉద్యోగ జీవితము:**

నేను మారు మనసు పొందిన దినములలో టౌన్ కౌన్సిల్ (పట్టణ పరిపాలనా విభాగము) లోని సివిల్ ఇంజనీర్స్ కార్యాలయంలో చదువుతూ ఉద్యోగం చేస్తూ ఉండేవాడిని. టౌన్ హాలులో పనిచేస్తున్నపుడు ఒకరోజు టౌన్ క్లర్క్ (గుమస్తా) యొక్క ప్లష్ కార్యాలయంలోకి పంపబడ్డాను. అక్కడ అందరికంటే పెద్ద అధికారి చేత తీవ్రముగా ఈలాగు హెచ్చరింపబడ్డాను. “నీ యొక్క ఆఫీసు పనులు కాని, ఇతర కార్యకలాపాల గురించి నేను విన్నాను” అతను తప్పకుండా మా యౌవ్వస్థుల యొక్క సువార్త కార్యక్రమాల గురించే ఆలాగున మాట్లాడినాడు. ప్రతి రాత్రి దుకాణములు (సత్రములు) మూసి వేయబడిన తరువాత, ఆ పట్టణములో ప్రజలు ఎక్కువగా కూడుకొనే స్థలము లలో మేము బహిరంగ సువార్త సభలు జరిగించేవారము. మా కార్యక్రమము ప్రారంభించటానికి, ఆ దారిని వెళ్ళువారు వాక్యం వినుటకు వెంటనే వచ్చే వారు కాదు గనుక మాట్లాడే వ్యక్తిని ఎవరైనా వెక్కిరించుటకు ఆగినపుడు మేము ఎంతో సంతోషించేవారము. ఆ వ్యక్తి, ప్రసంగమునకు విరోధముగా మాట్లాడుట చూసి మరికొందరు అతనితో కలుసుకొనేవారు. ఇంకొందరు సబ్బు పెట్టెమీద (On the Soap Box) నిలబడిన పేదవానిని (ఇది వారి సువార్త ప్రదర్శనలో ఒక భాగము) ఆదుకోవటానికి కూడుకొన్నారు. మేము బోధించటానికి చాలా మంది కూడుకొనుటకు ఎంతో ముందుగానే, కొన్ని సమయములలో ఒకరో ఇద్దరో రక్షకుని దగ్గరకు వచ్చేవారు. అటువంటి



మతోన్మాదము, టౌనుహాలు యొక్క గౌరవపాత్రమైన స్థితికి ఎంత మాత్రము ఉండకూడదని ఆ టౌన్ క్లర్క్ నన్ను హెచ్చరించెను. నేను ఆ పనులన్నియు ఆపివేయ వలసిందిగా కూడా ఆయన నన్ను గట్టిగా హెచ్చరించాడు. అయితే ఆ బహిరంగ కూటములు మాకు ఫలభరితముగా కనబడినందున మేమందరము వాటిని కొనసాగించుటకే నడిపించబడ్డాము.

ఆ తరువాత బైబిలు కాలేజీలో చేరిన పిదప మా కాలేజీ ప్రిన్సిపలు ఒకసారి ఆదివారపు ఆరాధనలో ఈలాగు చెప్పారు. "మీరు బహిరంగ సభలలో ప్రజలను ఆకర్షించలేకపోతే, ఒక చర్చిలో బంధింపబడిన ప్రేక్షకులకు విసుగు పుట్టించవద్దు”. నేను ఈ మాటలను విన్నపుడు యౌనస్థులమైన మేము మా బహిరంగ సువార్తలో పట్టుదలతో నిలబడినందుకు దేవుని స్తుతించాను.

నేను మారు మనసు పొందిన వెంటనే, క్రీస్తులో నా నూతన విశ్వాసమును గురించి నా వృత్తిలో సహోద్యోగులందరికీ నేను సాక్ష్యమిచ్చెను. అయితే నా ఆఫీస్‌లో ఒకరికి నేను సువార్తను చెప్పే అవకాశం రాలేదని గుర్తు తెచ్చుకొన్నాను. ఆమె ప్రతి రాత్రి మురికి గదులను శుభ్రపరిచే స్త్రీ ఒకరాత్రి నా స్నేహితులు వెళ్ళిపోయిన తర్వాత నేను, ఆమె తుడిచే ఆ పెద్ద బ్రష్‌ను బక్కెట్‌ను తీసుకొని, ఆ గదులన్నీ తుడిచివేసి ఆమె కొరకు ఎదురు చూస్తూ కూర్చున్నాను. ఆమె రాగానే 'నీ పని పూర్తయింది' అని సంతోషంతో చెప్పాను. కొంతసేపు విస్తుపోయిన తర్వాత ఆమె నాతో 'టీ' త్రాగుటకు కూర్చున్నది. మా సంభాషణలో నేను ఆమెకు ప్రభువు గురించి సాక్ష్యమిచ్చాను. మేము మాట్లాడుకొని ప్రార్థించిన ఆ సమయంలో ఆమె కన్నుల నుండి ధారలు ప్రవహించుచున్న కన్నీరును నేను ఎప్పుడు గుర్తుచేసుకుంటూ ఉంటాను.

**సాంఘిక జీవితము:**

నేను నా 21వ జన్మదినమును కూడ బాగా గుర్తుతెచ్చుకుంటాను. ఆ రోజులలో అది చాలా ప్రత్యేకమైన సందర్భముగా ఉండేది. అటువంటి సమయము ఎప్పుడూ పెద్ద విందుతో ఆ తర్వాత నాట్యమాడే కార్యక్రమముతో బాగా జరుపుకుంటారు. అయితే నాకు 21 సం॥లు వచ్చు సరికే, దేవుడు నా పాదముల నుండి నాట్యమును తీసివేసి దానిని నా హృదయంలో పెట్టారు.

ఆలాగున, ప్రేమతో నా తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన నా 21వ జన్మదిన విందును, మరొకసారి నా స్నేహితులను క్రీస్తు కొరకు గెలుచు అవకాశముగా నేను భావించితిని. ఆ విధంగా ఒక సువార్తకుని ఆ కార్యక్రమానికి నేను ఆహ్వానించాను. ఇంకను క్రీస్తు తట్టు తిరుగని నా వ్యాపార సహోదరులకు, నా మిత్రులకు పంపిన ఆహ్వానపత్రికలో, భోజనము తరువాత నా స్నేహితుడొకరు ప్రసంగించునని తెలియచేసితిని. ఆ ప్రతిక మీదున్న సున్నితమైన ఆహ్వానమేదనగా" మీ బహుమతులను కాక మీ రాకను అభ్యర్థిస్తున్నాను" ఆ రోజు రాత్రి అద్భుతకరమైన రీతిలో నా వ్యాపార స్నేహితుడొకరు మారు మనసు పొందారు.

తరువాత లండన్‌లోని ఒక బాప్టిస్ట్ చర్చిలో సహాయ పాదిరిగా నేను నియమించబడినపుడు, నా సంఘంలోని యౌవ్వనస్థుల యొక్క మారని స్నేహితులను ఆహ్వానించ కుండా, నది ప్రక్కకు గానీ, గ్రామసీమల లోని ఏ విహార యాత్రను గానీ, ఏ క్రీడా కార్యక్రమమును గాని, నిర్వహించలేదు. వారిని క్రీస్తు వైపు ఆకర్షించునంతగా ఆ కార్యక్రమము ముగింపులో, ఏ మాత్రం రాజీపడకుండా పరిష్టమైన సువార్తను వారికి అందించేవారము. అవును ఎందుకు ఆలాగు చేయకూడదు! అక్కడున్న యౌవ్వనస్థులు తమ యౌవ్వనస్థుల సహవాస సమాజములో చేరుటకు ఉన్న ముఖ్య ఉద్దేశ్యం తమ్మును తాను తీర్చిదిద్దుకొనుటకు, రెండవదిగా వారి స్నేహితులను క్రీస్తు యొద్దకు తెచ్చుటకేనని వారు బాగా గుర్తించారు. ఆ యౌవ్వనస్థుల సహవాస సమాజము, దేవుని ఆశీర్వాదము ద్వారా, ఆ కాలంలో బాగా వర్ధిల్లుట కొద్దిపాటి ఆశ్చర్యమే కదా!

**ఆత్మీయ జీవితము:**

నేను 19 సం॥ల వయస్సులో మారు మనసు పొందక ముందు, బైబిలు శ్రద్ధగా చదవాలను ఆసక్తి నాలో ఉండేది కాదు. తదనుగుణంగా ఆ వయస్సులో దేవుని వాక్యం గురించి నాకు చాలా కొద్దిగా మాత్రమే తెలుసు. అయితే క్రీస్తును నా ప్రభువుగాను, రక్షకునిగాను నేను అంగీకరించిన తరువాత ప్రతి సోమవారము రాత్రి, నూతనముగా రక్షింపబడిన మాలో కొందరము



కలిసి బైబిలును ధ్యానించుటకు, ఒక గృహములో కలుసుకొనెడివారము... అప్పుడు మా యొక్క ఔత్సాహిక స్ఫూర్తి ఏదనగా 'దేవుని వాక్యమును మా తల గుండా మా హృదయములోనికి సాధ్యమైనంత త్వరగా ఎక్కించుకొనుటయే'. ఆ ప్రారంభ దినాలలోనే, నేను ఈ పుస్తకములో మీకు ముందుగా సూచించిన ప్రకారము మా బైబిలు ద్యానములను మేము జరిగించుకొనే వారము. మేము దేవుని వాక్యమును ఒక మతపరమైన పాఠ్యపుస్తకముగా ఎన్నడూ చూడలేదు గానీ మా జీవితములను నడిపించు ఒక దిక్సూచి వలె ఆ వాక్యమును గౌరవించినాము.

అటువంటి సామాన్య బైబిలు ధ్యానముల యొక్క ప్రత్యక్ష ఫలితముగా మరికొందరు యౌవ్వనస్థులు మార్పు చెందిరి. ఆలాగు అందరము కలిసి సువార్త మరింత దూరమునకు తీసికొని వెళ్ళుటకు మార్గమును అన్వేషించితిమి. మాలో ఎవరికీ కారు లేనందున సైకిలుకు అమర్చబడిన ఒక చక్రాలబండిని తయారు చేయాలని ఆలోచించాము. యంత్రపరమైన పరిజ్ఞానమున్న ఒకరిద్దరు, శబ్దమును విస్తరింపచేసి దీని వినిపించే పరికరమును, గ్రామఫోనును తయారు చేసి పని పూర్తి చేసారు. కొన్ని వారాంతములలో మేము మా పెద్ద బండి ఎక్కి దానిని తోసుకుంటూ, దాని మీద ఆంప్లిఫైర్ (శబ్ద విస్తరణి) ఉంచి పొరుగు గ్రామాలకు వెళ్ళేవారము.

మెథడిస్ట్ చర్చి మూయబడి, తాళము వేయబడి ఉన్న ఒక ప్రత్యేక గ్రామమును నేను బాగా ఎరుగుదును. సువార్త వ్యాప్తి చేయాలనే ఉత్సాహములో మేము ఆ గుడి తాళాలు కనుగొని, గుడిని ఉపయోగించుకొనుటకు అనుమతి పొంది, బెంచీల మీదను, మోకరించు ఆసనముల మీదున్న దుమ్ము దులిపి, గ్రీన్ అనే ఆ గ్రామమునకు మా సువార్త పరికరములతో బయలు దేరితిమి.

ఆ గ్రామ సంత జరిగే స్థలము వెలుపల మేము వేదికను తయారుచేసి, అమెరికా గాయకుడైన బెవ్ షా (BevShea) పాడిన క్రొత్త పాటను పాడుతూ బహిరంగ సమావేశమును ప్రారంభించాము. బెవ్ షా అప్పుడే, బిల్లీ గ్రాహమ్ అనే యౌవ్వనస్థునితో ఇంగ్లాండ్ పర్యటించాడు. బిల్లీ గ్రాహమ్ ఆ గ్రామానికి

రావటం అదే ప్రథమం. సువార్త పాటల మధ్యలో, మేము ఒకరి తరువాత ఒకరము సోపు పెట్టె మీద నిలబడే ప్రదర్శనలిచ్చి, మన రక్షకుడు ప్రభువైన యేసు క్రీస్తునందలి విశ్వాసమును గూర్చిన మా వ్యక్తిగత సాక్ష్యములిచ్చాము. కొద్ది సమయం తరువాత, ఆ ఊరి మేళా (సంత) నుండి మా దగ్గరకు ఆతృతతో వచ్చిన ప్రజలకు మాలో కొందరు వాక్యం ప్రకటించుటకు ప్రయత్నించారు. ఆ గ్రామస్థులకు గొప్ప వింతగొలిపేటట్లు దేవుడు, ఆ వారాంతములో ఆ గుడి చక్కగా నిండేటట్లు చేసినాడు. భవిష్యత్తులో సండేస్కూలు టీచరుగా సేవ చేయబోవు ఒక ఆమె క్రీస్తును కనుగొన్నది. ఆ తరువాత ఆమె సహోదరి కూడ రక్షకుని వద్దకు వచ్చినది. వెంటనే చిన్న ఆదివారపు బడి, ఆదివారపు ఆరాధనలు ఆ చర్చిలో తిరిగి ప్రారంభమయ్యాయి. ఇంక ఆ గుడి తలుపులు ఎప్పుడూ తాళము వేయబడలేదు.

పౌలు తిమోతికి ఇలాగు ఆజ్ఞాపించాడు, *"వాక్యమును ప్రకటించుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము" (II తిమోతి 4:2).* పౌలు గనుక ఈ రోజుల్లో సువార్త సేవ జరిగిస్తుంటే బహుశా తిమోతీతో ఈలాగున మాట్లాడేవాడేమో: "దేవుని వాక్యము ప్రకటించు అవకాశము ఉన్నపుడు దానిని తీసికొనుము (ఉపయోగించుకొనుము). అలాంటి అవకాశము లేనపుడు దానిని కలిగించుము(పుట్టించుము). దేవుని వాక్యమును ప్రకటించుటకు అవకాశములేని సమయమే లేదు." అలవాటు ప్రకారము జరిగించబడుచున్న ఈ బైబిలు ధ్యానములకు పౌలు ఎంతో అసంతృప్తి చెందునని నేను నిశ్చయముగా చెప్పగలను. ఎందుకంటే వీటిలో విద్యార్థులు సంపాదించుకున్న జ్ఞానము, తరువాతి కాలంలో వారి గుడి ద్వారాములను ఎప్పటికీ మూతబడనీయని ప్రజలను ప్రేమ పూర్వకముగాను, ధైర్యముగాను, తయారు చేయుటకు ఉపయోగపడదు.

దేవుని వాక్యమును నీ తలలో నుండి నీ హృదయములోనికి తెచ్చుకొను రహస్యమును నీవు నేర్చుకొనునపుడు, ఆ దేవుని వాక్యమే, ప్రవక్తయైన యిర్మియా చెప్పినట్లు, నీ ఎముకలలోని అగ్నిగా మారుటకు ఎంతో కాలము, పట్టదని నీవు కనుగొనగలవు.



అయితే దుఃఖకరమైన సంగతేమంటే, బైబిలు కేవలము నీ శిరస్సులోనే నిలిచిపోతే, ఆత్మ కల్గిన ఒక విశ్వాసిగాకాక, విషాదకరముగా, కేవలం బైబిలును ఎరిగిన మనిషిగానే నీవు ఉండిపోయే అవకాశము ఉన్నది. అపుడు నీ ఎముకలలో ఏ అగ్ని ఉండదు. అయితే నీ సహవాస సమయములలో నీవు క్రమముగా అను నిత్యము దేవుని కొలుసుకొనుచున్నపుడు: నీవు వాక్యధ్యానపరుడవు కాకుండా ఆత్మధ్యానపరుడవగుట అసాధ్యమని మరింత ఎక్కువగా తెల్సికొనగలవు.

అవును, మనము ఆయన వాక్యమును చదువునపుడు దేవుడు మనతో మాట్లాడతారు. ఆయన మనకు ఏదైతే చెపుతారో దానిని మనము ఇతరులకు తెలియజేయవలెనని ఆయన ఆశిస్తారు. దేవుడు యెహెజ్కేలుతో ఇలా సెలవిచ్చాడు, *"... గనుక నీవు నా నోటిమాటను విని నాకు ప్రతిగా వారిని హెచ్చరిక చేయవలెను" (యెహె 33:7).* **కాబట్టి ముందుగా ఆయన నోటి మాటలను వినకుండా, ఆ మాటలకు వ్యక్తిగతముగా లోబడకుండా, ఇతరులతో మాట్లాడుట వలన ఏ ప్రయోజనము ఉండదు.**

క్రైస్తవ మతములో నేడు అనేక న్యాయవాదులు (సిద్ధాంత కర్తలు) ఉన్నారు, కానీ విచారకరమైన సంగతేమంటే· : జీవముగల దేవునితో తమ యొక్క వ్యక్తిగత సహవాసము గురించి నిష్కల్మషమైన సాక్ష్యము ఇవ్వగలిగే వారు బహుకొద్ది మందే ఉన్నారు.

తరువాత, అపోస్తలుడైన యోహాను తన స్వంత అనుభవములో నుండి, క్రీస్తుతో గల తన సజీవ సహవాసము యొుక్క నిజ స్థితిని గూర్చి మహిమానందముతో సాక్ష్యమివ్వ గలుగుచున్నాడు. అందుచేతనే, మనము ఆశించునట్లు, యోహాను ఇతరులను తన చనువైన సహవాసములో భాగ స్వాములు అగుటకు ఆహ్వానించుచున్నాడు. *"....మాతో కూడా మీకును సహవాసము కలుగునట్లును... మన సహవాసమైతే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది." (I యోహాను 1:3)*

Blank



## ఆత్మీయ పరిశీలన

1. నేను పనిచేసే ప్రాంతము, నివసించే ప్రాంతము, నా వ్యక్తిగతమైన సువార్త కేంద్రముగా నేను భావించుచున్నానా?
2. ప్రజలను నేను కేవలం మతమార్పిడి కొరకైన మనుష్యులుగా చూస్తున్నానా లేక వారు క్రీస్తులో నూతన జీవితము పొందుట కొరకు ప్రార్థనాపూర్వకంగా వారిని ప్రేమించ గోరుచున్నానా?
3. ఎవరైనా ఒకరికి ఆచరణాత్మక రీతిలో సహాయ పడుట ద్వారా, క్రీస్తు కొరకు సాక్ష్యమిచ్చు హక్కును చివరిసారిగా నేను ఎప్పుడు పొందాను?
4. నా పెదవులు యేసును గురించి ధైర్యంగా మాట్లాడకుండా ఎందుచేత మూయబడినవి?
   (a) నా జీవితంలో రాజీపడినందు వలనా?
   (b) నా వృత్తి క్రమము అపాయములో చిక్కు కొనునని భయపడుట వలనా?
   (c) తృణీకరించబడి నెట్టివేయబడిన యేసుతో ఏకీభవించుటకు నా గర్వము ఇష్టపడనందు వలననా?

## దివ్యమైన కాంతి

దివ్య కాంతీ! పరమ కాంతి!
నీ సూక్ష్మమైన దృష్టి క్రింద ఉంచబడినపుడు
నా మనస్సు ఎంత శుద్ధిగా ఉండును
అప్పుడు అది వడలి పోదు అయితే మౌన ఆనందముతో
సేద దీరుతూ నీ వైపే చూడగలదు!

నీ సింహాసనమును ఆవరించిన ఆత్మలు
ప్రజ్వలించు మహిమ ధన్యతను అందుకొనగలవు
అయితే ఆ స్థితి తప్పకుండా వారికి మాత్రమే
ఎందుకంటే వారు పడిపోయిన లోకమును
ఎన్నటెన్నటికీ ఎరుగ లేదు గనుక

నా నాజన్మ స్థలము చీకటి, నా మనస్సు
మసక యై ఉండగా నేనేలాగు
వసింపశక్యము కాని ఆయన ముందు నిలబడగలను?
నా దిగంబర ఆత్మ మీద
సృజింపబడని ఆ కాంతి పుంజము నేలాగు భరించగలను?

ఆ యొక్క ఉత్కృష్ట నివాస స్థలమునకు,
మనిషి తిరిగి లేచుటకు ఒక మార్గమున్నది
అదే! ఒక కానుక, ఒక బల్యర్పణ
దేవునితో వాదించు న్యాయవాది యైన
పరిశుద్ధాత్మ యొక్క సామర్థ్యము బట్టి

ఇవే ఇవే మనలను సిద్ధపర్చును
పైనున్న పరిశుద్ధతను దృష్టించుటకు
రాత్రి యొక్క అజ్ఞాన పుత్రులు
దివ్య కాంతిలో జీవించుదురు
పరమ ప్రేమ ద్వారా...!

ధామస్ బిన్ని **(1798-1874)**

# అధ్యాయము - 7

# ఫలము లేదా అగ్ని

స్వీడన్- అమెరికా జాతీయుడైన బెంగ్ట్ అనే నా స్నేహితుడు అమెరికాకు వలస వెళ్ళెను. అక్కడ ఆతడొక విజయవంతమైన క్రైస్తవ వ్యాపారస్థుడయ్యెను. ఆయన యొక్క అనేకమైన సువార్త పరిచర్యలలో, సౌవార్తిక విమానములను సువార్త కేంద్రములకు చేరవేయు పరిచర్యలో అతను ఎక్కువగా ఆనందించెడి వాడు. ఒక సంవత్సరం, అతను అతని స్నేహితుడు ఒక చిన్న విమానమును అలస్కాలోని వైమానిక సువార్త సహవాసము (M.A.F) నకు చేరవేయుచుండిరి. వారి ప్రయాణంలో మూడొంతులు పూర్తి చేసిన తరువాత, అతని స్నేహితుడు బెంగ్ట్‌ను ఫెయిర్ బాంక్స్ విమానాశ్రయంలో వదలగా, అక్కడి నుండి ప్రయాణం చివరి దశలో ఒంటరిగా విమాన ప్రయాణం చేయటానికి బెంగ్ట్ సిద్ధపడ్డాడు.

వెళ్ళిపోయే ముందు బెంగ్ట్ స్నేహితుడు, అతని విమానంలోకి ఒక అత్యవసర వస్తువులతో నిండిన మూటను విసిరేసాడు. అందులో ఒక పెద్ద చాక్లెట్ ముక్క, ఒక వెచ్చని రగ్గు ఉన్నవి. ఈ చివరి దశ ప్రయాణములో ఒక మంచు తుఫాను అనుకోకుండా వచ్చింది. అలస్కా పర్వతముల యొక్క భయంకరమైన గాలులు ఆ చిన్న విమానమును క్రిందికి లాగేసినవి. పైకి క్రిందకు పల్టీలు కొడుతూ ఒక కొండ శిఖరము అంచున ఆ విమానం ఒరిగి పోయింది. ఆ తరువాత మూడు రోజులు మంచు పడింది. అయితే దేవుని మంచితనమునుబట్టి, గాలి ఆ మంచును పోగొట్టి విమానం మంచులో మూయబడకుండా దాని తెల్లని అడుగు భాగం కనబడునట్లు చేసింది. అయితే బెంగ్ట్ విమానం మంచుతో కప్పబడటంతో అమెరికా తీర వైమానిక అన్వేషణ అధికారులకు ఆ చిన్న విమానం కనబడలేదు.

అయితే సైనిక సిబ్బంది వారి వైమానిక అన్వేషణను ఆపివేసిన తరువాత, బెంగ్ట్ కుమారుడు బ్రూస్ మరొక వైమానిక సువార్త సహవాసపు (M.A.F) అధికారితో కలిసి, తన తండ్రి దగ్గరకు నడిపించుమని ప్రభుని ప్రార్థించాడు. అయితే అక్కడ బెంగ్ట్ బాగా నీరసించిపోయి, తన దగ్గరున్న పరావర్తన కెమెరాతోను, పాలిపోయి, చిక్కిశల్యమైన నవ్వుమోముతో స్నేహితులకు వీడ్కోలు చెప్తునట్లు తన ఫోటోనే తీసుకొన్నాడు. కాని దేవుని ఆలోచనలు వేరుగా ఉన్నాయి. ఆ విమాన ప్రమాదం జరిగిన స్థలమునకు బ్రూస్ అతని స్నేహితుడు చేరుకోగానే సూర్యుని కాంతిపడి మెరుస్తున్న బెంగ్ట్ విమానం యొక్క తెల్లని అడుగు భాగం వారిని ఆకర్షించి, బెంగ్ట్ ఉన్న స్థలానికి నడిపించింది.

నేనెందుకు ఈ చరిత్రను జ్ఞాపకం చేస్తున్నాను? తాను ఆ పది రోజులు క్రీస్తు న్యాయపు సింహాసన అంచుల్లో జీవించానని ఆ తరువాత బెంగ్ట్ నాతో చెప్పాడు. ఆ తరువాత మరలా బెంగ్ట్‌ను కలిసినపుడు 'ఆ మంచు పర్వతపు అంచున తాను దేవునితో ఒంటరిగా నుండి దేవుని సన్నిధిలోనికి అనగా పరలోకపు పిలుపు కొరకు ఎదురుచూస్తున్న సమయంలో పరిశుద్ధత్మ తండ్రి, తన జీవితమును మరొకసారి పునఃపరిశీలించు కొనుటకు అనుమతి ఇచ్చారు' అని నాతో చెప్పాడు. సమయమునకు ముందుగానే విశ్వాసుల న్యాయపు తీర్పు, తన దగ్గరకు వచ్చేసినట్టుగా అతడు భావించాడు. ఆయన జీవితం ఆయన ముందు పరచబడినపుడు, బెంగ్ట్ అనేక సంవత్సరములుగా తాను చేసిన తన నమ్మకమైన క్రైస్తవ పరిచర్య గురించి తలపోయుచు, నిత్యత్వమునకు అందులో వాస్తవముగా ఎంత భాగము ఎన్నిక చేయబడుతుంది అని ఆలోచించసాగాడు.



అప్పుడు ఎంతో తీవ్రముగా అతడు చెప్పినదేమనగా తాను జరిగించిన సంఘ నిర్వాహకుల కూటములు మరియు సువార్తిక సభా సమావేశములు మరియు అనేక సంఘ కార్యక్రమాలు ఎంతో సంతోషంగా హృదయ పూర్వకంగా చేయబడిన వైనప్పటికినీ, వాటిని అతను నిజంగా తన శరీర శక్తితో, బలముతో; తన స్వంత తలంపులు, సామర్థ్యము వెల్లడి అగుటకు చేసాడు. అంతే కాని వాటిని పరిశుద్ధాత్మ యొక్క పరిపూర్ణ నింపుదల ఫలితముగా చేయలేదు.

అటువంటి ఉపయోగకర పనులన్నీ ఆ పది రోజులలో "కొయ్య, ఎండు గడ్డి, దుబ్బువలె ఉన్నట్లు గ్రహించ గలిగితినని బెంగ్ట్ చెప్పాడు ("బైబిలులో ఉన్న ఈ అలంకారములు అన్నియు ఆయన న్యాయ సింహాసనము దగ్గర కాలిపోయే మన పనులకు మరియు దినములకు సాదృశ్యముగా ఉన్నవి గనుక నిత్యత్వమునకు అవి లెక్కింపబడవు.)

అటువంటి భయానకమైన వాతావరణమే బెంగ్ట్ యొక్క జీవితంలో, ఒక నిజమైన ఉజ్జీవమునకు కారణమైనది. ఎంతోకాలంగా బెంగ్ట్‌ను ఎరిగి ప్రేమించి, ప్రభువు పనిలో ఆయన యొక్క అత్యాసక్తిని బట్టి ఆయన్ను మెచ్చుకొనిన మాకు, ఆ తరువాత తాను గడిపిన కొద్ది సం॥ల జీవితంలో ఎలాంటివాడుగా మారియున్నాడో చక్కగా తెలియచేసాడు. తన స్వంత సామర్థ్యము, బలమును బట్టి కాక, దేవుని శక్తి దీవెనల యొక్క ప్రవాహములు తన జీవితములో ఒక పెద్ద తరంగమువలె ప్రవహించుట ద్వారా అతను దేవునికి ఎల్లపుడు సాక్ష్యమిచ్చాడు.

విశ్వాసులందరికీ సిద్ధపర్చబడిన న్యాయ పీఠము యెదుట నిలువబడ వలెనని గుర్తుంచుకొనుట క్రైస్తవు లందరికీ చాలా హాయిని కలిగించే తలంపుగా ఉండును. ఈ న్యాయ పీఠముకును, అంత్యతీర్పుకు ఉన్న భేధమును ప్రస్ఫుటముగా గుర్తించవలెను. ఆ ధవళ సింహాసన (అంత్య) తీర్పు దగ్గర అవిశ్వాసులందరూ కూర్చబడి పడిపోయిన లోకమునకు పంపబడుదురు. అయితే విశ్వాసుల న్యాయ పీఠము దగ్గర, విశ్వాస మూలము కానిది ఏదో అది కాల్చివేయబడును. విశ్వాసమూలమైనది ఎదో అది దేవుని మహిమార్థమై నిత్యము నిలుచును. ఎందుకంటే ఆ విశ్వాస కార్యమును దేవుడు తానే స్వయముగా చేసారు. కాబట్టి... ఆ రోజున అనేక మంది క్రైస్తవులు, గుడిలో గొప్ప చురుకుతనంతో (తాము) చేసిన పనులు, తమ జీవిత కాలంలో వారిని ఎంతో సంతుష్టిపరచిన చర్చి సంబంధమైన వారి ఘనతా కీర్తులు – దేవుని దృష్టిలో ఎంత మాత్రము యదార్థమైన ఆత్మీయ సేవకు ఎన్నిక చేయబడలేదని ఎంతో విచారంగా తెలుసుకొంటారు.

## తెల్లని కాగితములు

రెండు తెల్లని కాగితములు నా ముందున్నవి. రెండూ ఖాళీగా ఉన్నవి. ఎవరు కూడా వాటి మీద ఏమి వ్రాయలేదు, గీయలేదు. నీవు వాటిని చూచినపుడు ఎవరి ఆలోచనలు గానీ ఏ అందమైన బొమ్మలుగానీ అందులో చిత్రించబడినట్లు నీకు కనబడవు. అదే సమయంలో ఇతరుల పొరపాట్లు కూడా నీవు అందులో చూడవు. ఆ కాగితముల మీద ఏ అందము లేనట్లు... ఏ మచ్చలు, కళంకములు లేవు. కేవలం తెల్లని పేజీలే అంత కంటే ఎక్కువ కాదు, తక్కువ కాదు.

నీ జీవితము, నా జీవితము కూడ అటువంటి తెల్లని పేజీలవలె ఎన్నో రోజులు ఉండి ఉండవచ్చును. పాపముచేత ఒకప్పుడు కళంక పడినా, దేవుని అత్యద్భుతమైన కృపను బట్టి యేసు యొక్క ప్రోక్షణ రక్తము ద్వారా విశ్వాసి జీవితములోని ప్రతి పేజీ కూడా శుద్ధి చేయబడినది. మంచు వంటి తెల్లనిది కాని మరేదీ దానిమీద నిలువ లేదు. (యెష 1:18). ఒక క్రైస్తవుడిగా నా జీవితంలోని కొన్ని పేజీలను వెనుతిరిగి చూచుకొనినపుడు; పూర్తిగా ఎరిగి ఉండి గాని ఎరిగి ఉండక కాని, ఇష్టపూర్వకంగా కానీ బలహీనతను బట్టి కానీ, నేను పాపం చేసి పరిశుద్ధాత్మను ఎంతగా దుఃఖపరిచానో గొప్ప విచారంతో జ్ఞాపకం చేసు కొంటాను. నా ప్రభువైన యేసు రక్తమే గాని లేకపోతే ఆ తెల్లని కాగితాలన్నీ అసత్యకరమైన పాపము యొక్క స్వార్థపరత్వపు మరకలతో ఎప్పటికీ డాగుపడే ఉండేవి.



ఒకప్పుడు పాపపు డాగుతో నిండిన నా జీవితములోని కాగితములను మంచువలె తెల్లనివిగా చేసిన దేవుడు ఎంత అత్యద్భుతమైన కృపను, కరుణను నాకు అనుగ్రహించారో కదా! కేవలం తెల్లని కాగితములే అందుకు దేవుని స్తుతించండి. ఎందుకంటే ఏ నల్లమచ్చలు ఏ కళంకములు అందులో లేవు.

అయితే పరిశుద్ధాత్ముడు నా ద్వారా ఏదైతే చేయలేకపోయారో అవి నిత్యత్వములో లెక్కకురావని గ్రహించుట కూడా నాకు ఎంతో బాధాకరమైన ఆలోచన. అపొస్తలుడైన పౌలు మాటలలో మన జీవితములలోని ఆ రోజులను ఈలాగున వర్ణించవచ్చును... *రక్షింపబడును గాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్లు రక్షింపబడును (I కొరింధి 3:15).* నా జీవితము నుండి పరిశుద్ధాత్మ పొంగి ప్రవహించనపుడు క్షమించే నా తండ్రి ద్వారా నా పాపములు తుడిచి వేయబడిననూ నిత్యత్వమునకు లెక్కించబడు ఏ పనీ కూడా నేను చేయనట్టే. కేవలం తెల్లని కాగితములే అయితే విచారకరంగా అంతకు మించి ఇంకేమీ లేదు.

మన జీవితంలోని కొన్ని పుటలు ఎప్పటికీ తెల్లగా నిలిచిపోయినప్పటికీ, కొన్ని పుటలు మాత్రము గాయపర్చబడిన ఆయన స్వంత హస్తముల (ప్రేమ) ద్వారా చిత్రించబడి, ఆయనను నిరంతరము మహిమ పర్చుచూ చూడచక్కనైన, రమణీయ అందాలతో కూడిన చిత్ర పటములను కలిగి ఉండును. అనంతుడైన దేవుడు, తన నిత్యమైన పనిని జరిగించుటకు మనము ఎప్పుడైతే సాధనములుగా వాడబడతామో ఆ దినములే ప్రతి విశ్వాసి జీవితములోను మహిమతో ప్రకాశించు పుటలై ఉంటాయి. అవును, దేవుని స్తుతించండి ఎందుకంటె అందులో తెల్లని కాగితాల కంటె ఉన్నతమైనవి ఇంకా ఎన్నో ఉన్నాయి.

# వ్యర్థమైన సంవత్సరములు

“వచ్చి భుజించుడి” అని ప్రతిరోజు దేవునిచేత ఆహ్వానింపబడినను, తమ రక్షకుడైన దేవునికి సంతోషము కలుగచేయుటకు, ఆయన లోతైన సహవాసను ఆనందము అనుభవించుటకు బదులుగా, తమ జీవిత సంవత్సరములను వ్యర్థము చేసికొనేవారి స్థితి ఎంత దారుణమో కదా!

జీవితము యొక్క క్షణికానందములతో అనేక సంవత్సరములను వ్యర్థపర్చుకొని, వదలివేసుకొన్న అవకాశాలను బట్టి గాయపర్చపడి, తన స్వంత రక్షణను కళంకపర్చుకొన్న ఒక పెద్దమనిషిని గుర్తు చేసుకొన్నపుడు నా హృదయము విచారకరమైన ఆవేదనతో ఉంటుంది. నేను మార్పు పొందిన వెంటనే, క్రీస్తును అప్పుడే అంగీకరించిన మరి కొందరు యౌవ్వనస్థులతో కలిసి పరిచర్య చేయుటకు నేనొక స్థానిక ఆసుపత్రికి వెళ్ళాను. ఆసుపత్రి వార్డులను విడిచిపెట్టుటకు ఏ నిరీక్షణాలేని కొంత మంది వృద్ధులను ప్రతి శనివారము రాత్రి మేము కలుసుకొని వాక్యమును వారితో పంచుకొని ప్రార్థించేవారము. ఒక ప్రత్యేక సాయంకాలమందు, మరలా మేము వచ్చే శనివారము రాత్రి వరకు జీవించి ఉండలేని ఒక వృద్ధుని మంచము యొద్దకు నేను వెళ్ళితిని.

మా యొక్క క్లుప్త బైబిలు వాక్యములను విని అతడెంతగానో కదిలింపబడి, కన్నీళ్ళు ధారలుగా కారుచుండగా, తడబడుచూ ఇలా అన్నాడు "నేను రక్షింపబడి, పరలోకం వెళ్తున్నాని నాకు తెలుసు". అది 'ఎంతో అద్భుతమని' నేను జవాబిచ్చాను. నేను ఇంకేమీ మాట్లడక ముందే అతను వెక్కివెక్కి ఏడవడం ఆరంభించాడు: అమితానందంతో కాదుగానీ, అంతరంగ గాయము యొక్క బాధను బట్టి అపుడు బలహీన స్వరంతో ఆయన ఇలా అన్నాడు "అవును, కానీ పరిపూర్ణంగా కాదు. ఎందుకంటే నాకు ఇప్పుడు 71 సంవత్సరములు. కానీ నా 70 సం॥ల జీవితము వ్యర్థపర్చబడినది.

ఒక యౌవ్వన విశ్వాసిగా నేనేమి జవాబు చెప్పగలను? ఆయన్ను ఓదార్చుటకు ఏలాగున ప్రయత్నించానో నాకు తెలియదు కానీ ఆ రాత్రే



ఇంటికి వెళ్ళి మోకరించి, నా ప్రభువుతో ఇలా మాట్లాడాను "ప్రభువా! ఏదో ఒక రోజున నేను సంతోషంతో తిరిగి చూచుకొనే నా భవిష్యత్ జీవితం కొరకు, ఈ రోజు వరకు ఎదురుచూస్తూ ఉన్నాను. నేను పరలోకం రావల్సిన సమయం ఆసన్నమైనపుడు కేవలం నా ఆత్మ రక్షింపబడి, నా జీవితం వ్యర్థ పర్చబడిన స్థితిలో అక్కడికి నేను రావాలని కోరుకొనుటలేదు. నీవు నిజంగా నా జీవితమును నిత్యత్వమునకు సరిపోవునటువంటిదిగా మార్చుదువని నిన్ను ప్రార్థించుచున్నాను".

మన శక్తిని ఎంతో విరివిగా వినియోగించినా చివరకు అది నిష్ప్రయోజనమై నదని విచారంతో కనుగొనే అవకాశం లేకపోలేదని పాత నిబంధన గ్రంథములో హెచ్చరించుచున్నాడు. తన కాలములోని ప్రజలకు 'నీటిమంతుడు' విశ్వాసమూలముగా జీవించును (హబ 2:4) అని బహక్కూకు తెలియ చేయుచూ; సంపూర్ణంగా దేవుని మీద ఆధారపడుట అనే విశ్వాస సూత్రమును, ఎవరైతే తమ జీవిత కార్యములకు అన్వయించుకొనరో వారు అగ్ని పాలగుటకే ప్రయాసపడుచున్నారు (హబ 2:13) అని కూడా హెచ్చరించుచున్నాడు. వారు తమ పట్టణమును దేవునితో సంబంధం లేకుండా కట్టుకొన్నారు కాబట్టి వారికి కేవలం బూడిద తప్ప మరేమీ మిగల లేదు. అలాగే ప్రభువైన యేసు క్రీస్తు మీద సంపూర్ణముగా ఆధారపడకుండా మనము చేయు ఏ పనైనా, ఏదో ఒక రోజుకు ప్రజ్వలించే ఆయన సన్నిధిలో నిరర్థకము చేయబడుతుంది.

ఆ ప్రకారమే క్రొత్త నిబంధనలో పౌలు ఇలా హెచ్చరించు చున్నాడు:

> "ఎవరైనను ఈ పునాది మీద బంగారము, వెండి, వెలగల రాళ్ళు, కర్ర, గడ్డి, కొయ్యకాలు మొదలైన వాటితో కట్టిన యెడల, వాని వాని పని కనబడును. ఆ దినము దానిని తేటపరచును. అది అగ్ని చేత బయలుపరచబడును. మరియు వాని వాని పని ఎట్టిదో దానిని అగ్నియే పరీక్షించును. పునాది మీద ఒకడు కట్టిన పని నిలిచిన యెడల వాడు జీతము పుచ్చుకొనును. ఒకని పని కాల్చివేయబడిన యెడల వానికి నష్టము కలుగును; అతడు తనమట్టుకు రక్షింపబడును గాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్లు రక్షింపబడును" (I కొరింథి 3:12-15).

ఆసుపత్రిలో ఉన్న ఆ 71 సం॥ల వృద్ధుడు, తాను రక్షించబడినానని సంతోషంగా ఉన్నప్పటికీ, తాను అగ్నిలో నుండి రక్షింపబడినట్లుగా రక్షణ అందుకొనినందుకు విచారంగా ఉన్నాడు. తన జీవితము లోని గడ్డిని, కర్రను కొయ్యకాలును కాల్చిన ఆ అగ్నియే పరిశుద్ధాత్మునికి స్వేచ్ఛగా లోబడు వారి ద్వారా దేవుని భవన స్తుసముదాయమును, నిర్మించుటకు కావలసిన ఆ బంగారము, వెండి మరియు వెలగల రాళ్ళను శుద్ధి చేయును.

## నిత్యమైన వెలుగు

దేవుని వాక్యమును తన జీవితమునకు అన్వయించుకొని, క్రీస్తులో నిలిచి ఉండి, విశ్వాసమును పోషించుకొను ప్రతి క్రైస్తువుని ద్వారా, నిత్య దేవుడు తన శాశ్వతమైన పని జరిగించుకొనును. అటువంటి విశ్వాసులు ప్రతి నూతన దినమును గొప్ప సంతోష నిరీక్షణలతో, ఎదుర్కొనుచు ఈలాగు సాక్ష్యమివ్వ గలరు *"అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది, దైవ కృప కలిగి ఉందము. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో, దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము" (హెబ్రీ 12:28-29).* క్రమమైన మరియు ఫలభరితమైన సహవాస సమయములు – మన శరీరబలముతో కాక, పరిశుద్ధాత్మ శక్తితో నడుచునట్లు మనలను ప్రోత్సాహపర్చును.

సమస్తమును పరిశోధించే దేవుని పరిశుద్ధ సన్నిధి కాంతిలో, సజీవుడైన దేవుని యొక్క పనిలో ఎవరైతే సార్ధకమైన సాధనములుగా వాడబడతారో వారు అత్యానందముతో హర్షించెదరు. అవును, దినదినము మనము ఆయన, విందు బల్లయొద్దకు ఆకర్షించబడినపుడు, ప్రేమ, వెలుగుగల కర్తయైన దేవుడు తన పారదర్శక (స్పష్టమైన) సహవాసములో ఆనందించుటకు మనలను ఆహ్వానించును. ఈ విధంగా, చీకటితో నిండిన ఈ స్వార్ధలోకమునకు, ఆయన ప్రేమ కాంతులు వెదజల్లే సాధనములుగా మనము ఉండ గలము.



### ఆత్మీయ పరిశీలన

1. నేను ఇప్పుడు జీవించుచున్నట్లుగా ఇకను అలాగే జీవిస్తే, నా జీవితము ద్వారా దేవుని న్యాయ పీఠము దగ్గర ఏదైనా ప్రతిఫలము నాకు దొరుకు తుందా?
2. నేను ప్రార్థన చేయునపుడు, దేవుని ఒక నిత్యమైన జ్యోతిగా భావించి సమీపిస్తానా లేక కేవలం పర లోకంలో ఉన్న నా వ్యక్తిగత ఉపకారిగా భావిస్తున్నానా?
3. దావీదు చేసిన ప్రార్థన ఇప్పుడు నేను చేసే అవసరమున్నదా? "నీ వాక్యము చేత నన్ను బ్రతికింపుము" కీర్తన 119:25.

ప్రియ ప్రభువా! నీవే స్వయముగా
నీ జీవాహారమును నాకు వడ్డించుము,
నీవు సముద్రపు దరిని
రొట్టెలను విరిచినట్లుగా :
ఆ పరిశుద్ధ లేఖనములను దాటి వెళ్ళి
ప్రభువా, నేను నిన్ను వెతుకుచున్నాను
ఓ జీవించే వాక్యమా! నా
ఆత్మ నీ కొరకు పరితపించుచున్నది

నీవే నాకు జీవాహారము
నా తండ్రి! నీవే
సత్యమైయున్న నీ పరిశుద్ధ వాక్యము
నన్ను రక్షించును
నీతో కలిసి పరలోకములో ఉండుటకు,
తినుటకు, జీవించుటకు నాకు అనుగ్రహించుము.
నీ సత్యమును ప్రేమించుట నాకు నేర్పుము
ఎందుకంటే నీవు ప్రేమవు గనుక.

ప్రభువా! ఇప్పుడు నీ ఆత్మను
నా మీదకు పంపుము
ఆయన నా కన్నులను ముట్టి, నేను చూచునట్లు చేయుటకు
దాగిన నీ సత్యమును, నీ వాక్యములో
నుండి నాకు చూపించుము
పుస్తకములో ప్రత్యక్ష పరచబడిన
ఆ ప్రభువును నేను ఎల్లకాలము చూచునట్లుగా

– మేరీ ఆన్ లాత్‌బరీ

## అధ్యాయము - 8

# వచ్చి భోజనము చేయుడి

గలిలయ సముద్రపు ఒడ్డున పునరుత్థానుడైన యేసు ప్రభువు ఒంటరిగా, ఎవరూ గుర్తించకుండా ఉన్నారు. బాగా అలసిన శిష్యుల కన్నులకు తెల్లవారి పొగమంచు ఆయనను కనబడకుండా చేసినదేమో.. కదా! సిలువ మీద ఆయన క్రూర మరణము తరువాత, వారి ఆత్మీయ నేత్రములు మందగించి ఉండవచ్చును.

తీరము దగ్గరే నిరాశలో ఉన్న శిష్యులు ఒకచిన్న చేపలు పట్టే పడవలో గందరగోళంతో ఇరుక్కొని కూర్చున్నారు. విసుగు పుట్టే విధంగా వారు రాత్రంతా సముద్రంలో చేపల వేటలో గడిపారు. అయినా పట్టుకో లేకపోయారు. వారికి పుండు మీద కారం జల్లినట్లు, ఎవరో ఒడ్డు నుండి "పిల్లలారా! మీ యొద్ద

భోజనమునకేమైనా ఉన్నదా? అని అడిగారు". దూరంగా తీరము దగ్గరనున్న ఆ వ్యక్తి నుండే, స్పష్టమైన మరియు అంతయు ఎరిగినట్లుండిన ఆజ్ఞ వచ్చినది. "దోనెకుడి ప్రక్కను వలవేయుడి, మీకు దొరుకును".

ఆ భయంకర రాత్రి యొక్క మత్తు నుండి మేల్కొనిన యోహాను, తనకు బాగా పరిచయమున్న ఆ స్వరమునకు సంతోషముతో ఆలాగు స్పందించాడు. ఆయన ప్రభువు సుమీ! నూతన పర్చబడిన నిరీక్షణతో శిష్యులు తమ ప్రభువు యొక్క ఆజ్ఞలకు విధేయులవ్వగా, వారి వల గొప్ప చేపలతో నిండినది. వెంటనే అమితోత్సాహముతో పేతురు నీళ్ళలోనికి దుమికి తమ యజమానుడైన క్రీస్తునొద్దకు ఈదుకొనివెళ్ళాడు. (యోహాను 21:11)

ఒడ్డు మీద మహిమా స్వరూపియైన క్రీస్తు ప్రభువే స్వయముగా పుల్లలు చేర్చి వాటిని వెలిగించారు. శిష్యులందరూ చేరుకున్నపుడు ఆయన చేపలను తెప్పించి వాటిని సిద్ధం చేసి, గొప్ప బలకరమైన వంటను తయారు చేసారు. ఆకలితో ఉన్నప్పటికీ ఆనందముగా ఉన్న వారికి 'వచ్చి భోజనము చేయుడని' (యోహా 21:12) ఆయన తన దయపూర్వక ఆహ్వానమును అందించారు.

ఈ దయాపూర్వక ఆహ్వానమే 2000 సంవత్సరముల పొడుగున వినిపించబడు చున్నది. ప్రతి ఉదయము పరలోకము యొక్క తీరము యొద్ద ప్రభువు నిలువబడి, తాను ఎంతో శ్రద్ధతో తయారు చేసిన పరలోకపు ఆహారములో పాలుపొందుటకు మనలను ఇంకను ఆహ్వానించుచున్నారు. అవును మన ప్రభువైన యేసు క్రీస్తు తానే స్వయముగా ఎంతో జాగ్రత్తతో మన కొరకు అనుదిన ఆహారము సిద్ధపర్చుచున్నారు. అదే మన **విశ్వాసము కొరకైన ఆహారము**. అదే దేవుని వాక్యము, అదే బైబిలు గ్రంథము.

నా సహవాస సమయములో నేను వాక్యమును ధ్యానించిన అంశములలోనికి ఇప్పుడు మిమ్ములను ఆహ్వానించుచున్నాను. 'వచ్చి భోజనము చేయుడి' అను ప్రభువు యొక్క కృపాభరిత ఆహ్వానమునకు నీవు నిరంతరము స్పందించు చున్నపుడు, నీకు అమూల్యమైన సహాయము నందించుటకు వాస్తవికమైన ప్రోత్సాహమును నీకు ఇచ్చుటకు, ఈ నా వ్యక్తిగత



ప్రార్థనా సమయములలోని విశేషములను మీ ముందుంచు చున్నాను. పూర్తిగా భిన్నమైన రెండు ఆధారముల నుండి, నా నిజ జీవిత సహవాస సమయమును మీతో పంచుకొను చున్నాను.

**మొదటిది:** ఇంతవరకు వ్రాయబడిన అధ్యాయముల ప్రతిని చదివిన నా స్నేహితుడు, ఈ పుస్తకమునకు సరిపోయిన ముగింపుగా, ఈ భాగమును కూడ వ్రాయుటకు నన్నెంతో ప్రేరేపించెను.

**రెండవది:** అనేక సంవత్సరములుగా, అనేక సమయములలో రకరకములైన సంఘములను, గ్రూపులను, సామూహిక సహవాస సమయములలో నడిపించుట ద్వారా దేవుడు వారిని ప్రత్యేక రీతిలో ఏలాగున ఆశీర్వదించారో మీకు సాక్ష్యమిచ్చుటకు గొప్ప ఆధిక్యతగా భావించుచున్నాను.

ఆ సందర్భములో సభకు హాజరైన ప్రతి వ్యక్తి అందులో పాల్గొనవచ్చు. పరిశుద్ధాత్మకు మౌనముగా ప్రార్థించుట మినహా ఏ ప్రశ్నలు ఎవరు అడగకూడదు. ఏ బోధలు చేయబడకూడదు. అందరము కలిసి పరిశుద్ధాత్మనే మా బోధకుడుగా ఉండుటకు ప్రార్థించి, మా ప్రతి సహవాస సమయమును ప్రారంభించితిమి. అప్పుడు ఏర్పాటు చేయబడిన వాక్య భాగమును ఏక కంఠముతో పెద్దగా చదువుదుము. తరువాత ఆ వాక్య భాగములోని మొదటి వచనమును అందరము కలిసి పెద్దగా చదువుతాము. ఆ తరువాతి వచనములోనికి వెళ్ళక ముందు 30 సెకండ్లు మౌనముగా ఉందుము. ఆ కనిపెట్టే సమయములో, ఈ అధ్యాయము వెనుక ఇవ్వబడిన ప్రశ్నలలో వేనికైనా, చదవబడిన ఆ వచనములో నుండి జవాబు దొరుకునేమో అని వచ్చిన ప్రతి వ్యక్తి కూడా ప్రార్థనా పూర్వకముగా ఆ వచనమును ధ్యానించుచుండును. ఆ మౌన ధ్యాన ప్రార్థనా సమయము తరువాత ప్రతి సోదరుడు, సోదరి కూడా పరిశుద్ధాత్ముడు ఆ వచనమును వారి వారి హృదయములకు ఎలాగు అన్వయించినారో, సంఘమునకు నిర్భయముగా తెలియజేయ వచ్చును. ఈలాగున తెలియచేసిన తరువాత, తన నడిపింపును పంచుకొన్న ఆ వ్యక్తిగాని

లేదా ఇతర విశ్వాసులు గానీ ఆ వివరమునకు అనుగుణముగా ప్రార్థన చేయుదురు.

**ఈలాగున సామూహిక సహవాస సమయమును జరిగించు ఈ పద్ధతి ఎంతో ప్రయోజనకరమైన మార్గమని నేను నమ్ముచున్నాను. ఈ సమయంలో ఎవరైతే ఈ పుస్తకమును వారి బైబిలు గ్రూపుల్లో ధ్యానించుటకు ఉపయోగించు కొనుచున్నారో వారు పై సూచనలను పాటించుటకు, అనేక సార్లు కూడుకొని మరిన్ని సహవాస సమయములను ప్రత్యేక పరుచుకొనుమని మనవి చేస్తున్నాను. (ఇంకా ఎక్కువ సహాయము కొరకు 151 పేజిలో కొన్ని ప్రశ్నలు ఇవ్వబడినవి.)**

నేను క్రైస్తవుడిగా మార్చబడిన "యౌవ్వనస్థుల సెలవుదిన సమావేశ కేంద్రము"లో బ్రిటిషు సువార్తికుడైన లేటు థామస్ బి. రీసు గారి ద్వారా ఈ సామూహిక "సహవాస సమయము" నాకు మొదటగా పరిచయము చేయ బడినది. "సహవాస సమయము" అను అధ్యాయములో సూచించబడిన ప్రశ్నలకు, థామస్‌గారు మమ్ములను అడిగిన ప్రశ్నలకు కొద్ది తేడానే ఉన్నది.

అప్పటి నుండి, అనేక సంవత్సరములుగా నేను ఈ ప్రకారముగా నిర్వహించుచున్న ఈ కూడికలు ఊహకందని దేవుని సన్నిధి, పరిశుద్ధాత్మలో హృదయములతోను మరియు జీవితములతోను మాట్లాడుట ద్వారా సాగిపోవు చున్నవి. కెనడాలోని విక్టోరియా పట్టణములో ఒక డౌన్‌టౌన్ బాప్టిస్ట్ సంఘములో నేను ఆ సహవాస సమయమును ముగించగానే ఆ సంఘ కాపరి "నా సేవ జీవితమంతటిలోనూ నేను గొప్పగా ఆశీర్వదింపబడిన అసాధారణ కూటము ఇదేనని" సాక్ష్యమిచ్చారు.

ఆ విధముగానే యెరుషలేము పట్టణములోని పాతనగరములో అరబ్బుల కొరకు ఏర్పాటు చేయబడిన క్రైస్తవ మరియు సువార్తికుల సహవాస సంఘములో, నేను కొన్ని దినములు ఈ ప్రత్యేక బోధలను ఉపదేశించుట లోను, మరికొన్ని దినములు సామూహిక 'సహవాస సమయములను' నిర్వహించుటలోను గడపగా, ఆ పాత నగరంలో ఉన్న కెనడా బైబిలు కళాశాల



ప్రిన్సిపాలు "ఈ యెరుషలేము పట్టణములో ఇటువంటి నిజమైన ఆత్మీయ వెలిగింపుకు ఎప్పుడూ ఇంత దగ్గర కాలేదు." అని వ్యాఖ్యానించాడు.

సంఘ కూటములలోను, గృహ కూడికలలోను, బైబిలు సమావేశముల లోను, యవ్వన సమాజములలోను హాజరగుచున్న వారికి ఆయన తన వాక్యమును ఒక వ్యక్తిగతమైన విధానములో తెలియ చేయుట ద్వారా ఎంతో ఆశీర్వదించినారు.

అయితే నా వ్యక్తిగత 'సహవాస సమయము'ను గూర్చి వ్రాయ ప్రయత్నిం చినపుడు "ఒక బహిరంగ సభలోని అనుభవమును లేదా ప్రత్యేకముగా పొందిన సహవాస ఆనందము కంటే నా ప్రభువుతో నేను అనుభవించిన సన్నిహిత సహవాసము యొక్క వాస్తవికతను, ప్రభావమును, ప్రేరేపణను వ్రాతలో తెలియజేయుట ఎంతో కష్టమైన పని అని నేను కనుగొన్నాను".

ఈ రోజు నా సహవాస సమయము యొక్క విశేషాంశములు మీకు ఉపయోగపడుటకు, కొన్ని నియమములను నాకు నేను ఏర్పర్చుకొన్నాను.

**మొదటిగా:** బైబిలులో నాకు బాగా ఇష్టమైన లేదా నేను పూర్తిగా ఎరిగిన వాక్యమును ధ్యానాంశముగా నేను ఎన్నుకొనలేదు. గనుక నా సహవాస సమయ క్రమములో నేను, పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రికను ధ్యానించుచున్నాను.

**రెండవది:** ఈ రోజు వాక్య భాగమును ఒక వచనము తరువాత మరొక వచనముగా ధ్యానించుటకు నేను ఉద్దేశించలేదు.

**మూడవదిగా:** ఈ సహవాస సమయ వివరణ మీకు ఎంత సహజముగా (దైవికముగా) ఉండవలెనో అంత సహజముగా ఉండుటకు, పరిశుద్ధాత్ముడు నా హృదయములో పుట్టించిన వచనములను మీతో పంచుకొంటాను.

**నాల్గవదిగా:** మీకు ఇంతకు మునుపు తెలియ చేసిన ప్రశ్నలను ఉపయోగించుట ద్వారా నేను ప్రార్థనాపూర్వకముగా దేవుని వాక్యమును ధ్యానించినపుడు, దేవుని స్వరము ఏలాగున నాకు వ్యక్తిగతమైన వెలిగింపును కలిగించినదో, మీతో ఇప్పుడు పంచుకొంటాను.

నేను నా ధ్యానములను ఇప్పుడు మీతో పంచుకొనుచుండగా ఏ 'సహవాస సమయమైనా' ఒక గొప్ప స్వీయానుభవమని మీరు గ్రహించ గలరు. ఈ రోజున మీరున్న పరిస్థితులు నేను ఉన్న పరిస్థితుల వంటివి కావని నాకు తెలుసు. ఇపుడు నేనున్న పరిస్థితులు రాబోయే ఆరు నెలల్లో అలాగే ఉండవని కూడా నాకు తెలుసును. తన గొప్ప ప్రేమలో దేవుడు, మనలను కలుసుకొని మనమెక్కడ ఉంటే అక్కడే మనతో మాట్లాడతారు. అయితే ఏ స్థలములో ఉన్నామో అందును బట్టిగానీ, మనము ఎక్కడ ఉండబోతామో అక్కడగాని, వేరొకరు ఎక్కడున్నారో అక్కడగానీ, ఆయన మాట్లాడరు. అయితే మనమెక్కడ ఉన్నామో అక్కడే ఆయన మాట్లాడతారు. ఈ క్రింది సంగతిని నీవు చదివినపుడు, నా కంటే పూర్తిగా భిన్నమైన పరిస్థితులను నీవు ఎదుర్కొంటావు. ఎందుకంటే నీ పరిస్థితులకు అవసరములకు అనుగుణంగా దేవుడు నీతో మాట్లాడతారు. ఆలాగున నీవు ఆయనతో కలసి భుజించుటకు, నీకే పరిమితమైన ఆహ్వానము ఆయన ప్రతిరోజు నీకు అందిస్తారు.

నిశ్చయముగా బైబిలు గ్రంథము మన హృదయములకు, దేవుని యొక్క సజీవమైన, శక్తి గల్గిన వాక్కు మాత్రమే కాదు కానీ, మనలో ప్రతి ఒక్కరికీ ఆయన యొక్క వ్యక్తిగతమైన మాటయై ఉన్నది. ఎందుకనగా దేవుని వాక్యము *సజీవమై బలముగలదై..... హృదయము యొక్క తలంపులను, ఆలోచనలను శోధించుచున్నది" హెబ్రీ 4:12.* అంటువంటి వాక్యముకంటె ఆంతరంగికమైనది మరేదైనా మనకున్నదా?

ఈ రోజున నా బైబిలు ధ్యానములో నేను NKJV ఆంగ్ల అనువాద మును చదువుచున్నాను. నేను II కొరింధి పత్రిక మొదటి అధ్యాయము చదువుచుండగా వినుటకు మిమ్ములను ఆహ్వానించుచున్నాను. మీ స్వంత బైబిలును దయచేసి నాతో ఇప్పుడు తెరవండి.

**ఇప్పుడు సమయం ఉదయం 5 గం॥లు. నేను నా తలుపు మూసి, నా దేవునితో ఒంటరిగా ఉండుటకు బైబిలును తెరిచాను.**

ఈరోజున దేవుని సన్నిధిలోనికి తెరువబడిన హృదయంతో, సంగ్రహ బైబిలుతో వచ్చునప్పటికి నా జీవితమును ఆవరించిన కొన్ని పరిస్థితులేమనగా:



- డోరతి సహించుచున్న ఆ గొప్ప బాధ గురించి ప్రత్యేకమైన బాధ్యతను కల్గి ఉన్నాను. గత కొన్ని వారములలో ఆ బాధ మిక్కిలి హెచ్చురీతిగా ఉన్నది.
- ఈ వసంత కాలములో, సేవార్థమైన మా ప్రయాణములను నిర్ధారించు టకును ఆమె ఆరోగ్య పరిస్థితి నిర్ణయకారకమవుతుందా లేదా అని కూడా నేను ఆలోచిస్తున్నాను. గతంలో అనేక మార్లు, మాయొక్క దీర్ఘమైన మరియు అత్యవసరమైన సువార్త ప్రమాణములలో ఆమె అసాధారణ రీతులలో బాధపడుట నేను చూచి ఆమెతో "డోరతి, ఇంకెప్పుడు ఈ పరిస్థితులను నీకు ఎదురు కానీయను" అని చెప్పాను. అయినప్పటికీ ఏదో ఒకరీతిలో దేవుడు మా ఇద్దరి పరిచర్యను సమృద్ధిగా దీవించినందున, మేము ఏకకంఠంతో "ఈ పరిచర్యను ఎంతో మహిమాన్వితముగా జరిగించారు. ఈ సారి ఏమి జరిగించనై యున్నారు ప్రభువా?' అని ఆయన్ను అడిగాము.
- కెన్యాలో ఉన్న పరిస్థితి గురించి నా హృదయంలో ఇప్పుడు ఎంతో వేదన ఉన్నది. ఎందుకంటే గతంలో కెన్యాలో జరిగిన మా పరిచర్యను దేవుడెంతో ప్రీతి పాత్రముగా ఎంచి దీవించినారు. ద్రవ్యోల్బణము అతి తీవ్రముగా ఉన్నందున ఆ దేశంలో ఉన్న పరిస్థితి ఎంతో అనిశ్చయంగా ఉన్నది. అక్కడ క్రీస్తు కొరకు నమ్మకముగా పని చేయుచున్న అనేక జాతుల వారికి ఇంకా ఎంతో చేయాలని ఆశించినాము.
- డోరతి తరుపు, నా తరుపున ఉన్న బంధువులు మిక్కుటమైన వేదనలోనో, మరణకరమైన వ్యాధి స్థితులలోనో ఉన్నారు. మా యొక్క అనుకొనని కష్టమైన ప్రయాణములను బట్టి, డోరతి యొక్క తీవ్రమైన శారీరక బలహీనతలను బట్టి, వారిని మేము ఎంతగా ప్రేమిస్తున్నామో వారికి క్రియలలో తెలియ చేయలేక పోతున్నాము.

## ప్రార్థన

తండ్రీ! ఈ రోజున చాలా ముందుగానే నన్ను లేపినందుకు నీకు వందనములు. ఒక ప్రత్యేకమైన రీతిలో నీవు నా హృదయంతో మాట్లాడుటకు మాత్రమే గాక ఈ రోజున మా సహవాస సమయంలో నీ వాక్యంలో నుండి నీవు నా ద్వారా పలికించవలసిన నీ మాటలను విను ప్రతి వ్యక్తిని దీవించుట కూడ నీ కోరిక, ఉద్దేశమై ఉన్నదని నేను నమ్ముచున్నాను.

ప్రియ ప్రభువా! నేను ఇప్పుడు కేవలం నిన్నే నా మనస్సులో కల్గి ఉండుటకు, ఈ ధ్యానము చదువుకొనే వారి తలంపును, నా మనస్సులో నుండి బయట పెట్టుట ఎంత కష్టమో నీకు తెలుసును. కాబట్టి ఒక ప్రత్యేకమైన రీతిలో నీవు నా హృదయమును, నా మనస్సును, నా పెన్సిలును వాస్తవికతతోను పారదర్శకతతోను మరియు నీతో, ఒక యథార్థమైన వ్యక్తిగత చనువుతోను అభిషేకించుమని ప్రార్థించుచున్నాను.

నా జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడియున్నదని మరొకసారి నిర్ధారించుకొనుచున్నాను. అటువంటి అద్భుతకరమైన వాగ్దానమునకు వందనములు. ఈ లోకంలో నా స్వంత చేతులతో, నేను వ్రాస్తున్న ఈ విషయములు నా వ్యక్తిగత పరిజ్ఞానము మీద ఆధారపడినవైనప్పటికీ, పరలోకంలో మీరు నా గొప్ప ప్రధాన యాజకుడుగా ఉండి, మీ పరిపూర్ణ జ్ఞానానుసారముగా మీ చిత్తమును బట్టి, ఈ నా ప్రార్థనా స్తుతులను తండ్రి సింహాసనము యెదుట సమర్పించెదరు గనుక మీకు నా హృదయ సంస్తుతి చెల్లించు చున్నాను. అందును బట్టి గొప్ప సంతోష నిరీక్షణతో ఈ ఉదయమున నేను నీ వాక్యము తట్టు చూచుచున్నాను. గనుక నీ వాక్యములో నుండి ఆశ్చర్యకరమైన సంగతులను నేను చూచునట్లు నా కన్నులను తెరువుము. ఆమెన్..



ప్రియ చదువరీ! ఈ రోజున నేను కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక మొదటి అధ్యాయమును తీసి పెద్దగా ఆ అధ్యాయమంతయు చదివితిని. స్పష్టమైన స్వరముతో ఎటువంటి దీర్ఘ విరామములు ఇవ్వకుండా నేను బైబిలు చదువుతాను గనుక మీరునూ అలాగే చదువుటకు ఇపుడు నేను మిమ్ములను ఆహ్వానించు చున్నాను.

ఆ అధ్యాయమును ఈ ప్రకారముగా చదివిన కొన్ని క్షణములు తరువాత, క్రీస్తు దాసుడుగా పౌలు యొక్క మాదిరి జీవితమునకు నెనెంతో ఆకర్షించ బడ్డాను. ఈ రోజున నా ప్రభువుతో నేను గడిపే ఎక్కువ సమయంలో ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుందని నాకు స్పష్టమైనది.

### ఈ వచనంలో నేను అనుసరించుటకు ఏదైనా మాదిరి ఉన్నదా?

ఈ అధ్యాయం పూర్తిగా చదివినప్పటి నుండీ పౌలు యొక్క ఉన్నతమైన మాదిరిని (పద్ధతులను) అనుసరించుటను నా హృదయము పరిశుద్ధత్మచేత ప్రేరేపించబడుచున్నది. నా ప్రభువు యొక్క శ్రేష్టమైన సేవకుడిగా నుండుటకు నేను కోరుకొను చున్నాను. నేను ఈ అధ్యాయంలోని ప్రతి వచనము ధ్యానించుటకు పూర్వము ఆయనతో ఈ మాటలే చెప్పుకొందును.

## ప్రార్థన

ప్రభువైన యేసూ, నేనిప్పుడే చదివిన పౌలు సాక్ష్యములోని సంతృప్తిని, నేను గ్రహించిన ప్రకారముగా నా సేవా జీవితములో కూడా శ్రద్ధతో చూపించు శక్తిని దయచేయుము. నా జీవితములో వెయ్యి రకములుగా నీ దీవెనలను నీవు కుమ్మరించితివి. అయితే, ఒకవైపు మాత్రమే ప్రవేశమున్న వీధివలె అవి ఉన్నవని నేను ఎంతో విచారంతో ఒప్పుకొనుచున్నాను. నీతో సహవాసము చేయు కోరికను శ్రద్ధగా తెలియ చేయుటలో నా హృదయము అలసిపోవు చున్నప్పటికీ, నీ శ్రమలలో పాలు పొందుటకు నీవు అవకాశమిచ్చినప్పుడు ఒక పిరికివానివలె జంకి పారిపోవుచున్నాను. నేను మరలా ఈ

వచనములను ధ్యానించుచుండగా, జీవితమును రూపాంతర పర్చు ఒక నూతనమైన మార్గములో నన్ను ముట్టి, నీ శక్తితోను, నీ సన్నిధితోను నన్ను కప్పివేయుము. తద్వారా నా స్వార్థపూరిత అలవాటులు శాశ్వతముగాను, విప్లవాత్మకముగాను నీ వంటివిగా మారునట్లు, నీ ప్రియ నామమును బట్టి అనుగ్రహించుము.

ఇప్పుడు మరల అదే అధ్యాయమును వచనము వెంబడి వచనమును, భావము వెంబడి భావము ప్రకారముగాను చదువుదును. నేను అలాగు చేయునపుడు, నా ప్రార్థనకు జవాబుగా దేవుడు నా హృదయమునకు అందించే వర్తమానమును నేను పోగొట్టుకొనకుండా చేయుమని పరిశుద్ధాత్ముని నిత్యమూ ప్రార్థించుదును. ఈ విధంగా దేవునితో నా ద్వైపాక్షిక సంభాషణ ప్రారంభమవుతుంది. అలాగు ప్రతి వచనమును ధ్యానించు చున్నపుడు, నాకు ముందుగానే తెలిసిన వచనమును త్వరత్వరగా ధ్యానించుటకు తొందర పడకుండా జాగ్రత్త పడవలెనని నన్ను నేను హెచ్చరించుకొంటాను. ఎందుకంటే ఆ వచనమునే ఈ రోజు నా హృదయమునకు ఒక ప్రత్యేక రీతిలో ఆయన బయలుపరచ వచ్చును.

**ఈ వాక్యభాగములో తండ్రియైన దేవుని గూర్చిన నూతన తలంపు ఏదైనా ఉన్నదా?**

## వాక్యపఠన

**3వ వచనము:** *కనికరము చూపుతండ్రి, సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడు.*

ఈ రోజున దేవుని యొక్క 'తండ్రి స్థితిని' గూర్చిన ఈ వచనము, దేవుని యొక్క తండ్రి తత్వమును గూర్చిన మరొక వచనము అనగా '2వ' వచనము తర్వాత వచ్చినదని నేను ప్రత్యేకముగా గమనించితిని. నేను, నా బైబిలు పేజీలో ప్రక్కనే ఉండే రిఫరెన్స్‌లో చూచినప్పుడు '2వ' వచనమును ఈలాగున కూడ అనువదించ వచ్చును అని ఉన్నది "దేవుడును మన ప్రభువునైన యేసు క్రీస్తు యొక్క తండ్రియునైన" దేవుడును కనికరమును, ఆదరణను చూపు నా తండ్రియై ఉన్నాడు. పరలోకములో ఉన్న నా తండ్రి తన కృపను మరియు సమాధానమును, నా ఆదరణ కొరకు పొడిగించాడు.



## ప్రార్థన

తండ్రీ! స్తుతితోను, కృతజ్ఞతతోను నేను నీ ముందు ప్రణమిల్లు చున్నాను. నీ కృప కొరకు నీకు వందనములు చెల్లించుచున్నాను. నిత్యము నీదైన నీ సమాధానమును నీవు నా హృదయమునకు విస్తరింప చేసావు. నీలో అనంత కాలము నివసించు, సమాధానము నెమ్మది, ఐక్యతలు ఈ రోజున నీ కృప ద్వారా నావియై ఉన్నవి. హల్లెలూయ. కలత చెందిన నా హృదయమును నీ పరిశుద్ధాత్మ ద్వారా నిమ్మళ పరచుమని ప్రార్థించున్నాను. నీవే స్వయముగా నివసించు నీ సమాధానముతోను, ప్రశాంతతతోను నా జీవితమును నింపుమని ప్రార్థించుచూ నీ పరిశుద్ధ సన్నిధిలో సాష్టాంగ పడుచున్నాను.

## వాక్యపఠన

***4వ వచనము:*** *"దేవుడు మమ్మును ఏ ఆదరణతో ఆదరించుచున్నాడో, ఆ ఆదరణతో ఎట్టి శ్రమలలో ఉన్న వారినైనను ఆదరించుటకు శక్తిగల వారమగునట్లు ఆయన మా శ్రమ అంతటిలో మమ్మును ఆదరించు చున్నాడు".*

పౌలు యొక్క ఈ సాక్ష్యమును నేను ధ్యానించినపుడు, అతడు తన పరలోకపు తండ్రి యొద్ద నుండి అందుకొనిన 'ఆదరణ'ను గురించి ఉపయోగించిన మరికొన్ని పదములను నేను ఇక్కడ గమనించాను. అవేమనగా గొప్ప విపత్తు, బాధ, ఇబ్బంది, శ్రమలు మరియు మరణశిక్ష అనునవి. 'ఆదరణ' అను మాటకు పూర్తిగా దూరపర్చ బడిన అనుభవములు అను సత్యమునకు పరిశుద్ధాత్ముడు నా మనస్సును నడిపించినాడు.

నేను ఇంకా చదివినపుడు ఈ జీవితములోని కష్టములన్నీ కూడా దేవుని చేత ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యము కొరకు అనుమతించబడినవే అని పౌలు సాక్ష్యమిచ్చుట గమనించితిని. *"మనలను మనము నమ్ముకొనక కూడదు కానీ మరణించిన వారిని సజీవులనుగా చేయు దేవుని యందే నమ్మిక యుంచ వలెను".* ఈ 4వ వచనము నుండి నేను గ్రహించినదేమనగా దేవుడు తన ఆదరణను పౌలుకు అనుగ్రహించుటకు కారణము పౌలు సుఖముగా ఉండుటకు కాదుగానీ ఇతరులను ఆదరించువాడుగా ఉండుటకు మాత్రమే. నేను ఈ అంశమును గూర్చి ప్రార్థించాలి.

## ప్రార్థన

అవును తండ్రీ! బాధలో ఉన్న ప్రజలకు ఆదరణను, ఓదార్పును కలిగించుటకు, నా జీవితంలో నేను నమ్మకముగా కోరుకొన్న సమయాలు నీకు తెలుసును. తన శరీరంలో ఎప్పుడూ తీవ్రముగా బాధపడే డోరతికి నీ ఆదరణను ఇవ్వాలని నేనిలాగున కోరుకొన్నాను.

నేనెప్పుడూ కూడ ఆమె నుండి ఎంతో సహాయం పొందుచు ఉన్నాను. అయితే ఆమె ఆదరణ, ఓదార్పు కొరకు నీ కృపా సమాధానములను అరుదుగా ఆమెకు అందిస్తాను. నా స్వార్థ మార్గములను దయతో క్షమించి, ప్రేమింపబడుటకు కాక సేవ చేయుట కొరకైన నూతన తలంపుతో నన్ను నింపుము.

ఆకలి, వ్యాధి, మరణము ప్రబలి ఉన్న ప్రాంతాలలో లక్షల కొలది బాధపడుతున్న ప్రజలను, ఏ ఆధారము లేక దిక్కుతోచకుండా ఉన్న వారిని తలంచుకొని, ఆ భయంకర పరిస్థితుల్లో నివసిస్తున్న వారి భారమును తొలగించి, వారి ఆదరణ కొరకు నేను వాడబడు టకు, నీ కృపా సమాధానములు నా హృదయములో విశాలముగా వ్యాపించునట్లుగా చేసి, నీ సన్నిధి నా జీవితంలో ప్రస్ఫుటముగా కనబడునట్లు చేయుమని ప్రార్థించుచున్నాను.



ప్రభువైన యేసూ! నేను నా యందు నమ్మిక కల్గి ఉండుటయేకాక నీ మీదను విశ్వాసముంచుటకే నీ ప్రేమ హృదయము ప్రతి కష్టమును అనుమతించినదని గ్రహించుచున్నాను. ఈలాగున నా ప్రతి కష్టమును నీ ఆదరణ ఏలాగున తీర్చుచున్నదో గ్రహించుకొను చున్నాను.

అవును, ఈ అంశము దగ్గరే దేవుని వాక్యము నాలోనికి చొచ్చుకొని పోవునంత శక్తిగలదిగా మారుచున్నది. తన స్వంత ఆత్మవిశ్వాసము నుండి తొలగింప బడుటకు పౌలు కూడా వ్యసనపరచే అనేక కష్టముల చేత కొట్టబడి ఆదరించబడినాడని నేను గ్రహించాను. గనుక నా గర్వమును పరిహరించుటకు, నా ప్రార్థనకు జవాబుగా గందరగోళమును, పరాభవమును దేవుడు తన ప్రేమతో పంపించునపుడు నేనెందుకు ఫిర్యాదు చేయవలెను? ఎందుకు బాధపడవలెను?

## ప్రార్థన

అవును ప్రభువా! నా జీవితంలో నీ ప్రేమ పరిచర్యకు నేను వందనములు చెల్లించుచున్నాను. ఇతరులు ఈ ప్రార్థన చదువుటకు దీనిని వ్రాయుట కష్టమైనప్పటికీ, తాను ప్రేమించిన వారి యెదుట తన భయంకరమైన శ్రమల విషయంలో, పౌలు పారదర్శకముగా ఉండుటను చూచి, నేను ప్రోత్సహించ బడుచున్నాను. తన జీవితంలోని మంచి సంగతులకే పౌలు తన సాక్ష్యమును పరిమితము చేయలేదు. కాబట్టి ఈ రోజున నేను నీకు చేయు నీ సేవలో ప్రతి ఏకాంత క్షణము కొరకును, నా మార్గములో నీవు రప్పించిన ప్రతి హృదయావేదన కొరకును, నేను అపార్థము చేసుకొనబడిన ప్రతి సమయము కొరకును, నా జీవితంలో పాపము మరియు అజ్ఞానముతో కూడిన ప్రతి తప్పు కొరకును, నీ మీద ఆనుకొనక నా స్వంత సామర్థ్యము మీదనే ఆనుకొనుట వలన, నేను విఫలమై

నలగగొట్టబడిన ప్రతి సందర్భము కొరకును, నా హృదయాంత రంగములో నుండి నేను నిన్ను కీర్తించెదను. ప్రభువైన యేసూ, నేను నా మీద నమ్మిక ముంచక నీ మీదే విశ్వాసముంచుదునని ఇప్పుడే నీ సన్నిధిలో పౌలుతో కలిసి నిర్ధారించు కొనుచున్నాను.

ప్రభువా, మొన్ననే "మా సామర్థ్యము దేవుని వలన కల్గినదని" చెప్పిన పౌలు మాటలు చదివితిని. ఈరోజున విశ్వాసముతో నీవే, నీవు మాత్రమే నా పరిపూర్ణతకు ఆధారమని నేను రూఢిగా చెప్పుచున్నాను. ప్రియ ప్రభువా! నా ముందు తెరవబడిన నీ వాక్యములోని ఈ మాటలను బట్టి "నా నుండి నీవు నన్ను విమోచించితివని, విడిపించుదువని, ఇంకను నన్ను విడిపించుచుందువని నిన్ను స్తుతించు చున్నాను. ప్రభువైన యేసు అంత గొప్ప రక్షణకుకై నీకు ఎన్నో వందనములు".

గనుక ప్రభువా! ఇప్పుడు, నన్ను పరిశుద్ధాత్ముడు నీ ఆదరణతో బలపరచినందున, ఈ రోజున నీ ప్రేమ యొక్క అవసరతలో ఉన్న ప్రజలకు నీ ఆదరణను మరియు సహాయమును అందించుటకు, క్రియపూర్వకమైన ప్రేమ మార్గములలో నన్ను వాడుకొందువని నిరీక్షించుచూ నిన్ను వేడుకొనుచున్నాను.

## వాక్యపఠన

***11వ వచనము:*** *అందువలన అనేకుల ప్రార్థన ద్వారా, మాకు కల్గిన కృపావరము కొరకు అనేకులచేత మా విషయమై కృతజ్ఞతాస్తుతులు చెల్లింపబడును.*

పౌలు పక్షముగా అనేకుల శిరస్సులు దేవుని తట్టు ఎత్తబడనిచో పౌలు సేవ ఎలాగుండునో అని నేను ఆశ్చర్యపడతాను. అలాగే, నాతో కలసి ప్రార్థనా సహాయం చేయు నా స్నేహితులే లేకపోతే ఈ రోజున నేను ఎక్కడ ఉండే వాడినో అనికూడా ఆశ్చర్యపోతాను.



## ప్రార్థన

తండ్రీ, నా కొరకును, డోరతి కొరకును ప్రార్థన చేయుటకు, నీ ప్రియమైన పిల్లలనేకుల హృదయాలలో నీవు ఉంచిన భారమును బట్టి, నాయెడల నీవు కల్గి ఉన్న నీ గొప్ప ప్రేమను నేను అర్థము చేసికొనలేను. అటువంటి ఆశ్చర్యకరమైన ప్రేమకు నేనేవిధముగా నా కృతజ్ఞతను వెల్లడి చేయగలను?

ఇప్పుడు ఈ నా స్నేహితులలో కొందరిని బహు ప్రత్యేకముగా ఈ విజ్ఞాపన ప్రార్థనలో ఆయనకు సమర్పిస్తాను. నేనాలాగు చేయునపుడు పరిశుద్ధాత్ముడు నా జీవితంను, హృదయమును వెలిగించిన రీతిగా దేవుడు తన స్వంత ఆదరణను ( బలమును) వారి బ్రతుకులకు, హృదయములకు, వారు ఆయన మీద పూర్ణముగా నమ్మకముంచుటను బట్టి వారికి కూడ అందించుమని, వాక్యపు వెలుగులో వారి గురించి ప్రార్థించుదును.*

## వాక్యపఠన

**15,17,18** వచనములు: మొదట మీ యొద్దకు వచ్చి... యూదయకు సాగనంపబడవలెనని ఉద్దేశించితిని.... అవును అవునని చెప్పుచు, కాదు కాదనునట్టు ప్రవర్తింపవలెనని నా యోచనలను శరీరానుసారముగా యోచించుచున్నానా?

ఈ ఆలోచనా వరుసలో నేను ధ్యానం చేస్తాను. తాను ప్రేమించిన పరిశుద్ధులకు ఆదరణను, ఓదార్పును, ప్రయోజనమును చేకూర్చుటకే, రెండవసారి తాను కొరింథి సంఘమునకు వెళ్ళుచున్నానని పౌలు సాక్ష్యమిచ్చెను. వారి దగ్గర నుండి స్వీకరించుటకే పౌలు అక్కడకు వెళ్ళలేదు

*విజ్ఞాపన ప్రార్థనలో నీకు ఇంకా ఉపయోగపడుటకు 153 - 155 పేజీలలో ఉన్న సూచనలను గమనించండి

గానీ, వారికి ఇచ్చుటకే పౌలు ఆశించినాడు. తన ప్రయాణము సులభమైన రీతిలో ఉద్దేశింపబడినది కాదని కూడ పౌలు స్పష్టపరిచాడు. (పౌలు ప్రయాణ ఖర్చులు ఎవరు చెల్లించెదరన్న విషయము గురించి ఏమీ వ్రాయబడలేదని నేను గమనించాను. అనగా ఆయన వెళ్ళుటలో డబ్బుకు ఏ ప్రమేయము లేదు). నిశ్చయముగా, పౌలు కొరింథునకు వెళ్ళుటలో వ్యక్తిగతమైన లాభము ఎంత మాత్రము లేదు.

## ప్రార్థన

ప్రియ ప్రభువా, రాబోయే వసంత కాలంలో నేను ఎక్కడ సువార్త సేవ చేయుట నీ చిత్తమో అది నేను నిర్ణయించుకొనునప్పుడు, నీ పరిశుద్ధ ఆత్మ చేయు పనిని ఆపి వేసే ఏ దురుద్దేశ్యము నాలో ఉన్నదో అది నాకు నీ వాక్యము ద్వారా, నీ ఆత్మ ద్వారా చూపించుము. ప్రభువా! పౌలు తన ప్రయాణ ఆలోచనలను మార్చుకొనుటకు నిర్ణయించుకొని నందున అతని ఉద్దేశ్యమును కొరింథిలోని క్రైస్తవులు అపార్థము చేసికొన్నప్పటికీ, కేవలము పరిశుద్ధాత్మ చేతనే పౌలు అక్కడికి సాగనంపబడినాడని నాకు తోచుచున్నది. తన ప్రయాణములలో పౌలు ముందుగా అవునని చెప్పి, తరువాత కాదు అని తన ఉద్దేశ్యమును మార్చుకొన్నప్పటికీ, తాను ప్రకటించిన వాక్యము ఎప్పుడూ కూడా అవును అని చెప్పి కాదని ఉండలేదు. గనుక నీకు స్తోత్రములు. ఎందుకంటే క్రీస్తులో ఏ సంగతైనా, ఎప్పుడు ఏ మార్పు లేని నిత్యమైన 'అవును' మాత్రమే. ప్రభువా నీ హృదయంలో ఏ మార్పులు లేవు. పౌలు ప్రకటించిన వాక్యము నీ చేత నిత్యత్వము వరకు సరిచూడబడినది.

పరిస్థితులు అతివేగంగా మారిపోయే ఈ ప్రపంచంలో ప్రణాళికలు తప్పక వేయవలసి ఉంది. కొన్నిసార్లు వాటిని మార్చుకొన వలసిన ఈ లోకంలో



ఒక గొప్ప స్థిరమైన రాయిగా నీవు ఉన్నందుకు నీకు నమస్కారములు. ప్రభువా! నేను నీ ఆలోచనలు తెలుసుకొనవలసి ఉన్నది. అవకాశవాదము, తొందర పాటు తనముల ద్వారా వచ్చే నిర్ణయముల నుండి నన్ను రక్షించుము. నీ సహవాసములో, ప్రతి రోజు నీతో నడువనిమ్మని వేడుకొనుచున్నాను. ఆమెన్.

**ఈ వాక్య భాగములో నేను స్వాధీనపర్చుకొనుటకేదైనా వాగ్దానమున్నదా?**

## వాక్యపఠన

**20** వచనము: "దేవుని వాగ్దానములు ఎన్నియైనను, అన్నియు క్రీస్తునందు అవునన్నట్లుగానే యున్నవి గనుక మన ద్వారా దేవునికి మహిమ కలుగుటకై అవి ఆయన వలన నిశ్చయములై ఉన్నవి".

## ప్రార్థన

ప్రభువా! మా ద్వారానా తండ్రీ! దేవుని వాగ్దానములు మా ద్వారానే! క్రీస్తులోని దేవుని వాగ్దానములా! ప్రభువా! క్రీస్తులో దేవుని వాగ్దానములన్నీనా! అవును తండ్రీ! నీకు వందనములు. ఈ ఉదయమున నీ పరిశుద్ధ సన్నిధిలో నా స్వంత ఇష్టమును గుర్తించి దానికి ఆమెన్ చెప్పుచున్నాను తండ్రీ! దేవా! క్రీస్తులో నీవు నా కిచ్చిన సమస్తమైనవన్నీ నేను గ్రహించలేను. నా ప్రియ ప్రభువా! వాస్తవానికి, నీవు లేకుండా నా జీవితము ఎంత శూన్యమైనదో నేను ఊహించలేను. ఈ రోజు యొక్క అవసరతలను, వాటి యొక్క అవకాశములను, నిర్ణయములను, పరీక్షలను నేను ఎదుర్కొనునపుడు ప్రియ ప్రభువా! నాకు కావలసిన వాడవు నీవే అని నేను స్థిరపర్చు కొనుచున్నాను.

ఆయన సమాధానము నా అంతరంగములో ప్రవహించుచుండగా, నా ప్రభువును ఆరాధించుటలోను, స్తుతించుటలోను కొంత సమయము గడుపుదును. నా ప్రార్థనా మనవులకు నిర్దిష్టమైన జవాబులు నాకు

తెలియనప్పటికీ, దేవుని సమాధానము నా హృదయములో నిండి ఉన్నందున అది అంతగా పట్టించుకొనే అవసరము లేదు. అమూల్యమైన సహవాస సమయమును నేను నా దేవునితో గడిపాను. ఆయన్ను స్తుతించండి. ఈలాగున నేటి దినములోనికి నేను ప్రవేశించగానే, నేడు నేను ఎదుర్కొనే సవాళ్ళకు, నా మనస్సు, హృదయము దీటుగా నిలబడునట్లుగా, దేవుడు తన వాక్యములో నుండి అమూల్యమైన ఆహారమును నాకు దయచేసారు.

మనలో ప్రతి ఒక్కరము చేయవలసిన ప్రాథమికమైన, అన్నిటి కంటే ముఖ్యమైన విధియేదనగా, ప్రతి ఉదయము ఆయన సన్నిధిలోనికి వెళ్ళి, ఆయన యెదుట మన ఆత్మను ఆనందకరమైన స్థితిలోనికి తెచ్చుకొనుటయే అని ఎల్లప్పుడూ గుర్తుంచుకొందాము.

ప్రతిరోజు ప్రభువైన యేసు, తన స్వీయ సామీప్య ఆహ్వానమును నీకు అందించుచున్నారని తెల్సుకొనుట ఎంత ఆశ్చర్యకరము! నీ పేరు పెట్టి పిలిచి 'వచ్చి భోజనము చేయుమని' దయాపూర్వకముగా ఆయన నిన్ను ఆహ్వానించు చున్నారు.

మార్పులేని నీ సత్యము ఎప్పుడూ స్థిరముగానే ఉన్నది;
నిన్ను పిలిచే వారిని నీవు రక్షించుదువు;
నిన్ను వెదకు వారికి నీవు ఎంతో మంచివాడవు
నిన్ను కనుగొను వారికి నీవే సమస్తములో సమస్తము

ఓ జీవాహారమా! మేము నిన్ను రుచి చూచుచున్నాము
ఇంకను నిన్ను భుజించుటకు ఎంతో ఆశించుచున్నాము
ఓ నిత్య జీవ జలమా! నిన్నే మేము నిత్యము త్రాగుచున్నాము
నీతో నింపబడుటకే మా ఆత్మలు దప్పిగొనుచున్నవి.

– క్లెయిర్‌వాక్స్‌కు చెందిన బెర్నార్డ్



## అనుబంధము - 1

# సహవాస సమయము

నీ అనుదిన వాక్య పఠనములో, ప్రతి వచనమును నీవు ధ్యానించునపుడు ప్రశ్నించుకొనవలసిన కొన్ని అంశములు ఈ క్రింద ఇవ్వబడినవి.

ఈ వచనములో ఏదైనా:

(i) వదిలివేయవలసిన పాపమున్నదా?

(ii) పాటించవలసిన హెచ్చరిక ఉన్నదా?

(iii) లోబడవలసిన ఆజ్ఞ ఉన్నదా?

(iv) అనుసరించ వలసిన మాదిరి ఉన్నదా?

(v) విజర్జించవలసిన చెడు ప్రవర్తన ఉన్నదా?

(vi) తండ్రియైన దేవుని గూర్చిన నూతన తలంపు ఉన్నదా?

(vii) కుమారుడైన దేవుని గూర్చిన నూతన తలంపు ఉన్నదా?

(viii) పరిశుద్ధాత్మను గూర్చిన నూతన తలంపు ఉన్నదా?

(ix) సాతాను వ్యక్తిత్వము గురించి ఏదైనా నూతన ఆలోచన ఉన్నదా?

(x) సాతాను క్రూరమైన ఆలోచనలను గురించి ఏదైనా నూతన అవగాహన ఉన్నదా?

(xi) సాతాను మోసపూరిత పన్నాగములను గురించి ఏదైనా నూతన వెలిగింపు ఉన్నదా?

*"మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండా, వాక్య ప్రకారము ప్రవర్తించు వారునై యుండుడి. అయితే స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి, నిలకడగా ఉండువాడెవడో వాడు విని మరచు వాడు కాక, క్రియను చేయువాడై ఉండి తన క్రియలో ధన్యుడగును". (యాకోబు 1:22,25)*

## అనుబంధము - 2

### బైబిలు ధ్యానము

నీవు చదువబోవు బైబిలు వాక్యములకు అనుబంధముగా, నీ యొక్క సాంప్రదాయ బైబిలు ధ్యానము నీకు నిజమైన బహుమానమును తెచ్చుటకు, మరికొన్ని ప్రశ్నలను మీ ముందుంచు చున్నాను.

(i) ఈ వాక్యము ఎవరి గురించి మాట్లాడుచున్నది?

(ii) ఈ వాక్యము ఎవరి కొరకు ఉద్దేశించబడినది?

(iii) ఏ ప్రత్యేక మాటలు రచయిత ఉపయోగించారు?

(iv) ఎప్పుడు ఈ వాక్య భాగము వ్రాయబడినది?

(v) ఎక్కడ నుండి ఈ వాక్య భాగము వ్రాయబడినది?

(vi) ఏ ఉద్దేశ్యముతో ఈ వాక్య భాగము వ్రాయబడినది?

(vii) ఏ పరిస్థితిలో ఈ వాక్య భాగము వ్రాయబడినది?

(viii) *ఈ భాగమునకు ముందున్న వాక్యమునకు తరువాత వచ్చే వాక్యమునకు అను సంధానముగా ఈ వాక్యము ఏలాగు సరిపోయినది?*

*"దేవుని యెదుట యోగ్యుని గాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యము సరిగా ఉపదేశించు వానిగాను, నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2 తిమోతి 2:15).*

*గమనిక:* సంప్రదాయబద్ధమైన బైబిలు పఠనము ప్రతిరోజు తప్పనిసరిగా ఆచరించవలసిన అవసరము లేదు కానీ... అనుదిన సహవాస సమయము మాత్రము నీ ఆత్మీయ అభివృద్ధికి కావలసిన విధియై యున్నది.



## అనుబంధము - 3

### అనుదిన ప్రార్థనా మార్గదర్శి

50 సం॥ల క్రితము నేను క్రీస్తులోనికి మారినపుడు, థామస్ బి. రీస్‌గారిచే మొదటగా సూచించబడిన అనుదిన ప్రార్థనా క్రమమును; మా విజ్ఞాపనా ప్రార్థనకు సహాయపడునట్లు, డోరతి నేను అనుసరించుటకు నిర్ణయించు కొన్నాము.

సోమవారము సువార్తికుల కొరకు: ఆలాగున:

దేవుని వాక్యము చేత మన ఆత్మలను పోషించుకొని, శిరస్సు నుండి హృదయము లోనికి వచ్చునట్లుగా ప్రార్థించిన తరువాత విజ్ఞాపన ప్రార్థన ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొనును. శ్రద్ధ లేకుండా పైపైన చేయు అనుదిన క్రమమునకు బదులుగా ఇతరుల కొరకై చేయు మనవి, నూతనమైన కృతజ్ఞతను, విజ్ఞాపనను శ్రద్ధను పొడిగించే ప్రార్థనా సమయముగా మారగలదు. ఈ ప్రకారంగా చేయుటకు మన దగ్గర అచ్చువేయబడిన ప్రార్థనాంశములు లేవు గానీ అవి ఏవైనా సరే, అన్ని అత్యవసర ప్రార్థనావసరతలను ఆవరించుకొనులాగున, మన ప్రార్థన సమయము విస్తరింప చేయబడుటకు మనము పరిశుద్ధాత్మనే నమ్ముకొందుము.

*"దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి". (ఫిలిప్పి 4:6)*

*గమనిక:* ఈ క్రింది 'అనుదిన ప్రార్థనా మార్గదర్శి' నీ యొక్క వ్యక్తిగత, అనుదిన ప్రార్థనావసరతలను గురించి నీవు ప్రార్థించుటకు ఒక ఆటంకము కాబోదు.

# ప్రతిదిన ప్రార్థనా మార్గదర్శి

**సోమవారము** : సువార్తికులు: ఎవరి సేవలోనైతే, ఏ మిషనులోనైతే ఆయన మనలను భాగస్వాములనుగా చేసాడో వారి గురించి, మనకు ఇష్టమైన వారి సేవ గురించి ప్రార్థించవలెను.

**మంగళవారము** : *మంగళ స్తోత్రములాచరించుట*: ఆయన ఇచ్చిన సమస్తమునకు, ఆయన చేయబోవు దానికి, ఆయన చేసిన దానికి, ఆయన మనతో నిర్దిష్టముగాఉన్న సమయమునకు; ఒక ప్రత్యేక కృతజ్ఞతా ఆరాధన చెల్లించు సమయమును నియమించు కొనుట.

**బుధవారము** : పనివారు: పాదుర్లు, సువార్త సేవకులు, బైబిలు బోధకులు, క్రైస్తవ సేవకులు మొదలగు వారి గురించి ప్రార్థించవలెను.

**గురువారము** : నెరవేర్చవలసినవి: ఇంటి బాధ్యతలు, సేవాపరమైన విధులు, ఆర్థికపరమైన అవసరతలు మొదలగు వంటి గురించి ప్రార్థించవలెను.

**శుక్రవారము** : కుటుంబము: మన స్వంత చిన్న కుటుంబము, బందువులు, మనకు (ఉదా: డోరతికి, నాకు) సహాయము చేసే మిత్రులు, క్రీస్తులో మన పిల్లలు, మనవరాండ్రు మొదలగు వారి గురించి ప్రార్థించవలెను.

**శనివారము** : పాపులు: ప్రపంచమంతా 'దేవుని కొరకైన నీ అన్వేషణ' అను పుస్తకము జరిగించు చున్న సేవ, వీధులలో మనము కలుసుకొని సాక్ష్యమిచ్చిన వారు, క్రీస్తులో లేని ఇతర బంధువుల కొరకు ప్రార్థించ వలెను.



**ఆదివారము** : పరిశుద్ధులు: రక్షకుని నూతనముగా కనుగొన్న విశ్వాసులు (మన మెరిగినవారు), ఎవరి ద్వారానైతే దేవుడు మన జీవితములను మెరుగుపరిచారో ఆ ప్రార్థనా సహకారులు, హింసింప బడుచున్న సంఘములను గూర్చి మనకు తెలిసిన పూర్తి వివరములు, సంఘములో ఉజ్జీవము మొదలైన అంశములను గూర్చి ప్రార్థించవలెను.

your-quest-for-God-(Telugu).jpg - Gmail

cmyk

**57 భాషల్లో 30 లక్షల ప్రతులు ముద్రణలో వున్నాయి**



# దేవుని కొరకు నీ అన్వేషణ

డా. రిచర్డ్ ఎ. బెన్నెట్‌గారి జీవనం ఓ నగర ప్రణాళికునిగా ప్రారంభమైంది. రిచర్డ్ తన శిక్షణా సమయంలో జీవితాన్ని రూపాంతరం చెందించే రీతిలో దేవుని శక్తిని ఎదుర్కొన్నాడు. అటు తర్వాత అమెరికా దేశంలో బైబిల్‌పరమైన విద్యనభ్యసించడం కోసం అంతవరకు ఓ ఇంగ్లీషు కౌన్సిల్‌లో చేస్తున్న తన ఉద్యోగానికి రాజీనామా చేసాడు.

ఓ సామాన్యునిగా ప్రారంభించిన రిచర్డ్ బెన్నెట్ 1946 నుండి వాక్య నియమాలను ఆసక్తిగల శ్రోతలతో పంచుకుంటూ వచ్చాడు. ఆ 20 సంవత్సరాల కాలంలో ఐరోపా, ఆఫ్రికా, ఆసియా, మధ్య మరియు దక్షిణ అమెరికా దేశాలలో ట్రాన్స్ వరల్డ్ రేడియో, ఫార్ ఈస్ట్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పోరేషన్‌ల ద్వారా ఆయన స్వరం క్రమం తప్పక వినబడింది.

1958లో రిచర్డ్, డోరతీల వివాహమైనప్పటి నుండి వారిరువురు కలసి తమ దేవుణ్ణి సంతోషంగా సేవించారు. రిచర్డ్ పక్షంగా పరిచర్య చేస్తూనే డోరతీ తనంతటతానుగా ఎంతో ఘనమైన స్త్రీల పరిచర్య జరిగించింది.

ఈ మధ్యకాలంలోనే రిచర్డ్ డోరతీల కాన్ఫరెన్సు పరిచర్య మునుపెన్నడూ దర్శించని దేశాలకు, ప్రజలకు విస్తరించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలను వారు సందర్శించిన సమయంలో ఎంతో ఆధ్యాత్మిక ఆకలిదప్పులు కలిగియున్న స్థానిక జాతీయుల్ని కలుసుకోగలిగినందుకు వారెంతగానో ఆనందించారు. అయితే వారి ఆనందం ఎంతో కాలం నిలువలేదు. పేదరికం, ఆకలితో, సమస్తం పోగొట్టుకున్న స్థితిలో దయనీయంగా మారిన సాటి మనుష్యుల జీవితాలను చూచి దుఃఖించారు. ఆ ప్రజల పట్ల దేవుని ప్రేమ రిచర్డ్ డోరతీలను పురికొల్పి వారికోసం ఆత్మీయ, వస్తురూపక సహాయం అందించగలిగేలా చేసింది.

అయితే, కేవలం అభివృద్ధిచెందుతున్న దేశాలలో మాత్రమే కాకుండ పారిశ్రామిక దేశాలలో సహితం దేవునితో వ్యక్తిగత సంబంధము కలిగియుండాలన్న తృష్ణను తమ హృదయాలలో కలిగియున్న ప్రజలను కలిసికొని బెన్నెట్ కుటుంబం సంతోషించింది. ఎంతోమంది అలాంటి ప్రజలకు ఎన్నో ప్రశ్నలున్నాయి.

మరి జీవితంలో అతి ప్రాముఖ్యమైన ప్రశ్నలకు నమ్మదగిన జవాబులున్నాయా? దేవుడే స్వయానా ఈ ప్రశ్నలకు జవాబులు దయచేసాడన్న నిశ్చయత రిచర్డ్ బెన్నెట్‌కుంది. అందుకే ఆయన దేవుని కొరకు నీ అన్వేషణ అనే పుస్తకాన్ని రాసాడు.

**"20 సంవత్సరాలుగా నేను ప్రార్థించింది ఈ పుస్తకం కోసమే!"**
జార్జ్ వర్వర్

ISBN 81-7362-234-5
9 788173 622342 00250
Your Quest for God *(Telugu)*

Authentic


www.ccim-media.com

దేవుని కొరకు నీ అన్వేషణ

బెన్నెట్

A

# దేవుని కొరకు నీ అన్వేషణ



## రిచర్డ్ ఎ. బెన్నెట్

cmyk

file:///Z|/CCIM/Books/Quest/India/Telugu/your-quest-for-God-(Telugu)_jpg%20-%20Gmail.htm[5/31/2012 10:25:23 AM]